PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 185 | విజయవాడ, గురువారం 6 ఫిబ్రవరి 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 6 February 2025 | Rs

2019-24 మధ్య మద్యం అమ్మకాలపై సిట్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

2019-24 మార్చి వరకు జరిగిన మద్యం అమ్మకాలపై రాష్ట్ర ప్రభుత్వం సిట్‌ను నియమించింది. ఈ మేరకు సాధారణ పరిపాలనాశాఖ జిఓ ఆర్‌టి నెంబరు 262ను బుధవారం విడుదల చేసింది. సిట్‌కు విజయవాడ పోలీస్ కమిషనరు రాజశేఖర్‌బాబు ఆధ్వర్యాన ఏడుగురు సభ్యులను కేటాయించారు. మద్యం అమ్మకాలకు సంబంధించి సిట్‌కు అవసరమైన పూర్తి సమాచారం ఇవ్వాలని ఎక్సైజ్‌శాఖకు ఆదేశాలు జారీ అయ్యాయి. దర్యాప్తు బృందం ప్రతి 15 రోజులకోసారి సిఐడి చీఫ్ ద్వారా ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని జిఓలో స్పష్టం చేశారు.



ఆంధ్ర ఆర్చర్ గణేశ్‌కు కాంస్యం

38వ జాతీయ క్రీడల్లో ఆంధ్ర ఆర్చర్లు అదరగొడుతున్నారు. కాంపౌండ్ ఆర్చరీలో నెల్లూరుకు చెందిన గణేశ్ మణిరత్నం కాంస్య పతకాన్ని సాధించాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ కాంపౌండ్ ఆర్చరీ ఆంధ్రకు కాంస్య పతకాన్ని అందించాడు. దీంతో జాతీయ క్రీడల్లో ఆంధ్రకు దక్కిన పతకాల సంఖ్య ఆరుకు చేరింది. ఇందులో 2స్వర్ణాలు, 4కాంస్య పతకాలున్నాయి.

'హోదా' డిమాండ్ పునరుద్ధరించండి

• పక్కన పెట్టడం పెద్దతప్పు • కేంద్రం నుంచి నిధులు రాబట్టేందుకు పోరాటం

- రాష్ట్రప్రజలు అండగా ఉంటారు
- ప్రజల ఆదాయాలు పెంచాలి
- కార్పొరేట్లకు వనరులను అప్పగించొద్దు
- సిపిఎం రాష్ట్రకార్యదర్శి వి శ్రీనివాసరావు
- రాష్ట్ర మహాసభ నిర్ణయాలు వెల్లడి



మహాసభ నిర్ణయాలను మీడియాకు వివరిస్తున్న రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, వేదికపై రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సిహెచ్ బాబూరావు, కె ప్రభాకర్ రెడ్డి, డి రమాదేవి, వి వెంకటేశ్వర్లు, వి ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్టానికి ప్రత్యేక హోదా డిమాండ్‌ను పునరుద్ధరించాలని సిపిఎం రాష్ట్రకార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. హోదా ఇస్తే పెట్టుబడులు, పరిశ్రమలు వచ్చి ప్రజలకు ఉపాధి పెరుగుతుందని వెల్లడించారు. ప్రత్యేకహోదా ఏజెండాను పక్కన పెట్టడమే పెద్ద తప్పని అన్నారు. ఈ నెల 1,2,3 తేదీల్లో నెల్లూరులో జరిగిన సిపిఎం 27వ రాష్ట్ర మహాసభ నిర్ణయాలను విజయవాడలోని బాల్సోత్సవ భవన్‌లో బుధవారం ఆయన మీడియాకు వివరించారు. రాష్ట్రానికి హోదా వస్తేనే పెట్టుబడులు, పరిశ్రమలు వస్తాయని, ఉపాధి కూడా పెరుగుతుందన్నారు. బీహార్‌కు ప్రత్యేక హోదా కల్పించాలని జెడియు నిరంతరం పోరాటం చేస్తున్నదన్నారు. మన రాష్ట్రానికి రావాల్సిన హోదాను మాత్రం తాకట్టు పెట్టారని విమర్శించారు. చట్టపరంగా రావాల్సిన నిధులు, ప్యాకేజీలను తీసుకురావడం లేదన్నారు. హోదా వస్తే రాష్ట్రంలో పెట్టుబడులు వస్తాయని కార్పొరేట్ల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండదన్నారు. ప్రజలపై భారాలు వేస్తే మోయగలిగే పరిస్థితిలో లేరని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వాస్తవాలు గుర్తించడాన్ని ఆయన ఆహ్వానించారు. ప్రజల ఆదాయాలు పడిపోతున్నాయని, భారాలు భరించలేని స్థితిలో లేరనే అంశాన్ని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేతో తేటతెల్లమయిందన్నారు. ఈ అంశాలను తాము గతంలోనే చెప్పామని వివరించారు. ప్రజల ఆదాయాలు పెరిగితేనే ఆర్థిక వ్యవస్థ ముందుకు వెళుతుందన్నారు. రాయితీలు ఇచ్చి ప్రజల ఆదాయం పెంచే అంశాలను ఆలోచించాలని కోరారు. ప్రభుత్వ ఖజానా ఖాళీ అయ్యిందని ఎన్నికల్లో ప్రచారం చేసిన చంద్రబాబుకు ప్రజల అప్పుల్లో ఉన్న సంగతి తెలియదా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన విద్యుత్ చార్జీల పాపాన్ని కూటమి ప్రభుత్వం ప్రజల నెత్తిన వేసిందన్నారు. చరిత్రలో ఎప్పుడూ లేనట్లుగా భారాలు మోపారని, ఆ సమయంలో ప్రజలు భరించలేరని తాము చెప్పినా వినలేదన్నారు. ప్రజలపై భారాలు మోపబోమని ఇప్పుడు చెప్పిన మాటకు కట్టుబడి ఉండాలని కోరారు. ప్రభుత్వ ఆస్తులను అమ్మి రాష్ట్ర ఖజానాను నింపుకునే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసిందని, ఈ నిర్ణయాన్ని తాము సమర్థించబోమన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన బకాయిలపై దృష్టిసారించాలని సూచించారు. కేంద్రం ఇప్పటికే రూ.20వేల కోట్ల బకాయి ఉందని, పోలవరం నిర్వాసితులకు నిధులు ఇవ్వాలని తెలిపారు. కాంట్రాక్టరలకు మేలు జరిగేలా పోలవరం ప్రాజెక్టు అంచనాలను సవరిస్తున్న ప్రభుత్వం పునరావాస ప్యాకేజ్‌ను ఎందుకు పెంచడం లేదని నిలదీశారు. 18 ఏళ్లు నిండిన నిర్వాసితులకు ప్యాకేజ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతేడాది బడ్జెట్‌లో వెనుకబడిన జిల్లాలకు ప్రకటించిన నిధుల్లో ఇప్పటివరకు ఒక్కరూపాయి కూడా విడుదల చేయలేదని చెప్పారు. కేంద్రం నుంచి నిధులు రాబట్టకుండా రాష్ట్రాన్నిఎలా అభివృద్ధి చేస్తారని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం టిడిపి, జెడియులపై ఆధారపడి వుందని ఆంధ్ర, బీహార్ రాష్ట్రప్రభుత్వాలు కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తే తక్షణమే నిధులు వస్తాయని అన్నారు. ఆంధ్రుల ఆత్మ గౌరవమే ప్రధాన నినాదంగా ఏర్పాటైన టిడిపి తెలుగు ప్రజల ఆత్మ గౌరవాన్ని ఢిల్లీలో తాకట్టు పెట్టిందని విమర్శించారు. కేంద్రంతో పోరాడి నిధులు తెచ్చుకునే సంప్రదాయాన్ని ఎన్టీ రామారావు తీసుకొచ్చారని, ఇప్పుడు ఆయన ఉద్దేశాలకే టిడిపి సమాధి కడుతోందని విమర్శించారు. వెనుకబడిన జిల్లాలకు ప్యాకేజ్ ఇవ్వాల్సి ఉందని, రాజధానికి నిధులు ఇవ్వకుండా రూ.12వేల కోట్ల అప్పు కేంద్రం ఇప్పిస్తుందని, ఇది ప్రజలపై పడే భారం కాదా అని ప్రశ్నించారు. కేంద్రం నుంచి రావాల్సిన వాటిని పోరాడి తీసుకొస్తేనే రాష్ట్రఅభివృద్ధి వేగంగా పరుగులు తీస్తుందని చెప్పారు. విశాఖస్టీల్ ప్లాంట్‌ను మూసేందుకు మిట్టల్ తీసుకొచ్చే ఫ్యాక్టరీ కోసం ఢిల్లీ చుట్టూ తిరుగుతున్నారే తప్ప ప్రభుత్వ రంగంలో రావాల్సిన కడప ఉక్కు ఫ్యాక్టరీని అడగటం లేదన్నారు.

8 నెలల్లోనే ప్రభుత్వంపై అసంతృప్తి

టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడిన 8 నెలల్లోనే ప్రజల్లో అసంతృప్తి ఏర్పడిందని చెప్పారు. వైఎస్ జగన్ విధానాలను తిరస్కరించి కూటమిపై నమ్మకంతో ప్రజలు గెలిపించారని చెప్పారు. ఈ నమ్మకాన్ని నిలబెట్టుకోకుండా జగన్ విధానాలనే కొనసాగిస్తోందని విమర్శించారు. స్మార్ట్‌మీటర్ల అంశంలో గత ప్రభుత్వానికి, కూటమి ప్రభుత్వానికి తేడా లేదన్నారు. అదానీ కోసం మాజీముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకొచ్చిన మీటర్లను కొనసాగిస్తోందన్నారు. స్మార్ట్ మీటర్లను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ మీటర్లు వల్ల అనేక చోట్ల విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయని చెప్పారు. సెకి ఒప్పందంలో అవినీతి జరిగిందని అమెరికాలో విచారణ జరుగుతోందన్నారు. సెకితో ఈ ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మొట్టమొదటి సంతకం చేసిన డిఎస్సికి అతీగతి లేదన్నారు. 'సాల్ట్' అమలు చేయడం ద్వారా ప్రకటించిన పోస్టులకు కూడా కోతలు పెట్టేందుకు ప్రయత్నం జరుగుతోందన్నారు. విద్యా విధానాన్ని ముక్కలు ముక్కలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలు, జూనియర్ కళాశాలలను విలీనం చేసి కాంట్రాక్టు లెక్చరర్లను ఇంటికి పంపే ప్రయత్నం జరుగుతోందన్నారు. ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేస్తేనే ప్రజల్లో ఉన్న

మిగతా 7లో

కేంద్ర నిధుల్లో భారీ కోత

జనవరి వరకు తగ్గిన 3,324 కోట్లు

సిఎం సమీక్షలో వెల్లడించిన అధికారులు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

కేంద్రం నుంచి రాష్టానికి రావాల్సిన నిధుల్లో భారీ కోత పడింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)కు సంబంధించిన ఈ నిధుల కోతను ఆర్థికశాఖ వర్గాలు ధృవీకరించాయి. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయడు నిర్వహించిన ఒక సమీక్షా సమావేశంలో ఆర్థికశాఖ అధికారులు కోతల వివరాలను వెల్లడించారు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏ శాఖకు ఎంత నిధులు తగ్గాయో వివరిస్తూ ఒక నివేదికను కూడా సిఎంకు అధికారులు అందచేసినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జనవరి వరకు కేంద్రం నుండి వివిధ పథకాలకు అందవలసిన నిధులు 3,324 కోట్ల రూపాయలు తగ్గినట్లు సమాచారం. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఒక్క కేంద్ర పన్నుల్లో వాటా నిధులు తప్ప మిగిలిన అన్ని రంగాల్లో కోతలు పడుతున్నట్లు తాజా గణాంకాలు వెల్లడించాయి. గత ఏడాది జనవరి వరకు రు.59,146 కోట్లు కేంద్రం నుంచి రాగా, ఈ ఏడాది జనవరి వరకు 55,822 కోట్లు మాత్రమే వచ్చినట్లు ఆర్థిక శాఖ తేల్చింది. ఆర్థిక సంఘం నిధుల్లోనూ భారీ తగ్గుదల కనిపిచింది. గతేడాది 6,227 కోట్లు రాగా, ఈ ఏడాది కేవలం 3,508కోట్లు మాత్రమే వచ్చాయి. ఆదాయ లోటుకు గానూ ఈ ఏడాది ఒక్క రూపాయి కూడా రాకపోవడం పట్ల అధికారులే ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. . ఇక స్థానిక సంస్థల బలోపేతానికి ఇచ్చే నిధులు కూడా తగ్గినట్లు తేలింది. గతేడాది 2,507 కోట్లురాగా, ఈ ఏడాది 2,415 కోట్లు మాత్రమే వచ్చాయి.

కేంద్ర ప్రాయోజితాలపైనా కోతలే

రాష్ట్రంలో అమలు చేసే కేంద్ర ప్రాయోజిత పథకాల నిధుల్లోనూ కోతలు పడ్డాయి. గత ఆర్థిక సంవత్సరంలో 8,950 కోట్లు పలు పథకాలకు వచ్చాయి. ఈ ఏడాది మాత్రం దాదాపు 500 కోట్లు తగ్గి 8,465 కోట్లు మాత్రమే రాష్ట్రానికి వచ్చాయి. ఎక్స్‌టర్నల్లీ ఎయిడెడ్ ప్రాజెక్టుల కింద గత ఏడాది పాతిక కోట్లు రాగా, ఈ ఏడాది ఒక్క రూపాయి కూడా రాలేదని ఆర్థికశాఖ గణాంకాలు వెల్లడించారు.

కేంద్రం నుంచి వచ్చిన నిధుల వివరాలు (రూ. కోట్లలో)

విభాగం	జనవరి-24 వరకు	జనవరి-25 వరకు
ఆర్థిక సంఘం నిధులు	6227	3508
ఎ. స్థానిక సంస్థలకు	2507	2415
బి. ఎస్‌డిఆర్‌ఎఫ్	987	1036
సి. ఎన్‌డిఆర్‌ఎఫ్	---	57
డి. ఆరోగ్య రంగానికి	490	---
ఇ. లోటు నిధులు	2243	---
కేంద్ర ప్రాయోజిత	8950	8465
సిఆర్‌ఎఫ్	289	213
జిఎస్‌టి లోటు	---	164
ఆర్‌డి నిధులు	10,461	---
ఇఎపి	25	---



అమృత్‌సర్‌లోని శ్రీగురుదాస్ రామదాస్ జీ అంతర్జాతీయ విమానశ్రయంలో బుధవారం దిగిన అమెరికా సైనిక విమానం

105 మంది భారతీయులు రాక

- అమృతసర్‌లో దిగిన అమెరికా సైనిక విమానం
- ట్రంప్ చర్యలపై పంజాబ్ ప్రభుత్వ అసంతృప్తి

అమృతసర్ : వీసా గడువు ముగిసిన, చట్టబద్ధమైన పత్రాలు లేకుండా అమెరికాలో నివసిస్తున్న కొంతమంది భారతీయులను తీసుకొచ్చిన అమెరికా మిలటరీ విమానం బుధవారం మధ్యాహ్నం అమృతసర్ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగింది. మధ్యాహ్నం 1.55గంటలకు ల్యాండ్ అయిన ఈ విమానంలో తొలి విడతగా మొత్తంగా 105మంది భారతీయులు వచ్చారని అధికారులు తెలిపారు. వీరిలో 30మంది పంజాబ్, 33 మంది హర్యానా, మరో 33మంది గుజరాత్‌కు చెందినవారు వున్నారు. మహారాష్ట్ర, యుపిల నుండి ముగ్గురేసి చొప్పున, చండీగఢ్ నుండి ఇద్దరు వున్నారని సంబంధిత వర్గాలు తెలిపాయి. వీరిలో మొత్తంగా 25మంది మహిళలు, 12మంది మైనర్లు, అందరికన్నా అతి పిన్న వయస్కుడు నాలుగేళ్ల చిన్నారి అని ఆ వర్గాలు తెలిపాయి. 25ఏళ్లలోపు వయస్సున్నవారు 48మంది వున్నారు. టెక్సాస్ నుండి బయలుదేరిన ఈ విమానంలో 11మంది విమాన సిబ్బంది, ఈ తరలింపు ప్రక్రియను పర్యవేక్షిస్తున్న 45మంది అమెరికా అధికారులు కూడా వున్నారు. కచ్చితంగా ఎంతమంది వచ్చారనే విషయమై ఇంతవరకు అధికారిక ప్రకటన లేదు. 205మంది భారతీయులను అమెరికా విమానంలో పంపినట్లు తొలుత వార్తలు వచ్చాయి. వెనక్కి పంపే ముందు ప్రతి ఒక్కరి రికార్డులను పరిశీలించినట్లు ఢిల్లీలోని అమెరికా

మిగతా 7లో

త్వరలో హెచ్-1బి వీసాల ఆటోమేటిక్ రెన్యువల్ రద్దు?

రిపబ్లికన్ల తీర్మానం ఆమోదిస్తే భారతీయులపై తీవ్ర ప్రభావం

వాషింగ్టన్ : హెచ్-1బి, ఎల్ 1 వంటి వర్క్ వీసాల పొడిగింపును ట్రంప్ సర్కార్ త్వరలో రద్దు చేసే అవకాశం వుంది. అమెరికాలో ఉద్యోగాలు చేసుకోవడానికి అవకాశం కల్పించే ఈ వీసాల ఆటోమేటిక్ రెన్యువల్ కాలాన్ని అప్పటికి వున్న 180 రోజుల నుండి 540 రోజులకు పెంచుతూ బైడెన్ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఆ నిర్ణయాన్ని రద్దు చేయాలని కోరుతూ రిపబ్లికన్ సెనెటర్లు జాన్ కెన్నడీ, రిక్ స్కాట్ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఇమ్మి గ్రేషన్‌పై, కఠినమైన వర్క్ వీసా నిబంధనలపై ట్రంప్ సర్కార్ తీవ్రమైన చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో బైడెన్ కాలం నాటి ఈ నిర్ణయాన్ని రద్దు చేయాలని సెనెటర్లు కోరారు. వీసాల పొడిగింపును ట్రంప్ రద్దు చేస్తే అత్యధిక ప్రభావం భారతీయులపై పడుతుంది. అమెరికాలో 3,86,000మందికి హెచ్-1బి వీసాలు జారీ చేయగా, వారిలో 72.3శాతం మంది భారతీయులే. 2022లో ఈ సంఖ్య 77శాతంగా వుంది. 2024లో అమెరికా పౌరసత్వం లేదా గ్రీన్ కార్డులు తీసుకున్న రెండో అతిపెద్ద గ్రూపు భారతీయులే. వీరి సంఖ్య 49,700గా వుంది.

ప్రయివేటుకు ప్రభుత్వ వైద్య కళాశాలలు?

- నాలుగు కాలేజిలకు పిపిపి రూటు
- ఇప్పటికే పులివెందుల కళాశాల సిబ్బంది బదిలీ



అన్నమయ్య జిల్లా మదనపల్లి వైద్య కళాశాల

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రాష్ట్రంలోని కొన్ని ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుకు అప్పగించడానికి రంగం సిద్ధమౌతోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఈ దిశలో ఇప్పటికే చర్యలు ప్రారంభమైనట్లు తెలిసింది. గతంలోనే చిత్తూరు ప్రభుత్వ వైద్య కళాశాలను అపోలోకు కట్టబెట్టిన సంగతి తెలిసిందే. తాజాగా మరో నాలుగు కళాశాలలను పిపిపి రూటులో అప్పగించనున్నట్లు తెలిసింది. కడప జిల్లా పులివెందుల, అన్నమయ్య జిల్లా మదనపల్లి, ప్రకాశం జిల్లా మార్కాపురం, కర్నూలు జిల్లాలోని ఆదోని ప్రభుత్వ వైద్య కళాశాలలు ఈ జాబితాలో ఉన్నాయి ఈ మేరకు ఆయా కళాశాలల సిబ్బందికి ఇప్పటికే అనధికార సమాచారం అందింది. దీంతో, వారిలో ఈ విషయం చర్చనీయాంశమైంది. ఆ వర్గాలు చెబుతున్న సమాచారం ప్రకారం ఇప్పటికే ప్రైవేటు భాగస్వామ్యానికి సంబంధించిన మార్గదర్శకాలు సిద్ధమయ్యాయి. కొన్ని కార్పొరేట్ వైద్య సంస్థలతో కూడా ప్రభుత్వం నుండి చర్చల ప్రక్రియ కూడా ప్రారంభమైనట్లు తెలిసింది. ఒకటి, రెండు నెలల్లోనే అధికారికంగా ఉత్తర్వులు కూడా వచ్చే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. ఇప్పటికే పులివెందుల వైద్య కళాశాలకు చెందిన 40 మంది వైద్యులను, 50 మంది మినిస్టీరియల్ ఉద్యోగులను, 120 మంది మంది కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బందిని నంద్యాల, తిరుపతి, రాజమండ్రి, ఏలూరు తదితర ప్రభుత్వ మెడికల్ కళాశాలలకు ఇరవై రోజుల క్రితం బదిలీ చేశారు. దీంతో ఈ కళాశాలను ప్రైవేటు పరం చేయడం ఖాయమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు ఈ నాలుగు కళాశాలల్లోని 160 మంది వైద్యులు, 200 మంది మినిస్టీరియల్ ఉద్యోగులు, 480 మంది ఉద్యోగులు తమ భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ముగియనున్న అవుట్‌సోర్సింగ్ గడువు

ఆగస్టు ఎనిమిదవ తేది నాటికి నాలుగు కళాశాలలకు చెందిన 480 మందికి పైగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల గడువు ముగియనుంది. ఇప్పటికే పులివెందుల మెడికల్ కళాశాలకు చెందిన 120 మంది కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల రిక్రూట్‌మెంట్‌ను ప్రభుత్వం నిలిపివేసింది.. దీంతో మిగిలిన అవుట్‌సోర్సింగ్ సిబ్బందినికూడా ఇంటికి పంపుతారా? ఇతర సంస్థలకు తరలిస్తారా; అన్న విషయం చర్చనీయాంశంగా మారింది. తమ చేతిలో ఏమీలేదని, ప్రభుత్వ ఆదేశాల ప్రకారమే వ్యవహరించాల్సిఉంటుందని స్థానిక అధికారులు అంటున్నారు.

రేసులో 'అపోలో' ముందంజ?

చిత్తూరు ప్రభుత్వ మెడికల్ కాలేజిని దక్కించుకున్న అపోలో సంస్థే తాజా పిపిపి రేసులోనూ ముందుఉన్నట్లు తెలిసింది. జాబితాలో ఉన్న ఒకటి, రెండు కళాశాలలను అపోలో యాజయాన్యం తరపున ఇప్పటికే పరిశీలించినట్లు తెలిసింది. ప్రభుత్వ మార్గదర్శకాలు కూడా ఈ దిశలోనే సిద్ధమౌతున్నట్లు తెలిసింది. పూర్తిస్థాయి మార్గదర్శకాలు విడుదలైన తరువాత ఇతర సంస్థలు ఏమైనా పోటీ పడతాయా లేదా అన్నది తేలనుందని చెబుతున్నారు.

బడ్జెట్ కాపీలు దగ్ధం

- ఎస్‌కెఎం ఆధ్వర్యంలో నిరసన
- రైతులను నిరాశపరిచిన బడ్జెట్: కేశవరావు



లెనిన్ సెంటర్‌లో బడ్జెట్ ప్రతులను దగ్ధం చేస్తున్న కిసాన్ సభ నాయకులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతులను నిరాశపరిచిందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సీనియర్ నాయకులు వై కేశవరావు అన్నారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై సంయుక్త కిసాన్ మోర్చ(ఎస్‌కెఎం) ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. విజయవాడలోని లెనిన్ సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో బడ్జెట్ కాపీలను తగులబెట్టారు. ఈ సందర్భంగా కేశవరావు మాట్లాడుతూ రైతాంగ సమస్యలను కేంద్రప్రభుత్వం తన బడ్జెట్‌లో ప్రస్తావించలేదని అన్నారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం కేంద్రం నియమించిన పార్లమెంటరీ కమిటీ చెప్పిన అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోలేదన్నారు. రైతుల పంటకు మద్దతు ధర ప్రకటించాలని, రుణమాఫీ చేయాలని, ప్రస్తుతం ఇస్తున్న రైతు భరోసాను రెట్టింపు చేయాలని కమిటీ ప్రతిపాదించిందన్నారు. ధరల స్థిరీకరణ నిధి గురించి ప్రస్తావించలేదన్నారు. కేంద్రం కేవలం మూడు పంటలను కొంటామని చెప్పిందన్నారు. ధాన్యం, మిర్చి, పత్తి, పొగాకు వంటి పంటలను విస్మరించిందని చెప్పారు. కార్పొరేట్‌లకు అనుకూలంగానే బడ్జెట్ ఉందని విమర్శించారు. ఎపి రైతుసంఘం(దాసరి భవన్) అధ్యక్షులు జి ఈశ్వరయ్య మాట్లాడుతూ వ్యవసాయ, తయారీ సేవల రంగాలపై కార్పొరేట్ ప్రభావాన్ని పెంచే విధంగా ఈ బడ్జెట్‌ను రూపొందించారని తెలిపారు. మద్దతు ధరకు చట్టపరమైన హామీ లేకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. ఏఐకెఎఫ్ అధ్యక్షులు మర్రెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ రైతుల న్యాయమైన డిమాండ్లను ఏళ్లతరబడి కేంద్రం పెండింగ్‌లో ఉంచిందన్నారు. రైతులను దగా చేసే విధంగా బడ్జెట్ ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర్ రెడ్డి, ఏఐకెఎఫ్ నాయకులు కాసాని గణేష్‌బాబు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు దడాల సుబ్బారావు, నాయకులు పివి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా క్రికెటర్ త్రిషకు రూ.కోటి నజరాన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



అండర్-19 మహిళల టీ 20 ప్రపంచకప్‌లో రాణించిన గొంగడి త్రిషకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోటి రూపాయలు నజరాన ప్రకటించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సిఎంను మర్యాద పూర్వకంగా బుధవారం ఆమె కలిశారు. ఈ సందర్భంగా ఆమెను రేవంత్‌రెడ్డి సన్మానించారు. భవిష్యత్తులో దేశం తరుపున రాణించాలని ఆకాంక్షించారు. త్రిషకు కోటి రూపాయలు, తెలంగాణకు చెందిన అండర్ 19 వరల్డ్ కప్ టీం మెంబర్ ధృతి కేసరికి రూ.పది లక్షలు, హెడ్ కోచ్ నౌషీన్, ట్రైనర్ షాలినికి రూ.పది లక్షల చొప్పున ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, శాట్స్ చైర్మన్ శివసేనా రెడ్డి, సిఎం సెక్రటరీ షానవాజ్ ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో 58 శాతం పోలింగ్

- ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రధాన పార్టీలన్నీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సాయంత్రం 5 గంటల వరకూ 58 శాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఈశాన్య ఢిల్లీలో అత్యధికంగా 63.83 శాతం పోలింగ్ నమోదు కాగా, అత్యల్పంగా సౌత్ ఈస్ట్ ఢిల్లీలో 53.77 శాతం నమోదైంది. ఈస్ట్ ఢిల్లీలో 58.98 శాతం, న్యూఢిల్లీలో 54.37, షాదారాలో 61.35, సౌత్ ఢిల్లీలో 55.72, నార్త్ ఢిల్లీలో 57.24, వెస్ట్ ఢిల్లీలో 57.42, సెంట్రల్ ఢిల్లీలో 55.24, సౌత్ వెస్ట్ ఢిల్లీలో 58.86, నార్త్ వెస్ట్‌లో 58.05 శాతం పోలింగ్ నమోదైంది. సీలాంపూర్, జాంగ్‌పుర, కస్తూర్బా నగర్‌లో నకిలీ ఓట్లు పోలవుతున్నాయని బిజెపి నేతలు ఆరోపించడంతో అధికారులు, పోలీసు యంత్రాంగం అప్రమత్తమయ్యాయి. ఆ ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని అధికారులు ప్రకటించారు. సీలంపూర్‌లో ఓటింగ్ జరగలేదని పోలీసులు ఖండించారు. కస్తూర్బా నగర్‌లో ఇద్దరు మోసపూరితంగా ఓటు వేయడానికి ప్రయత్నించారని, వారిని పట్టుకుని విచారిస్తున్నారని తెలిపారు. సీలంపూర్‌లో బిజెపి నకిలీ ఓటింగ్ ఆరోపణల తరువాత, పార్టీకి చెందిన మరికొంతమంది నాయకులు పోలింగ్ బూత్ వెలుపల నినాదాలు చేయడం ప్రారంభించారు. ఢిల్లీ పోలీసులు ఆ ప్రాంతంలో మోహరించిన భద్రతను సూచిస్తూ ఆరోపణలను తోసిపుచ్చారు. అదనపు పోలీసులు, పారామిలిటరీ దళాలను కూడా మోహరించారు.



ఢిల్లీలోని నిర్మాణ్ భవన్ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా, కేంద్ర మంత్రులు ఎస్ జైశంకర్, హర్దీప్ సింగ్ పురి, ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషి, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, కాంగ్రెస్ సీనియర్ నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ తదితర ప్రముఖులు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

పవన్‌కల్యాణ్‌కు జ్వరం

- మంత్రివర్గ సమావేశానికి దూరం!

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ జ్వరంతో ఇబ్బంది పడుతున్నట్లు ఆయన కార్యాలయం పేర్కొంది. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. జ్వరంతోపాటు స్పాండిలైటిస్‌తో బాధపడుతున్నారని, వైద్యుల సూచన మేరకు ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నారని పేర్కొంది. ఈ నేపథ్యంలో గురువారం జరగనున్న మంత్రివర్గ సమావేశానికి హాజరు కాలేకపోవచ్చని తెలిపింది.

డ్రగ్స్ కేసుల దర్యాప్తుపై శిక్షణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మాదక ద్రవ్యాల కట్టడికి సంబంధించిన చట్టపరమైన అంశాలు, దర్యాప్తులో తీసుకోవాల్సిన కీలక జాగ్రత్తలపై ఇన్‌స్పెక్టర్ స్థాయి పోలీస్ అధికారులకు ఒకరోజు శిక్షణ తరగతులు అక్కయ్యపాలెంలోని కస్టమ్స్, జిఎస్‌టి, నార్కోటిక్స్ జాతీయ శిక్షణ సంస్థలో బుధవారం జరిగినట్లు నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఇన్ డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ నార్కోటిక్స్ అదనపు డైరెక్టర్ జనరల్ ఈదర రవికిరణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈగల్ డైరెక్టర్ ఆర్ రవికృష్ణ, విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జెట్టీ పాల్గొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

సహజ న్యాయ సూత్రాలకు లోబడి రీ సర్వే

- సిసిఎల్ఎ జి జయలక్ష్మి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

చట్ట పరిధికి లోబడి సహజ న్యాయ సూత్రాలను అన్వయిస్తూ భూముల రీ సర్వేను పూర్తి చేయాలని సిసిఎల్ఎ జి జయలక్ష్మి తెలిపారు. గతంలో జరిగిన తప్పిదాలను అధిగమిస్తూ సజావుగా రీ సర్వే వ్యవహారాలను పూర్తి చేయాలని ఆమె సూచించారు. నాగార్జున యూనివర్సిటీ ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి రీ- సర్వేకు సంబంధించి డిప్యూటీ తహశీల్దార్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రీ సర్వేలో డిటిలకు విస్తృత అధికారాలు కల్పించామన్నారు. అధికారాలను సమస్యల పరిష్కారానికి ఉపయోగించాలన్నారు. కొందరు చేసిన తప్పిదాల వల్లే రెవెన్యూ రికార్డుల్లో నెలకొన్న లోపాలను అధిగమించి భవిష్యత్తు తరాలకు ఉపయోగపడేలా స్పష్టమైన రికార్డుల రూపకల్పనకు మార్గం సుగమం చేయాలన్నారు. రీ సర్వేలో తప్పులు చేసిన వారిని ఉపేక్షించబోమన్నారు. సర్వే సెటిల్‌మెంట్, భూ రికార్డుల సంచాలకులు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. రీ సర్వే అధికారులు ప్రజలకు జవాబుదారీగా రైతుల సంతృప్తే లక్ష్యంగా పనిచేయాలన్నారు. అందుబాటులో ఉన్న చట్టాలను ఆయా సమస్యల వారీ అన్వయించుకుని న్యాయమైన ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. రెవెన్యూ సదస్సుల్లో 2.80 లక్షల ఫిర్యాదులొచ్చాయని, యంత్రాంగం సమర్థవంతంగా పనిచేసి భవిష్యత్తులో సమస్యలు రాకుండా చూడాలన్నారు. అవసరమైతే చట్ట సవరణకు కూడా వెనుకాడేదిలేదన్నారు. సర్వే సెటిల్‌మెంట్, భూ రికార్డుల అదనపు సంచాలకులు గోవిందరావు మాట్లాడుతూ.. బ్రిటీష్ కాలం తర్వాత ఆధునిక పరిజ్ఞానం ఉపయోగించి చేస్తున్న రీ సర్వే విజయవంతం కావాలంటే ప్రతి ఒక్క అధికారి సమస్యను లోతుగా అవగాహన చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవతేజ, కేంద్ర కార్యాలయం ఉపసంచాలకులు డిఎల్‌బిఎల్ కుమార్, ప్రాంతీయ సంయుక్త సంచాలకులు కెజియాకుమారి తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

- రాష్ట్ర వ్యాప్తంగా కార్మిక సంఘాల ఆందోళనలు
- దేశ వ్యాప్తంగా మార్చి 18 నుంచి నిరవధిక సమ్మె : హేమలత

ప్రజాశక్తి - యంత్రాంగం

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు, ర్యాలీలు చేపట్టారు. పలుచోట్ల లేబర్ కోడ్‌ల ప్రతులను దహనం చేశారు. నరేంద్ర మోడీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన రోజు నుంచి నేటి వరకు ప్రజా, కార్మిక, రైతు సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్లకు మేలు చేసేందుకే అనునిత్యం తపన పడుతున్నారని పలువురు నాయకులు విమర్శించారు. కార్మిక, రైతు వ్యతిరేక పాలన సాగిస్తున్న మోడీ ప్రభుత్వాన్ని ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు.

తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రంలో 'కార్మిక వర్గానికి శాపం- లేబర్ కోడ్ అమలు' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో సిఐటియు అఖిల భారత అధ్యక్షులు హేమలత మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మిక వర్గానికి ద్రోహం చేయాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కార్మిక వర్గానికి ఉన్న కొద్దిపాటి హక్కులను కుదించడమే లేబర్ కోడ్‌ల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. దీనిపై కార్మికులు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో లేబర్ కోడ్‌ల అమలుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా వచ్చే నెల 18 నుంచి నిరవదిక సమ్మె నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. విజయవాడ హనుమాన్‌పేటలో జరిగిన నిరసన కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు కె.రవీంద్రనాథ్ మాట్లాడుతూ.. పోరాడి సాధించుకున్న హక్కులు, చట్టాలను నిర్వీర్యం చేస్తోందని తెలిపారు. ఏకపక్షంగా తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకూ పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఆందోళనలో ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, టియుసిఐ రాష్ట్ర అధ్యక్షులు మరీదు ప్రసాద్‌బాబు, ఎఐయుటియుసి రాష్ట్ర అధ్యక్షులు కె.సుధీర్, సిఐటియు రాష్ట్ర నాయకులు కె.ధనలక్ష్మి, కె.సుబ్బరావమ్మ, ఆర్.వి.నరసింహారావు, కెఆర్‌కె.మూర్తి పాల్గొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని కెఎన్ రోడ్డులో బహిరంగ సభ, అనంతరం పోలీసు ఐల్యాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లా కొయ్యలగూడెం, నరసాపురం, కుక్కునూరు, చింతలపూడి మండలాల్లో నిరసనలు తెలిపారు. విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం సమీపాన అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన నిరసన తెలిపారు. తొలుత జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ ఫ్లైఓవర్ వరకు, తిరిగి అక్కడి నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకూ ప్రదర్శన చేపట్టారు. అనంతరం లేబర్ కోడ్స్, కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలైన స్టీల్‌ప్లాంట్, భెల్, షిప్‌యార్డు, హెచ్‌పిసిఎల్ కంపెనీల గేట్ల వద్ద నిరసన కార్యక్రమాలు సాగాయి. అనకాపల్లి జిల్లా కేంద్రంలో మున్సిపల్ కార్యాలయం నుంచి నాలుగు రోడ్ల జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేపట్టారు. అల్లూరి జిల్లా వ్యాప్తంగా ధర్నాలు చేశారు. అనంతపురం, శ్రీ సత్యసాయి, కడప, అన్నమయ్య, గుంటూరు, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, కృష్ణా, తిరుపతి, చిత్తూరు, తూర్పు గోదావరి, కాకినాడ, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ర్యాలీలు, నిరసన ప్రదర్శనలు చేశారు.



విజయవాడ హనుమాన్‌పేటలో నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాల నేతలు

1/70 చట్టంపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి స్పష్టం చేయాలి

- సిఎంకు వి. శ్రీనివాసరావు లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టంపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఏమిటో స్పష్టం చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండు చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి లేఖ రాశారు. ఏజెన్సీలో అభివృద్ధి జరగాలంటే 1/70 చట్టాన్ని సవరించాలని శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన ప్రకటనను సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఈ లేఖలో వి.శ్రీనివాసరావు తెలిపారు. ఆదివాసీ భూములకు రక్షణ కల్పించే ఈ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. 27వ తేదీన విశాఖపట్నంలో జాతీయ టూరిజం ఇన్వెస్టర్స్ సమ్మిట్ సందర్భంగా జరిగిన సభలో స్పీకర్ చేసిన వ్యాఖ్యలు ఆదివాసీల్లో తీవ్ర ఆందోళన కలిగించే విధంగా ఉన్నాయని పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు, ఏలూరు, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని ఏజెన్సీ రాజ్యాంగంలో 5వ షెడ్యూలు కిందకు వస్తుందని, దీనిని ధిక్కరించే అధికారం ప్రభుత్వానికి కూడా లేదని తెలిపారు. ఇప్పటికే టూరిజం అభివృద్ధి పేరుతో పలు ఉల్లంఘనలు జరుగుతున్నాయని, వీటిని వెంటనే అరికట్టాలని కోరారు. బినామీల పేరుతో గిరిజన భూముల్లో లాడ్జీలు పెట్టి గిరిజనులకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పుడు 1/70ని సవరిస్తే గిరిజనులకు భూమి కూడా దక్కకుండా పోతుందని, 1/70 చట్టం మూలంగానే గిరిజనులకు ఎంతోకొంత భూమిపై అధికారం వచ్చిందని, 2006-07లో కేంద్రంలో ఉన్న యుపిఎ ప్రభుత్వంపై వామపక్ష పార్టీలు ఒత్తిడి తెచ్చి అటవీ సంరక్షణ చట్టాన్ని తీసుకువచ్చాయని వివరించారు. భూమిపై గిరిజనుల హక్కులను ఈ చట్టం మరింత బలోపేతం చేసిందని, మోడీ ప్రభుత్వం ఈ నిబంధనలను సడలించి గిరిజనుల నుండి భూములను బలవంతంగా లాక్కోడానికి ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు.

పంప్డ్ స్టోరేజీ, హైడల్ ప్రాజెక్టుల పేరుతో వేలాది ఎకరాలను అన్యాక్రాంతం అవుతున్నాయని, ఆదివాసీలు దీన్ని ప్రతిఘటిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న గిరిజన ప్రాంతాలు 1/70ని సవరిస్తే మరింత వెనుకబడిపోతాయని, తక్షణం ఇలాంటి ఆలోచనలు విరమించుకోవాలని, 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇటువంటి గిరిజన వ్యతిరేక ప్రకటనలు చేయకుండా మంత్రులు, ఎమ్మెల్యేలను అదుపుచేయాలని ముఖ్యమంత్రిని వి. శ్రీనివాసరావు కోరారు.

ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ సమావేశాలు ఏర్పాటు చేయాలి

- కెవిపిఎస్ వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి పాలనలో కాకినాడ జిల్లాలో ఎమ్మెల్సీ అనంతబాబు చేతిలో హత్యకు గురై డోర్ డెలివరీ కాబడిన డ్రైవర్ సుబ్రహ్మణ్యం కుటుంబాన్ని ఆదుకోవాలని, అనంతబాబుపై చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ మేరకు సాంఘిక సంక్షేమశాఖ కమిషనరు ఎంఎం నాయక్‌ను బుధవారం కెవిపిఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓ నల్లప్ప, ఆంధ్ర మాల్యాద్రి కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్ర మాల్యాద్రి మాట్లాడుతూ.. సిఎం అధ్యక్షతన ప్రతి ఆరు నెలలకు ఒకసారి, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి, జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ప్రతి మూడు నెలలకోసారి సమావేశాలు జరగాల్సి ఉన్నా ఒక్క సమావేశం కూడా జరగలేదన్నారు. రాజ్యాంగ బద్ధమైన ఎస్‌సి, ఎస్‌టి కమిషన్‌కు ఛైర్మన్ల నియామక ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఎస్‌సి కార్పొరేషన్‌కు నిధులు కేటాయించి, రుణాలివ్వాలని, భూములు కొని ఇవ్వాలని తాము కోరుతున్నట్లు మాల్యాద్రి తెలిపారు. గత పదేళ్లుగా భర్తీ చేయని ఎస్‌సి, ఎస్‌టి బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

దళిత యువకుడిపై దాడి చేసిన వారిని శిక్షించాలి

కాకినాడ పట్టణం, మహాలక్ష్మినగర్ మేకల కబేలా సమీర్‌పేటకు చెందిన దళితుడు ఉండ్రాజవరపు నానిపై దాడి చేసిన అగ్రకుల దుండగులపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసి శిక్షించాలని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నల్లప్ప, మాల్యాద్రి డిమాండ్ చేశారు.

రాష్ట్రానికి అండగా నిలవండి

- డిఫెన్స్ క్లస్టర్ ఏర్పాటు చేయాలి
- రాజ్‌నాథ్ సహా పలువురు కేంద్ర మంత్రులతో లోకేష్ భేటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం అండగా నిలవాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ కోరారు. అలాగే రాష్ట్రానికి మరిన్ని ప్రాజెక్టులు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం నాడిక్కడ కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, ధర్మేంద్ర ప్రధాన్, కుమారస్వామితో ఆయన భేటీ అయ్యారు. తొలుత కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసి ఆంధ్రప్రదేశ్‌లో డిఫెన్స్ క్లస్టర్ ఏర్పాటు చేయాలని లోకేష్ కోరారు. డిఫెన్స్ రంగం పరికరాల తయారీలో కొన్ని యూనిట్లు ఎపికి వచ్చేలా సహకరించాలన్నారు. రాష్ట్ర అభివృద్ధికి తమవంతు సహాయ, సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా రాజ్‌నాథ్ హామీ ఇచ్చారు.

- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసిన మంత్రి నారా లోకేష్.. ఈ ఏడాది ఆగస్టులో నిర్వహించబోయే అఖిల భారత విద్యాశాఖ మంత్రుల సమ్మేళనాన్ని ఎపిలో ఏర్పాటు చేసే అవకాశం కల్పించాలని కోరారు. విద్యా రంగ అభివృద్ధి కోసం కేంద్రం రాష్ట్రానికి నిధుల కేటాయింపులు పెంచాలని కోరారు. అలాగే పిఎం శ్రీ పథకం ఫేజ్ -1, 2లలో కలిపి ఎపిలో ప్రతిపాదించిన 2,369 పాఠశాలలకు గానూ 855 మాత్రమే మంజూరయ్యాయని తెలిపారు. మిగిలిన 1,514 పాఠశాలలను ఫేజ్-3లో మంజూరు చేయాలని కోరారు. విశ్వవిద్యాలయాల అభివృద్ధికి పూర్వోదయ పథకం కింద మొత్తంగా రూ.5,684 కోట్లు మంజూరు చేయాల్సిందిగా లోకేష్ కోరారు.

మిట్టల్ స్టీల్‌ప్లాంట్ త్వరితగతిన అనుమతులు

విశాఖ ఉక్కుకు నిధులు మంజూరు చేసినందుకు కేంద్ర భారీ పరిశ్రమల మంత్రి హెచ్‌డి కుమారస్వామికి మంత్రి లోకేష్ కృతజ్ఞతలు తెలిపారు. ఆయనతో సమావేశం సందర్భంగా అనకాపల్లి వద్ద ప్రైవేటు రంగంలో ఏర్పాటు కానున్న ఆర్సెలర్స్ మిట్టల్ నిప్పాన్ స్టీల్స్ ఉక్కు పరిశ్రమ వల్ల ఎపి యువతకు పెద్దయెత్తున ఉద్యోగావకాశాలు లభిస్తాయని, ఈ పరిశ్రమ ఏర్పాటుకు కేంద్రం తరపున అవసరమైన అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలని కుమారస్వామిని లోకేష్ కోరారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న మాజీ ప్రధాని దేవగౌడను కూడా లోకేష్ కలిశారు. ఆయన ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.


రాజ్‌నాథ్ సింగ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న లోకేష్

- గూగుల్ క్లౌడ్ ఎమ్‌డి బిక్రమ్ సింగ్, కంట్రీ డైరెక్టర్ (పబ్లిక్ సెక్టార్ అండ్ ఎడ్ టెక్) ఆశిష్, వారి బృందాన్ని మంత్రి నారా లోకేష్ కలిశారు. ఈ సందర్భంగా విశాఖపట్నంలో ప్రతిపాదిత డేటా సిటీ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌పై ఇరువురు చర్చించారు.
- రాష్ట్రంలోని క్యాడెట్లకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు సహకారం అందించాలని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను లోకేష్ కోరారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఐదు ఎన్‌సిసి గ్రూపులు, 43 యూనిట్ల పరిధిలో 75 వేలమందికి పైగా క్యాడెట్లు ఉన్నారని, అమరావతిలో ప్రత్యేకంగా ఎన్‌సిసి డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు అప్పగించొద్దు

- సిఎఫ్‌టియుఐ జాతీయ అధ్యక్షులు ఎన్ కనకారావు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)



ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు అప్పగించే విధానం మంచిది కాదని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఈ వైఖరిని మార్చుకోవాలని సిఎఫ్‌టియుఐ జాతీయ అధ్యక్షులు ఎన్ కనకారావు అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక సంఘాల జెఎసి ఆధ్వర్యాన తలపెట్టిన రిలే దీక్షలు బుధవారానికి 1408వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో సిఎఫ్‌టియుఐ కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేస్తే ఊరుకునేదిలేదని స్పష్టం చేశారు. బిహెచ్‌పివి, డ్రెడ్జింగ్ కార్పొరేషన్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేయకుండా కార్మికులు పోరాడి అడ్డుకున్న విషయాన్ని గుర్తుచేశారు. స్టీల్‌ప్లాంట్ విషయంలోనూ తప్పక విజయం సాధిస్తారన్నారు. ఎందరో త్యాగాల ఫలితంగా విశాఖ ఉక్కు కర్మాగారం ఏర్పడిందని, దీనిపై లక్షల మంది ఆధారపడి జీవిస్తున్నారని వెల్లడించారు. దీక్షల్లో సంఘం నాయకులు కె లక్ష్మి, ఎం లక్ష్మి, జి లక్ష్మి, రామలక్ష్మి, కె కిషోర్, వై కొండ పాల్గొన్నారు. సిఐటియు సీనియర్ నాయకులు వై రాజు దీక్షా శిబిరానికి వచ్చి కార్మికుల పోరాటానికి మద్దతు తెలిపారు.

ఆగని వైరస్ ఉధృతి

- కొనసాగుతున్న కోళ్ల మృత్యువాత

ప్రజాశక్తి - తణుకు రూరల్

రెండు నెలలుగా అంతుచిక్కని వైరస్ ప్రభావంతో కోళ్లు మృత్యువాత పడుతుండడంతో పౌల్ట్రీ రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. కొల్లేరు పరిసర ప్రాంతాల్లో తొలుత ఇది నాటుకోళ్లకు వ్యాపించి, ఆపై బ్రాయిలర్, తాజాగా లేయర్ కోళ్లలో విజృంభిస్తోంది. సాధారణంగా పౌల్ట్రీ ఫారాల్లో కోళ్లకు ఎప్పటికప్పుడు వ్యాక్సిన్ వేస్తూ, పరిసరాలను డిసిన్ఫెక్ట్ మందులతో స్ప్రే చేస్తూ శుభ్రం చేస్తారు. అయినప్పటికీ కోళ్లు మృత్యువాత పడుతూనే ఉన్నాయి. ఈ వైరస్ ప్రారంభం నుంచి రోజుకు ఐదు వేల కోళ్లు చనిపోతున్నాయి. ఉభయ గోదావరి జిల్లాల్లో సుమారుగా 400 కోళ్ల ఫారాలు ఉండగా వాటిలో లేయర్ కోళ్లు 2.50 కోట్ల మేర ఉన్నాయి. ఇప్పటివరకు లక్షల్లో కోళ్లు మరణించినట్లు నిర్వహకులు చెబుతున్నారు.


ఓ కోళ్ల ఫారంలో మృతి చెందిన కోళ్లు

ఒక్కో కోడి ధర గుడ్డు పెట్టే సమయానికి రూ.300కు పైగా ఉంటుందని 18 వారాల నుంచి వంద వారాల వరకు గుడ్లు పెడుతుందని రైతులు చెబుతున్నారు. వైరస్ ప్రభావం కన్పించిన ఐదు గంటల్లోనే కోళ్లు మృతి చెందడంతో రైతులకు దిక్కు తోచడం లేదు. వాతావరణ పరిస్థితులు ఏమైనా మారితే వ్యాప్తి తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. అప్పటి వరకు కోళ్లకు యాంటీబయోటిక్ మందులు వాడాలని, పరిసరాలను శుభ్రం చేసుకోవాలని, కోడి రెట్టలపై ఫార్మల్ ఇన్ స్ప్రే చేయాలని వైద్యులు సూచిస్తున్నారు. కోళ్లకు ఇచ్చే దాణాలో నిరోధక శక్తి పెరిగే విధంగా ప్రోటీన్స్, అమినోయాసిడ్స్ అయిన లైజిన్, మిథియోనైన్, ఆర్జినైన్, వాలైన్ వంటి వాటిని 20 శాతం వరకు అందించాలని, విటమిన్-ఇ, సెలీనియం వంటి మందులు కూడా కోళ్లలో రోగ నిరోధక శక్తిని పెంచుతుందని సూచించారు. చనిపోయిన కోళ్లను ఒక క్రమ పద్ధతిలో పూడ్చి పెట్టాలని, లేదా కాల్చివేయాలని, కోడిగుడ్లు, కోడి మాంసం వినియోగం వల్ల ఎటువంటి హానీ ఉండదని తణుకు మండల పశువైద్యాధికారి కె.శంకర్ భావన్నారాయణ తెలిపారు. ప్రస్తుతం పగటిపూట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరగడంతో వైరస్ వ్యాప్తి కొంచెం తగ్గుముఖం పట్టిందని, మరణాల సంఖ్య క్రమంగా తగ్గుతుందని పౌల్ట్రీ రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మళ్లీ గెలుస్తాం

- విజయవాడ నేతలు, కార్పొరేటర్ల భేటీలో మాజీ సిఎం వైఎస్ జగన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



ఎన్నికలు ఎప్పుడొచ్చినా వైసిపి తప్పకుండా గెలిచి అధికారంలోకి రావడం ఖాయమని, రాష్ట్రాన్ని 30 ఏళ్లపాటు పాలించడం తథ్యమని మాజీ సిఎం, వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. తాడేపల్లిలోని ఆయన నివాసంలో బుధవారం విజయవాడ వైసిపి నేతలు, కార్పొరేటర్లతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. తన పాలన 1.0లో ప్రజలందరికీ మేలు చేయాలనే తపనతో కార్యకర్తలకు అంతగొప్పగా చేయలేకపోయి ఉండొచ్చు, ఈసారి జగనన్న 2.0 కొంచెం వేరుగా ఉంటుందన్నారు. తాను కార్యకర్తల కోసం తమ ప్రభుత్వం ఎలా పనిచేస్తుందో చేసి చూపిస్తామన్నారు. తన హయాంలో ప్రజల సంక్షేమం కోసమే అడుగులు వేశానని, నేడు చంద్రబాబు ప్రభుత్వం వైసిపి కార్యకర్తలను ఎలా ఇబ్బందులు పెడుతుందో చూస్తున్నానని అన్నారు. రాజకీయాల్లో ఉన్నప్పుడు, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కష్టాలు వస్తాయని, ప్రతిఒక్కరూ గుర్తు పెట్టుకోవాలని, కష్టాల్లో ఉన్నప్పుడు మనం వాటిని ఎలా ఎదుర్కొంటామో అన్నదే మనల్ని నాయకుల్ని చేస్తుందన్నారు. కష్టం వచ్చినా ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యక్తిత్వం కోల్పోకూడదన్నారు. కార్యకర్తలకు ఎవరికి కష్టం వచ్చినా తన కథను గుర్తు పెట్టుకోవాలని, తాను రాజకీయంగా ఎదుగుతానని కాంగ్రెస్, టిడిపి నేతలు దొంగ కేసులు బనాయించి 16 నెలలు జైల్లో పెట్టారన్నారు. తాను బయటకు వచ్చి ప్రజల అండతో ముఖ్యమంత్రిని అయ్యానన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బెదిరించడం, దొంగకేసులు పెట్టి జైలుకు పంపుతారని, అయినా రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తామన్నారు. విజయవాడ కార్పొరేషన్‌లో 64 స్థానాలుంటే 49 స్థానాలు గెలిచామని, కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మన సభ్యులను 13 మందిని తీసుకున్నప్పటికీ ఇంకా 38 మంది ప్రలోభాలకు లొంగకుండా ఉన్నారని చెప్పడానికి తాను గర్వపడుతున్నానని పేర్కొన్నారు.

టిడిపి ఎన్నికల హామీలు, సూపర్‌సిక్స్ అమలు చేయకుండా కుంటి సాకులు చెబుతోందని, ప్రజల్లోకి వస్తే పథకాల సంగతి ప్రశ్నిస్తారనే భయంతో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రతి నియోజకవర్గంలో పేకాట క్లబ్బులు కనిపిస్తున్నాయని, నియోజకవర్గంలో ఏ పని జరగాలన్నా, ఇండస్ట్రీ, మైనింగ్ చేసుకోవాలన్నా 'నాకు ఇంత' అని ఎమ్మెల్యే దగ్గర నుంచి సిఎం స్థాయి వరకు పంచుకుంటున్నారని జగన్ ఆరోపించారు.

ప్రజావ్యతిరేక బడ్జెట్

బడ్జెట్ ప్రతులు దహనం

ప్రజాశక్తి - యంత్రాంగం

ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల జెఎసి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో బుధవారం నిరసనలు తెలిపి బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఒంగోలులో అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి చర్చి సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. విభజన హామీలను అమలు చేయాలని, ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని, వెనుకబడిన ప్రకాశం జిల్లాకు పదివేల కోట్లు నిధులు మంజూరు చేయాలని రైతు , కార్మిక, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తూ.. కార్మిక హక్కులను కాలరాసే దగాకోరు బడ్జెట్ అని విమర్శించారు. బాపట్లలో నిరసన తెలిపారు. ఏలూరులో వసంత మహల్ సెంటర్‌లో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. చింతలపూడిలో, జీలుగుమిల్లి, పశ్చిమ గోదావరి జిల్లా గణపవరంలో నిరసన తెలిపి బడ్జెట్ ప్రతులు దగ్ధం చేశారు. ఎన్‌టిఆర్ జిల్లా నందిగామ మున్సిపల్ కార్యాలయం, వత్సవాయి గాంధీ బొమ్మ సెంటర్, మైలవరంలోని నూజివీడు రోడ్డు జెండా చెట్టు సెంటర్లలో ఆందోళన తెలిపారు. విశాఖ జిల్లాలోని తగరపువలస జంక్షన్‌లోనూ, అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండల కేంద్రంలోనూ నిరసనలు తెలిపారు. బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని గడియార స్తంభం సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆంధ్ర మాల్యాద్రి పాల్గొన్నారు. బలరాం మాట్లాడుతూ... బడ్జెట్‌లో ఎపికి మళ్లీ మొండి చేయి చూపిందని విమర్శించారు.

రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై అన్ని పార్టీల ఎంపిలు కేంద్రాన్ని నిలదీయాలన్నారు. కాకినాడ జిల్లా కరప, తాళ్లరేవులో బడ్జెట్ పత్రాలను దహనం చేశారు.



ఒంగోలు కలెక్టరేట్‌కు ర్యాలీకి వెళ్తున్న సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల నాయకులు

తెలుగులో ఉత్తర్వులు షురూ

- జివోఐఆర్‌లోనూ మార్పులు
- తెలుగు భాషకు తిప్పలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర ప్రభుత్వ కొత్త నిర్ణయం మేరకు తెలుగులో కూడా ప్రభుత్వ ఉత్తర్వులను విడుదల చేయడం ప్రారంభించారు. ఉత్తర్వుల కోసం ప్రత్యేకంగా ఉన్న జివోఐఆర్‌లో ఈ మేరకు రెండు రోజులుగా రెండు భాషల్లో ఉత్తర్వులు కనిపిస్తున్నాయి. అనేక శాఖలు ఇప్పటికే రెండు భాషల్లో ఉత్తర్వులను ఇవ్వడం ప్రారంభించగా మిగిలిన శాఖల్లో ఈ ప్రక్రియ ఇంకా కనిపించడం లేదు. అయితే తెలుగు తర్జుమాలో వాడిన భాష గమనిస్తే తెలుగుకు తెగులు పట్టినట్టేనన్న విమర్శలు వస్తున్నాయి.

రెండు భాషల్లో ఉత్తర్వుల జారీకి సంబంధించి జివోఐఆర్‌లో కూడా మార్పులు చేశారు. ఉత్తర్వులను డౌన్‌లోడ్ చేసుకునేందుకుగా తెలుగు, ఆంగ్ల భాష ఉత్తర్వులకు విడివిడిగా ఆప్షన్లు ఇవ్వడం గమనార్హం. దీంతో ఎవరికి ఏ భాషా ఉత్తర్వులు కావాలనుకుంటే ఆ భాషలో ఉత్తర్వులు డౌన్‌లోడ్ చేసుకునే అవకాశాలు ఉన్నాయి.

కొన్ని ఉత్తర్వుల్లో జీవోకు వాడాల్సిన గవర్నమెంట్ ఆర్డర్ అన్న పదానికి బదులుగా వెళ్లండి, గో అన్న పదాలు ఉపయోగించడం గమనార్హం. అలాగే ఆర్థికశాఖ జారీ చేసిన ఒక ఉత్తర్వులో ఒక సంస్థతో ఎంగేజ్‌మెంట్ చేయాలన్న పదలాకు ఏకంగా నిశ్చితార్థం అన్న పదాన్ని ఉపయోగించడం తర్జుమాలో ఘోర లోపాన్ని ఎత్తి చూపిస్తోంది. ఇంకో శాఖ ఉత్తర్వుల్లో సచీదేవికు బదులుగా సచ్చిదేవి అని పొందుపరచడం వంటి అనేక లోపాలు వెలుగుచూసాయి. వీటిని సవరించి చక్కనైన భాషలో ఉత్తర్వులు ఇవ్వాల్సిన అవసరం ఉందని ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు.

17 మంది సభ్యులతో ఆర్‌టిసి బోర్డు ఏర్పాటు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎపిఎస్‌ఆర్‌టిసి బోర్డును ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించి బుధవారం జిఓ ఎంఎస్ నెంబరు 6ను విడుదల చేసింది. ఎపిఎస్‌ఆర్‌టిసి ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, వైస్ ఛైర్మన్‌గా పిఎస్ మునిరత్నంతోపాటు డైరెక్టర్లు దొన్నుదొర, రెడ్డి అప్పలనాయుడు, సురేష్‌రెడ్డి, పూల నాగరాజులు నామినేటెడ్ సభ్యులు కాగా, అఫీషియల్స్‌లో రవాణా, ఆర్థిక, జిఎడి ప్రిన్సిపల్ సెక్రటరీలు, ఆర్‌టిసి ఎమ్‌డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఫైనాన్సియల్ అడ్వైజర్‌లను నియమించింది. వీరితోపాటు బోర్డులో కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులుగా మరో 5 విభాగాలకు చెందిన అధికారులను నియమించారు. కేంద్ర ప్రభుత్వ రోడ్ సేఫ్టీ డైరెక్టర్, ట్రాన్స్‌పోర్ట్ డైరెక్టర్‌తోపాటు కేంద్ర ప్రభుత్వ పట్టణాభివృద్ధి శాఖ డైరెక్టర్లను సభ్యులుగా ప్రభుత్వం నియమించింది.



ఎస్‌వియులో చిరుత కోసం బోను ఏర్పాటు

ప్రజాశక్తి - ఎస్‌వియు (క్యాంపస్)

తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో చిరుతల కోసం బోనులు ఏర్పాటు చేసినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. గత రెండు నెలలుగా పరిసర ప్రాంతాల్లో తిష్ట వేసిన పులి పలుమార్లు వర్సిటీలోని హెచ్ బ్లాక్ విద్యార్థులకు, ఐ బ్లాక్‌లో ఉండే పరిశోధకులకు కనిపించి భయభ్రాంతులకు గురిచేసింది. వర్సిటీలోని సోషియాలజీ విభాగంలో పని చేస్తున్న డాక్టర్ వెంకటేశ్వర్లు మంగళవారం సాయంత్రం విధులు ముగించుకొని వెళ్తుండగా దారి మధ్యలో ప్రధాన గ్రంథాలయం వద్ద చెట్ల పొదల్లో పులిని చూశారు. దీంతో భయాందోళనకు గురైన ఆయన వెంటనే అటవీ శాఖ, వర్సిటీ అధికారులకు సమాచారం ఇచ్చారు. అప్రమత్తమైన అటవీశాఖ అధికారులు వర్సిటీలో ప్రధాన గ్రంథాలయం, వేదిక్ వర్సిటీ పరిసర ప్రాంతాల్లో బోన్లు ఏర్పాటు చేశారు. ఫారెస్టు అధికారులు బుధవారం జరిపిన కూబింగ్‌లో పులి జాడలను స్పష్టంగా గుర్తించామని, పులి సంచరించే ప్రాంతాల్లో బోన్లు ఏర్పాటు చేశామని చెప్పారు. రెండు, మూడు రోజుల్లో పులి బోనులో చిక్కే అవకాశం ఉందని వెల్లడించారు. విద్యార్థులు, పరిశోధకులు, సిబ్బంది వర్సిటీలో సాయంత్రం ఆరు గంటల తర్వాత ఎవరు సంచరించవద్దని హెచ్చరికలు జారీ చేశారు.

కంపెనీలతో రైతుల అనుసంధానం

- 'అనంత ఉద్యానవన సమ్మేళనం'లో మంత్రి పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి - అనంతపురం ప్రతినిధి

ఉద్యానవన రైతులను, కంపెనీలను అనుసంధానం చేస్తామని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. అనంతపురం నగరంలోని ఎంవైఆర్ ఫంక్షన్ హాలులో 'అనంత ఉద్యానవన సమ్మేళనం' కార్యక్రమం జరిగింది. ఉద్యానవన రైతులను ప్రోత్సహించే విధంగా ఈ కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. కలెక్టర్ వి.వినోద్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డ్రిప్ కంపెనీ, కోల్డ్ చైన్ తయారీ కంపెనీలతో పాటు మొత్తం ఆరు కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నారు. రైతులకు డ్రిప్ పరికరాలు అందజేత, కోల్డ్ స్టోరేజీకి అవసరమైన సదుపాయాలు, అరటి నుంచి ఫ్యాబ్రిక్ వస్తువుల తయారీ, అరటిపండ్ల ఎగుమతి, ఉద్యానవన పంటలకు సాంకేతిక పరిజ్ఞానం అందించేలా కంపెనీలు ఒప్పందం చేసుకున్నాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్థిక మంత్రి మాట్లాడుతూ... చంద్రబాబు నాయుడు తొలిసారి ముఖ్యమంత్రి అయిన సమయంలో రాష్ట్రంలో డ్రిప్ సిస్టమ్ అమలు చేసే సమయంలో ప్రతిపక్షాలు హేళన చేశాయని,



: డ్రోన్‌లను పరిశీలిస్తున్న మంత్రి కేశవ్, ఎమ్మెల్యేలు, అధికారులు

ఇప్పుడు డ్రిప్ పద్ధతి లేని వ్యవసాయాన్ని అనంతపురం జిల్లాలో ఊహించలేమని చెప్పారు. రాబోయే రోజుల్లోనూ రైతులను కంపెనీలకు అనుసంధానం చేసే విధంగా ఈ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. వచ్చే నెలలో అనంతపురంలోనే కంపెనీలతో అతి పెద్ద సమ్మేళనాన్ని నిర్వహించే ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఎగుమతులకు అవసరమైన విధంగా పంటలు పండించేందుకు కంపెనీలు సహకారం అందిస్తాయని చెప్పారు. అంతకుముందు వ్యవసాయ ఉత్పత్తులు, వ్యవసాయ పరికరాలకు సంబంధించి ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మంత్రి, ఎమ్మెల్యేలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి టిజి.భరత్ ఆన్‌లైన్‌లో పాల్గొని సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విప్ కాలవ శ్రీనివాసులు, వ్యవసాయ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజశేఖర్, హార్టికల్చర్ డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు, ఉమ్మడి అనంతపురం జిల్లాల ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.



రిజర్వు ఫారెస్టులో పర్యటిస్తున్న మానవ హక్కుల వేదిక నాయకులు

యురేనియం తవ్వకాలపై అసెంబ్లీలో తీర్మానం చేయాలి

- మానవ హక్కుల వేదిక డిమాండ్

ప్రజాశక్తి-దేవనకొండ (కర్నూలు జిల్లా)

కర్నూలు జిల్లా కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్టులో యురేనియం వెలికితీసే ప్రయత్నాలు చేపట్టబోమని రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేయాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు యుజి శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శి యుఎం దేవేంద్రబాబు, తెలుగు రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యులు విఎస్.కృష్ణ డిమాండ్ చేశారు. కప్పట్రాళ్ల, నెల్లబండ, పి.కోటకొండతోపాటు రిజర్వు ఫారెస్టులో వారు బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. యురేనియం తవ్వకాల వల్ల ప్రజల ఆరోగ్యం, వ్యవసాయం దెబ్బతింటాయని, వారికి జీవనోపాధి లేకుండాపోతుందని తెలిపారు. 2017లోనే రహస్యంగా, ఎటువంటి పారదర్శకత లేకుండా, గుట్టు చప్పుడు కాకుండా 20 బోర్లను వేశారని గుర్తు చేశారు. యురేనియం తవ్వకాలు మానవజాతికి, పర్యావరణానికి అత్యంత హానికరమని తెలిపారు. యురేనియం తవ్వకాల వల్ల భూమి విషపూరితమవుతుందని, భూగర్భజలాలు తగ్గిపోతాయని, కలుషితమవుతాయని తెలిపారు. కప్పట్రాల రిజర్వు ఫారెస్ట్ నుంచి పారే వర్షపునీరు కోటకొండ చెరువు, నాగమ్మవంక మీదుగా మాచవరం చెరువులోకి ప్రవహిస్తాయని, ఈ చెరువులు యురేనియం మైనింగ్ వల్ల కలుషితమైతే 25 గ్రామాల ప్రజల జీవితాలు దెబ్బతింటాయని తెలిపారు. రిజర్వు ఫారెస్టులో ఉండే అటవీ జంతువుల మనుగడ ప్రశ్నార్థకం అవుతుందన్నారు. కప్పట్రాల ప్రాంతంలో యురేనియం నిల్వల అంచనా కోసం జరిగే ప్రయత్నాలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

కృష్ణా జిల్లా పరిషత్‌కు ఐసిఎఐ అత్యున్నత పుస్కారం

- కేంద్ర మంత్రి నుండి అవార్డు అందుకున్న చైర్‌పర్సన్ ఉప్పాల హారిక

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా)

కృష్ణా జిల్లా పరిషత్‌కు జిల్లా పరిషత్ కార్యకలాపాల నిర్వహణలో అత్యుత్తమ అకౌంట్స్ నిర్వహించినందుకు 2023-24 సంవత్సరానికిగానూ అత్యున్నత పురస్కారం లభించింది. ప్రతిష్టాత్మకమైన చార్టెడ్ అకౌంట్స్ సంస్థ ఐసిఎఐ వారు ఈ పురస్కారం ప్రకటించారు. ఫిబ్రవరి 1న ఢిల్లీలోని యశోభూమి కన్వెన్షన్ సెంటర్లో జరిగిన కార్యక్రమంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వివిధ విభాగాలకు పురస్కారాలు అందిచారు. దీనిలో భాగంగా కష్ణా జిల్లా పరిషత్‌కు ప్రకటించిన పురస్కారాన్ని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్, ఐసిఎఐ ప్రెసిడెంట్ రంజిత్ కుమార్ చేతుల మీదుగా కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అందుకున్నారు. ఈ పురస్కారం రావడానికి కషి చేసిన అధికారులు, ఉద్యోగులకు చైర్‌పర్సన్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.



కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్, ఐసిఎఐ ప్రెసిడెంట్ రంజిత్ కుమార్ నుంచి అవార్డు అందుకుంటున్న ఉప్పాల హారిక

హిందూయేతర ఉద్యోగులపై చర్యలు

- టిటిడిలో 18 మంది గుర్తింపు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి)లో హిందూయేతర ఉద్యోగులపై యాజమాన్యం చర్యలు తీసుకుంటోంది. వివిధ విభాగాల్లో 18 మంది అధికారులుగా, ఉద్యోగులుగా పనిచేస్తున్నట్లు గుర్తించారు. వారిని తిరుమల టిటిడి అనుబంధ ఆలయాల్లో శ్రీవారి ఉత్సవాలు, మతపరమైన కార్యక్రమాలలో విధులు నిర్వహించకూడదని ఉన్నతాధికారులు ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. టిటిడిలో దేవదాయ ధర్మాదాయ శాఖ యాక్టు 1060, 1989 ప్రకారం హిందూ మత సంప్రదాయాన్ని అనుసరిస్తామని ప్రమాణం చేసి ఉద్యోగంలో చేరారని, అయినా హిందూయేతర మత కార్యకలాపాల్లో పాల్గొంటున్నారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నవంబరు 18న జరిగిన పాలకమండలి సమావేశంలో హిందూయేతర ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని తీర్మానించింది.

వివిధ విభాగాల్లో అధికారులుగా, ఉద్యోగులుగా పనిచేస్తున్న 18 మందిని ప్రభుత్వశాఖలకు బదిలీ చేయాలని లేదా విఆర్‌ఎస్ ఇచ్చి ఇంటికి సాగనంపాలని బోర్డు తీర్మానం చేసింది. ఈ మేరకు టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు, ఇఒ శ్యామలరావులను కలిసి బాధిత ఉద్యోగులు తమ బాధలను చెప్పుకున్నారు. అయినా ఈ ఉత్తర్వులు విడుదలయ్యాయి.

తిరుమల విధులకు దూరంగా : టి.రవి, చీఫ్ పీఆర్‌ఓ, టిటిడి.

'టిటిడిలో అన్యమత ఉద్యోగులు 18 మందిని గుర్తించినది వాస్తవమే. వారిని ప్రభుత్వ శాఖలకు బదిలీ చేయడం గాని, విఆర్‌ఎస్ ఇచ్చి ఇంటికి పంపడం గానీ లేదు. తిరుమల, శ్రీవారి ఉత్సవాలకు దూరంగా ఉండేలా వారి విధులు నిర్వహిస్తాం' అని ప్రజాశక్తికి వివరణ ఇచ్చారు.

వైఎస్ వివేకా హత్య కేసులో కీలక మలుపు

- దస్తగిరి ఫిర్యాదుతో నలుగురిపై కేసు నమోదు

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కీలక మలుపు చోటు చేసుకుంది. అప్రూవర్‌గా మారిన దస్తగిరి ఫిర్యాదు మేరకు నలుగురిపై జీరో ఎఫ్‌ఐఆర్‌తో ఈ నెల మూడున పులివెందుల పట్టణ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. 341, 506, 323, 195 (ఎ), 330 ఐ/డబ్ల్యు, 109 ఐపిసి సెక్షన్లు, మరికొన్ని సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో వివేకా హత్య కేసులో నిందితుడిగా ఉన్న దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి కుమారుడు డాక్టర్ చైతన్యరెడ్డి, జమ్మలమడుగులో డిఎస్‌పిగా చేసిన నాగరాజు, ఎర్రగుంట్లలో సిఐగా పనిచేసిన ఈశ్వరయ్య, కడప కేంద్ర కారాగారం సూపరింటెండెంట్‌గా చేసిన ప్రకాష్ ఉన్నారు. 2023 అక్టోబర్‌లో దస్తగిరి బంధువుల అమ్మాయి ప్రేమ వివాహ విషయంలో అతనిపై ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు చేశారు. ఈ కేసులో దస్తగిరిని ఏడ్రోజులపాటు చీకటి గదిలో ఉంచి పోలీసులు చితకబాదినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. 2023 అక్టోబర్ నుంచి ఫిబ్రవరి 2024 వరకు కడప జైల్లో దస్తగిరి రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఈ క్రమంలో వివేకా కేసులో వైసిపి నేతలకు మద్దతుగా మాట్లాడాలని డిఎస్‌పి నాగరాజు, నవంబర్ 2023లో కడప జైలుకు వచ్చి సిబిఐ ఎస్‌పి రామ్‌సింగ్‌కు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పాలని చైతన్యరెడ్డి బెదిరించారని దస్తగిరి ఫిర్యాదు చేశారు. రామ్‌సింగ్‌కు వ్యతిరేకంగా మాట్లాడితే రూ.20 కోట్లు ఇస్తామని చెప్పినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వారితోపాటు కడప కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ ప్రకాష్ కూడా ఇబ్బంది పెట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

సిఎం కాన్వాయ్ డ్రైవర్ అమీన్‌బాబు మృతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కాన్వాయ్‌లో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తోన్న ఎండి అమీన్‌బాబు మృతిచెందారు. మంగళవారం అర్ధరాత్రి గుండెపోటు రావడంతో ఆయనను ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మరణించారు. ఈ విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వపరంగా అమీన్ కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని తెలిపారు.

పరిశ్రమల్లో భద్రతపై హై లెవెల్ కమిటీ

- హోం శాఖ మంత్రి అనిత

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

పరిశ్రమల్లో భద్రతపై హై లెవెల్ కమిటీని ఏర్పాటు చేయనున్నట్టు రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. మంగళవారం రాత్రి అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలోని హెటిరో డ్రగ్స్ కంపెనీలో విషవాయువులు లీకవడంతో అస్వస్థతకు గురైన 12 మందిలో కె వీరబాబు, జి గౌరి నాయుడు, జి సుబ్రమణ్యం విశాఖలో చికిత్స పొందుతున్న విషయం తెలిసి ఆమె కేర్ ఆస్పత్రికి బుధవారం వెళ్లారు. బాధితులను పరామర్శించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ముగ్గురి ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు.

భద్రత విషయంలో హెటిరో పరిశ్రమలో సమావేశం నిర్వహించాల్సి ఉందని, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉండడం వల్ల సమావేశం నిర్వహించలేకపోయామని అన్నారు. కెజిహెచ్‌ను త్వరలో సందర్శించి భద్రతపై సమీక్షిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రుల్లో మరింత నిఘా పెంచుతామన్నారు. రాష్ట్రంలో రౌడీ షీటర్ల కదలికలపై దృష్టి పెట్టామన్నారు. గంజాయిపై ఉక్కు పాదం మోపుతున్నామని, డ్రోన్ల ద్వారా గంజాయి నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.



కేర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న హెటిరో ప్రమాద బాధితులను పరామర్శిస్తున్న మంత్రి అనిత

మెరుగైన వైద్యం అందించాలి : సిపిఎం

హెటిరో ప్రమాద బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె లోకనాథం కోరారు. కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్, విశాఖ జిల్లా నాయకులు పి మణిలతో కలిసి ఆయన పరామర్శించారు.

ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ హెటిరో డ్రగ్స్ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫార్మా పరిశ్రమల్లో కార్మికుల ప్రాణాలను యాజమాన్యాలు గాలికి వదిలేస్తున్నాయని తెలిపారు. భద్రతా ప్రమాణాలను పాటించడం లేదన్నారు. గతంలో హెటిరో పరిశ్రమలో ప్రమాదాలు సంభవించి కార్మికులు మరణించిన ఘటనలు కూడా ఉన్నాయని, అప్పుడే చట్టపరమైన చర్యలు తీసుకొని ఉంటే ఈ ప్రమాదం సంభవించేది కాదని పేర్కొన్నారు. ఫార్మా పరిశ్రమల్లో వరుసగా ప్రమాదాలు, విషవాయువుల లీకేజీలు జరుగుతున్నాయని, వాటిని అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు.



26 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-గన్నవరం (కృష్ణా జిల్లా)

కృష్ణాజిల్లా బాపులపాడు మండలం కొత్తమల్లవల్లి పారిశ్రామికవాడ నుంచి రహస్యంగా తరలిస్తున్న 26 టన్నుల రేషన్ బియ్యం లారీలను బుధవారం వీరవల్లి పోలీసులు, సివిల్ సప్లై అధికారులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రికి చెందిన పసుపులేటి శ్రీనుబాబు అనే వ్యక్తి నూజివీడు ఏరియాలో కొనుగోలు చేసిన రేషన్‌బియ్యాన్ని రెండు లారీల్లో ఎత్తి రాజమండ్రిలోని కోళ్ల ఫారాలకు తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు, సివిల్ సప్లై అధికారులు కొత్తమల్లవల్లి పారిశ్రామికవాడ పరిసర ప్రాంతాల్లో దాడి చేసి లారీలను పట్టుకుని సీజ్ చేశారు. 26 టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్లను అరెస్టు చేసి క్రిమినల్ కేసు నమోదు చేశారు.

దళితులపై పెత్తందారుల దాడి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి (తిరుపతి జిల్లా)

తిరుపతి జిల్లా కెవిబిపురం మండలం అంజూరుపాలెం కుల దురహంకార ఘటన మరువకముందే తాజాగా మరో ఘటన ఆదే మండలంలో వెలుగు చూసింది. తమపై అధికారులకు ఫిర్యాదు చేశాడనే అక్కస్సుతో మఠం పంచాయతీ మాజీ దళిత సర్పంచ్‌పై పెత్తందారులు బుధవారం దాడి చేశారు. ఈ దాడిలో వెంకటయ్యతో పాటు ఆయన భార్య పెంచలమ్మకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కెవిబిపురం మండలం మఠం గ్రామానికి చెందిన వెంకటయ్యకు ఎంఎ రాజులకండ్రిగ రెవెన్యూలోని సర్వే నెంబర్ 428/2లో 1.39 ఎకరాల అసైన్డ్ భూమి ఉంది. ఆ పొలానికి పక్కనే ఉన్న గల్లా సుదర్శన్ కుటుంబంతో వెంకటయ్యకు భూ వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో గతంలో జరిగిన దాడి ఘటనలో గల్లా సుదర్శన్ కుటుంబంపై అట్రాసిటీ కేసు నమోదైంది. అయినప్పటికీ సుదర్శన్ కుటుంబం.. వెంకటయ్య కుటుంబాన్ని ఇబ్బందులకు గురిచేస్తూ వారిని పొలంలోకి వెళ్లకుండా అడ్డుకుంటుండడంతో కోర్టు నుంచి ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నారు. అయినా ఇబ్బందులకు గురిచేస్తుండడంతో ఈ నెల 4న సిపిఎం నాయకులతో కలిసి కెవిబిపురం తహశీల్దారుకు సుదర్శన్ కుటుంబంపై వెంకటయ్య ఫిర్యాదు చేశారు. ఇది మనసులో పెట్టుకున్న సుదర్శన్.. పొలం వద్దకు వచ్చిన వెంకటయ్య దంపతులను కులం పేరుతో దూషించి దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకటయ్య దంపతులను కెవిపిఎస్ నాయకులు పరామర్శించారు. బాధ్యులపై అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంకయ్యను పరామర్శించిన వారిలో నాయకులు అంగేరి పుల్లయ్య, గంధం మణి, పెనగడం గురవయ్య, గెడి వేణు, వెంకటేష్, ఎస్‌ఎఫ్‌ఐ గురవయ్య ఉన్నారు.



వెంకటయ్య దంపతులను పరామర్శిస్తున్న కెవిపిఎస్ నాయకులు

వడ్డీ రేట్లు తగ్గేనా..!



- రెండేళ్లుగా వేచి చూస్తోన్న రుణగ్రహీతలు
- ఆర్‌బిఐ ఎంపిసి భేటీ ప్రారంభం
- రేపే కీలక ప్రకటన

న్యూఢిల్లీ : దేశంలో హెచ్చు వడ్డీ రేట్లతో గత రెండు, మూడేళ్లుగా రుణగ్రహీతలపై తీవ్ర భారం పడుతోంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్షా బుధవారం ప్రారంభమైంది. ఆర్‌బిఐ నూతన గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఆధ్వర్యంలో జరుగుతున్న తొలి మానిటరీ పాలసీ కమిటీ (ఎంపిసి)లో అధిక వడ్డీ రేట్ల నుంచి ఉపశమనం కోసం ఖాతాదారులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. వడ్డీ రేట్లు తగ్గుతాయనే పలు అంచనాలు ఎంత వరకు నిజం అవుతాయో వేచి చూడాలి. 2024 డిసెంబర్‌లో శక్తికాంత స్థానంలో మల్హోత్రా ఆర్‌బిఐ 26వ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించారు. వచ్చే మూడేళ్ల పాటు ఆయన ఈ హోదాలో ఉండనున్నారు. మూడు రోజుల పాటు సాగనున్న ఎంపిసి భేటీ శుక్రవారంతో ముగియనుంది. గడిచిన రెండేళ్లుగా ఒక్క సారి కూడా వడ్డీ రేట్లను మార్చకుండా 6.50 శాతం వద్దే కొనసాగిస్తున్నారు. కరోనా కాలం 2020 మేలో ఆర్‌బిఐ చివరిసారిగా రెపో రేటును తగ్గించింది. ఆ తర్వాత దానిని 2023 ఫిబ్రవరి వరకు 250 బేసిస్ పాయింట్ల వరకు పెంచుతూ 6.5 శాతానికి చేర్చింది. కాగా.. ఇటీవల దేశంలో వినియోగం భారీగా పడిపోవడంతో కార్పొరేట్ల ఆదాయాలపై తీవ్ర ప్రభావం పడింది. దీంతో వినిమయ డిమాండ్‌ను పెంచడానికి బడ్జెట్‌లో ఆదాయపు పన్ను పరిమితిని రూ.12 లక్షలకు పెంచింది. ఈ క్రమంలోనే మందగమనంలో ఉన్న ఆర్థిక వ్యవస్థకు మద్దతును ఇవ్వడానికి ఈ దఫా వడ్డీ రేట్ల తగ్గింపు ఉండొచ్చని పరిశోధన సంస్థలు, రేటింగ్ ఏజెన్సీలు, ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. రుణాలపై భారాన్ని తగ్గించడం ద్వారా వ్యవస్థలోకి నగదు ప్రవాహాన్ని పెంచే అవకాశాలు మెండుగా ఉన్నాయి. తద్వారనైనా రుణగ్రహీతలపై భారం తగ్గొచ్చు. మరోవైపు రిటైల్ ద్రవ్యోల్బణం 6 శాతం దిగువనే ఉండటంతో వడ్డీ రేట్ల తగ్గింపునకు ఆర్‌బిఐ మొగ్గు చూపొచ్చనే అభిప్రాయాలు వెలుపడుతున్నాయి. 2024 డిసెంబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ 5.22 శాతంగా నమోదయ్యింది. మరోవైపు సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికంలో భారత జిడిపి ఏకంగా 5.4 శాతానికి పతనమై.. రెండేళ్ల కనిష్టానికి దిగజారింది. ఇంతక్రితం జూన్ త్రైమాసికంలోనూ 6.7 శాతంగా చోటు చేసుకుంది. వృద్ధి మందగించిన నేపథ్యంలో ఈ దఫా వడ్డీ రేట్లతో 25 బేసిస్ పాయింట్లు తగ్గింపు ఉండొచ్చని బార్‌క్లేస్ ఇండియా చీఫ్ ఎకనామిస్ట్ ఆస్తా గుడ్వాని పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిస్థితుల్లో ద్రవ్యోల్బణం పెద్ద ఆందోళనకరంగా ఏమీ లేదన్నారు. ఆర్థిక వ్యవస్థకు ఉత్సాహాన్ని ఇవ్వడానికి వడ్డీ రేట్ల తగ్గింపు ఉండొచ్చని నైట్‌ఫ్రాంక్ ఇండియా సిఎండి శిశిర్ బైజల్ అన్నారు. రేట్లు తగ్గించడం ద్వారా మధ్యస్థ కుటుంబాలకు నివాస కొనుగోళ్లు కొంత చౌకగా మారనున్నాయన్నారు.

కర్నాటక హైకోర్టుకు విజయ్ మాల్యా



న్యూఢిల్లీ : భారత బ్యాంక్‌లకు వేల కోట్ల రూపాయలు ఎగవేసి 2016లో లండన్ పారిపోయిన కింగ్‌ఫిషర్ అధినేత విజయ్ మాల్యా తాజాగా కర్నాటక హైకోర్టును ఆశ్రయించారు. తాను బ్యాంకులకు చెల్లించిన రికవరీలకు సంబంధించి అకౌంట్ స్టేట్‌మెంట్లను అందించాలని పిటిషన్ దాఖలు చేశారు. తాను తీసుకున్న అప్పులకు మించి అనేక రెట్లు బ్యాంకులు తన నుంచి వసూలు చేశాయని కోర్టుకు తెలిపారు. అందుకు సంబంధించిన అకౌంట్ స్టేట్‌మెంట్లను అందించాలన్నారు.

తనతో పాటు ప్రస్తుతం లిక్విడేషన్‌లో ఉన్న యుబిహెచ్‌ఎల్ తదితర సంస్థల నుంచి వసూలు చేసిన మొత్తాల వివరాలను కూడా కావాలని అడిగారు. దీనిపై న్యాయస్థానం విచారణకు తీసుకుంది. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ దాదాపు రూ.6,200 కోట్ల అప్పులు తీసుకుందని మాల్యా తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనికి సంబంధించి రూ.14,000 కోట్లను రికవరీ చేశారన్నారు. ఇదే విషయమై పార్లమెంట్‌లోనూ ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటన కూడా చేశారన్నారు. మాల్యాకు చెందిన రూ.14,131 కోట్ల విలువైన ఆస్తులను బ్యాంక్‌లు రికవరీ చేసినట్లు మంత్రి ప్రకటించిన విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. మాల్యా తీసుకున్న రుణంలో దాదాపు రూ.10,200 కోట్లు చెల్లించినట్లు రికవరీ అధికారులు కూడా పేర్కొన్నారన్నారు. దీనిపై స్పందించాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ), పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) సహా 10 బ్యాంక్‌లకు కోర్టు ఆదేశాలు జారీ చేస్తూ.. ఫిబ్రవరి 13 లోగా స్పందించాలని ఆదేశించింది.

పసిడి డిమాండ్‌కు ధరల దెబ్బ

- ఈ ఏడాది అమ్మకాలు తగ్గొచ్చు
- డబ్ల్యుజిసి అంచనా



ముంబయి : ఈ ఏడాది బంగారానికి డిమాండ్ తగ్గొచ్చని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ (డబ్ల్యుజిసి) అంచనా వేసింది. ఇందుకు అధిక బంగారం ధరలే కారణమని డబ్ల్యుజిసి ఇండియా ప్రతినిధి సచిన్ జైన్ పేర్కొన్నారు. గతేడాది బంగారం వినియోగం తొమ్మిదేళ్ల గరిష్ట స్థాయికి చేరిందన్నారు. ఈ ఏడాది 700-800 మెట్రిక్ టన్నుల పసిడికి డిమాండ్ ఉండొచ్చన్నారు. గతేడాది ఇది 802.8 టన్నులుగా చోటు చేసుకుంది. 2015 తర్వాత ఇదే అత్యధిక అమ్మకాలన్నారు. రికార్డ్ స్థాయిలో పెరుగుతున్న బంగారం ధరలు మొదట ఆభరణాల వినియోగదారులను ప్రభావితం చేస్తాయన్నారు. వరుసగా పెరుగుతున్న ధరలు డిమాండ్‌ను దెబ్బతీయనున్నాయన్నారు. దేశీయంగా బుధవారం బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల పసిడి ధర రూ.84,399కి చేరింది. 2024లోని ధరతో పోల్చితే 21 శాతం పెరిగింది. అమెరికా టారీఫ్ యుద్ధ భయాలతో 2025లో ఇప్పటివరకు 10 శాతం ఎగిశాయి. ఆభరణాలను కొనుగోలు చేసే కుటుంబాలకు ఒక నిర్ణీత బడ్జెట్ ఉంటుందని, బంగారం ధరల పెరుగుదలతో సమానంగా వారి బడ్జెట్ పెరగదని సచిన్ జైన్ తెలిపారు. దేశంలోని మొత్తం బంగారం డిమాండ్‌లో ఆభరణాల వాటా దాదాపు 70 శాతంగా కాగా.. మిగితా 30 శాతం పెట్టుబడి డిమాండ్‌గా ఉంది.

స్విగ్గీకి రూ.800 కోట్ల నష్టాలు

న్యూఢిల్లీ : ప్రముఖ ఫుడ్ డెలివరీ సంస్థ స్విగ్గీ నష్టాలు భారీగా పెరిగాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో రూ.800 కోట్ల నికర నష్టాలు చవి చూసింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.524 కోట్ల నష్టాలు నమోదు చేసింది. క్విక్ కామర్స్ వ్యాపారంలో జొమాటో, జెప్టోలకు పోటీని ఇవ్వడానికి భారీగా వ్యయాలు చేయడంతో గడిచిన క్యూ3లో నష్టాలు పెరిగినట్లు తెలుస్తోంది. కంపెనీ రెవెన్యూ 31 శాతం పెరిగి రూ.3,993 కోట్లకు చేరింది. 2023-24 ఇదే క్యూ3లో రూ.3,049 కోట్ల రెవెన్యూ ప్రకటించింది. ఇదే సమయంలో రూ.3,700 కోట్లుగా ఉన్న వ్యయం.. గడిచిన క్యూ3లో రూ.4,898 కోట్లకు చేరింది. శ

బజాజ్ ఫిన్‌సర్వ్ 'మల్టీ క్యాప్ ఫండ్' ఆవిష్కరణ

ముంబయి : బజాజ్ ఫిన్‌సర్వ్ ఎఎంసి కొత్తగా బజాజ్ ఫిన్‌సర్వ్ మల్టీ క్యాప్ ఫండ్‌ను ఆవిష్కరించినట్లు ప్రకటించింది, ఇది లార్జ్ క్యాప్, మిడ్ క్యాం, స్మాల్ క్యాప్ స్టాక్‌లలో పెట్టుబడి పెట్టే ఓపెన్ ఎండ్ ఈక్విటీ స్కీమ్ అని పేర్కొంది. ఫిబ్రవరి 6 నుంచి ఫండ్ సబ్‌స్క్రిప్షన్ కోసం తెరువబడి.. 20తో ముగియనుందని తెలిపింది. ఆకర్షణీయమైన ధరలకు, వాటి అంతర్లీన విలువకు దిగువన అందుబాటులో ఉన్న కంపెనీలలో పెట్టుబడి పెట్టాలనే వ్యూహాన్ని ఉపయోగించనున్నట్లు ఆ సంస్థ సిఇఒ గణేష్ మోహన్ పేర్కొన్నారు.

సంపాదకీయం

బోనులో బీరేన్

యావత్ దేశాన్నీ నివ్వెరపాటుకు గురి చేస్తూ కొన్ని నెలల పర్యంతం సాగిన మణిపూర్ హత్యాకాండను ప్రేరేపించింది సాక్షాత్తూ ఆ రాష్ట్ర బిజెపి ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ అని ఆడియో టేపుల పరీక్షలో నిర్ధారణ అయింది. ఈ పరిణామం ఇంతకాలం బీరేన్‌సింగ్‌ను పదవి నుంచి తొలగించకుండా వెనకేసుకొచ్చిన ప్రధాని మోడీ, అమిత్‌షా సహా బిజెపి అధినాయకత్వాన్ని బోనులో నిలబెట్టింది. సర్వోన్నత న్యాయస్థానం సమక్షానికే నివేదిక అందడంతో మోడీ, బిజెపి పరిస్థితి కన్నంలో దొరికిన దొంగల మాదిరి తయారైంది. గతేడాది మేలో మణిపూర్‌లో జాతుల మధ్య తలెత్తిన ఘర్షణలు అత్యంత పాశవిక దాడుల రూపం తీసుకొని సంవత్సరంగా కొనసాగాయి. ఈ మారణకాండ వెనుక ముఖ్యమంత్రి బీరేన్ హస్తం ఉందంటూ ఆయన మాట్లాడినట్లు చెబుతున్న ఆడియో టేపులు కొన్ని బయటకొచ్చాయి. వాటిని నిర్ధారించి చర్యలు తీసుకోవాలని కుకీ ఆర్గనైజేషన్ ఫర్ హ్యూమన్ రైట్స్ ట్రస్టు, తొలుత మణిపూర్ హింసాకాండపై విచారణ కోసం కేంద్ర హోం శాఖ నియమించిన జ్యుడిషియల్ కమిషన్‌కు అందచేసింది. తదుపరి నిరుడు నవంబర్‌లో సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఆడియో టేపుల ప్రామాణికతను పరీక్షించాలని న్యాయస్థానం ఆదేశించగా దేశంలోనే పేరెన్నికగన్న ట్రూత్ ల్యాబ్‌కు వెరిఫికేషన్ నిమిత్తం పంపారు. టేపుల్లో ఉన్న గొంతుతో బీరేన్ స్వర నమూనాలు సరిపోయాయని ట్రూత్ ల్యాబ్ నిర్ధారించింది. ఈ కేసుపై సోమవారం విచారణ చేపట్టిన కోర్టు ప్రభుత్వ ల్యాబ్ సిఎఫ్ఎస్ఎల్ వెరిఫికేషన్‌కు పంపి మూడు వారాల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించింది.

ట్రూత్ ల్యాబ్ అనేది ఏదో సాదాసీదా సాధారణ సంస్థ కాదని మోడీ, బీరేన్‌లకు తెలుసు. సుప్రీం కోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎంఎన్ వెంకటాచలయ్య ఛైర్మన్‌గా నెలకొల్పబడింది. కేంద్ర దర్యాప్తు సంస్థలైన సిబిఐ, ఎన్‌ఐఎ వంటివి కూడా పలు క్లిష్టతర కేసుల్లో ట్రూత్ ల్యాబ్‌ను ఆశ్రయిస్తాయి. సిఎఫ్ఎస్ఎల్ కంటే ట్రూత్ ల్యాబ్ విశ్వసనీయమైనది. సిఎం అధికారిక ప్రాంతాల నుంచే రికార్డు చేశామని ఆడియోలు అందజేసిన వారు స్పష్టం చేస్తున్నారు. ఆ రీత్యా చూస్తే బీరేన్ ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పించుకోడానికి ఆస్కారం ఉండదు. మణిపూర్ హత్యాకాండకు కర్త కర్మ క్రియ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రేనంటూ వచ్చిన ఆరోపణలు నిజమేనని అర్థమవుతుంది. ముఖ్యమంత్రిగా రాజ్యాంగంపై ప్రమాణం చేసిన వ్యక్తి ప్రజలను రక్షించే బాధ్యతను విడనాడి ప్రజల మధ్య చీలికలు పెట్టి విద్వేషాలు రెచ్చగొట్టడం ఆ పదవికే కళంకం. అటువంటి వ్యక్తిపై ప్రధాని, హోం మంత్రి ఈగ వాలకుండా కాపాడటం అత్యంత జుగుప్సాకరం.

మణిపూర్ హింసాకాండ గురించి చెప్పడానికి రాయడానికి పదాలు దొరకవు. సుమారు 200 మంది హత్యకు గురయ్యాయి. వందలాదిగా క్షతగాత్రులయ్యారు. 70 వేల మంది శరణార్థులుగా ఊళ్లను ఖాళీ చేసి శిబిరాల్లో తలదాచుకున్నారు. ఇప్పటికీ నివురుగప్పిన నిప్పులాగానే ఉంది పరిస్థితి. ఇంతటి ఘోరాల వెనుక ముఖ్యమంత్రి హస్తం ఉండటం తీవ్రఆందోళన కలిగిస్తుంది. గతంలో గుజరాత్ మారణకాండకు అప్పటి ఆ రాష్ట్ర సిఎం మోడీ పరోక్ష మద్దతు ఆరోపణలొచ్చాయి. మొన్నటికి మొన్న సిఎఎ ఆందోళనల సమయంలో ఢిల్లీలో బిజెపి ఎంపిలు, నేతలు మత విద్వేషాలను బహిరంగ సభల్లో నూరి పోశారన్నది జగద్విదితం. మణిపూర్ సైతం అందుకు భిన్నమేమీ కాదని సిఎం బీరేన్ ఆడియో టేపులతో మరోసారి రుజువైంది. హిందూ మతోన్మాద ఆర్‌ఎస్‌ఎస్ దర్శకత్వంలో బిజెపి పని చేస్తోందనడానికి ఇటువంటి దృష్టాంతాలు చాలానే పోగుబడతాయి. ప్రచార రంధితో దేశ దేశాలు ఊరేగుతున్న ప్రధాని మోడీ ఇప్పటికీ మణిపూర్‌ను సందర్శించలేదు. మణిపూర్‌లో హింసపై ఎన్ని సార్లు ప్రతిపక్షాలు పార్లమెంట్‌లో నిలదీసినా మౌనమే. బీరేన్‌ను సిఎం పదవి నుంచి తొలగించాలన్న డిమాండ్‌పైనా అదే తీరు. రోమ్ తగలబడుతుంటే తీరిగ్గా ఫిడేలు వాయించిన నాటి నీరో చక్రవర్తి కంటే కూడా నేటి కేంద్ర బిజెపి పెద్దలది అమానవీయ ప్రవర్తన. ఆడియో టేపులతోనైనా సిఎం బీరేన్‌ను పదవి నుంచి తొలగించాలి. ఇంకా బీరేన్ భుజం తట్టి సిఎం కుర్చీలో కొనసాగిస్తే జాతి క్షమించదు. మణిపూర్ హింసాకాండ మోడీ, బిజెపి కన్నుసన్నల్లోనే జరిగిందన్న భావన ప్రజల్లో మరింత బలపడుతుంది.

మహనీయుల మాట



విజయం మనల్ని ఊరికే వరించదు. దాని వెనుక ఎంతో కృషి, పట్టుదల, త్యాగం దాగుంటాయి.


- పీలే, అమెరికన్ నటుడు.

సమీక్ష

సావర్కర్ నిజస్వరూపం



వి. రాంభూపాల్



'హిందూత్వ నుండి హిందూ మతాన్ని రక్షించండి' అనే చివరి భాగంతో శౌరి ఈ పుస్తకాన్ని ముగించారు. హిందూ మతంలో వున్న క్రతువులు, ఆచార వ్యవహారాలు, సాంప్రదాయాలు, ధ్యానం, ప్రార్థనలు మనిషి మరింత ఉన్నతంగా ఎదిగేందుకు, ఆత్మ పరిశుద్ధికి మార్గాలుగా భావిస్తారు. ప్రస్తుతం వీటన్నింటికీ వక్రభాష్యాలు చెప్పి రాజ్యాధికారాన్ని సాధించటం, రాజ్యంపై పెత్తనం చేయటం కోసమే ఈ క్రతువులు, ఆచారాలు, భక్తి ప్రపత్తులు అన్నిటినీ ఉపయోగించుకుంటున్నారని అరుణ్ శౌరి ఘాటుగా విమర్శించారు. రాజ్యాధికారం కోసం మానవ సమాజాన్ని ముక్కలు ముక్కలుగా చెయ్యటానికి కూడా వెనకాడరని, తీర్థయాత్రలను, కుంభమేళాలను కూడా దుర్వినియోగం చేస్తున్నారని, సాంప్రదాయక అవగాహనకు భిన్నంగా దేవాలయాల దర్శనం పేరుతో 'ధార్మిక పర్యాటక రంగం' వంటి వాటిని చేపడుతున్నారని పేర్కొన్నారు. విభిన్న మార్గాల్లో భగవంతుడిని చేరుకోవడం అన్నది హిందూ మత వాస్తవికత అని అందుకు భిన్నంగా నాయకుడి అడుగుజాడల్లో నడవడం ద్వారానే పుణ్యం వస్తుందనే అశుద్ధ భావజాల ప్రచారాన్ని శౌరి తీవ్రంగా ఆక్షేపించారు.

"హిందూ మతం ప్రధానంగా ఆత్మశుద్ధితో కూడుకున్నది. అంటే సత్యానికి కట్టుబడడం, అణకువ, నమ్రత, సేవా భావన, నైతిక ప్రవర్తన కలిగివుండడం. అలాంటి 'హిందూ మతాన్ని హిందూత్వ నుండి కాపాడుకుందాం." అని శౌరి ఈ పుస్తకాన్ని ముగించారు.

ప్రస్తుత కేంద్ర పాలకులకు సిద్ధాంత దైవం వి.డి.సావర్కర్. ఈయన చెప్పిన హిందూత్వ సిద్ధాంతం ఆధారంగా హిందూ రాజ్యం నిర్మించాలని ఆర్‌ఎస్‌ఎస్ ఉవ్విళ్ళూరుతున్నది. కేంద్రంలో వున్న అధికారాన్ని ఉపయోగించుకుని అందుకు వేగంగా సిద్ధపడుతుంది. ఈ సంవత్సరానికి ఆర్‌ఎస్‌ఎస్ ఏర్పడి వంద సంవత్సరాలు పూర్తవుతున్నందున ఆ సంస్థతో పాటు, దాని అధినేతల గురించి అనేక కల్పిత గాధలతో ప్రచారాన్ని హోరెత్తించనున్నారు. సరిగ్గా ఈ సమయంలో సావర్కర్ నిజరూపాన్ని 'ది న్యూ ఐకాన్ : సావర్కర్ అండ్ ఫాక్ట్స్' అనే 550 పేజీల పుస్తకంలో సీనియర్ జర్నలిస్టు అరుణ్ శౌరి స్కాన్ చేశారు. గాంధీజీ హత్య గావించబడిన రోజునే ఆ కేసులో ముద్దాయిగా వున్న సావర్కర్ గురించిన పుస్తకం ఆవిష్కరించడం మరింత ప్రాధాన్యత కలిగించింది. ఈ అరుణ్ శౌరి ఆర్‌ఎస్‌ఎస్ వ్యతిరేకో, కమ్యూనిస్టు అభిమానో కాదు. కరడుగట్టిన హిందూత్వవాది. 1998-2004 మధ్య వాజ్‌పేయి ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా పనిచేశారు. ఆర్‌ఎస్‌ఎస్ భావజాల వ్యాప్తి కోసం కల్పిత చరిత్రను సృష్టించిన సీతారాం గోయల్ 'హిందూ దేవాలయాలు-వాటికి ఏం జరిగింది?' అనే పుస్తకం ఆధారంగా అయోధ్య బాబ్రీ మసీదు వివాదాన్ని రగిలించడంలో కీలకంగా పని చేసిన జర్నలిస్టు ఈ అరుణ్‌శౌరి. 'ది ఇలస్ట్రేటెడ్ వీక్లీ' పత్రికలో కమ్యూనిస్టుల మీద నిందా ప్రచారాన్ని చేసిన ఆర్‌ఎస్‌ఎస్ వాది. జీవిత కాలమంతా పాపాలు చేసి చివరి రోజుల్లో గంగానది స్నానానికి వెళ్లినట్లు శౌరి తన చివరి రోజుల్లో ఈ పరిశోధనాత్మక పుస్తకాన్ని రాశారు. స్వాతంత్ర్య పోరాటంలో చిత్రహింసలను, ధన, మాన, ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన వీరయోధుల స్థానంలో బ్రిటీష్ వారి క్షమాభిక్షను 'అడుక్కుని', వారు ఇచ్చే ముష్టి పింఛను కోసం దేబిరించిన వారి చిత్రపటాలను పార్లమెంట్ హాల్‌లో ప్రతిష్టించుకుంటున్న రోజుల్లో మనం జీవిస్తున్నాం. దేశ విభజనకు మూల బీజాన్ని నాటిన వ్యక్తి పేరు అంతర్జాతీయ విమానాశ్రయాలకు పెట్టిన పాలకుల ఏలుబడిలో ప్రస్తుతం మనం వున్నాం. మహాత్ముడు పాపాత్ముడు అవుతున్నాడు. దేశద్రోహమే దేశభక్తి అయిపోతున్నది. ఈ పరిస్థితుల్లో అరుణ్ శౌరి రాసిన ఈ పుస్తకం లోని అంశాలను విద్యార్థులు, మేధావులు, ప్రజాతంత్రవాదులు విస్తృతంగా చర్చించాలి.

వినాయక దామోదర్ సావర్కర్ గురించి ప్రచారంలో వున్న కొన్ని కీలకమైన అంశాల వాస్తవికతను రచయిత ఈ పుస్తకంలో వివరించారు. తాను చెప్పిన అంశాలకు వందల ఆధారాలను ఈ గ్రంథంలో చూపారు. ఫ్రాన్స్ సముద్ర జలాల్లో మెరిసిల్స్ వద్ద ఓడ నుండి సావర్కర్ తప్పించుకున్నారా? సావర్కర్, గాంధీలు లండన్‌లో స్నేహితులుగా కలిసి ఉన్నారా? అండమాన్‌లో జైలు అధికారుల వల్లే సావర్కర్ ముస్లిం వ్యతిరేకిగా మారారా? బ్రిటిష్ ప్రభుత్వానికి ఆయన క్షమాభిక్ష కోరుతూ పెట్టుకున్న దరఖాస్తులలో ఏముంది? క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో బ్రిటిష్ వారికి సహాయ సహకారాలు అందించారా? నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు సావర్కార్ మార్గదర్శా? హిందూత్వం గురించి, మత విశ్వాసాలు, ఆచార వ్యవహారాలు, గోవుల గురించి సావర్కర్ ఏం చెప్పారు? సావర్కర్ నిర్మించదలచుకున్న హిందూ రాజ్యం ఎటువంటిది? వీటికి సమాధానాలు వెదికారు. ప్రస్తుత పాలకుల మతతత్వ విధానాల ప్రమాదాన్ని హెచ్చరించారు.

వి.డి. సావర్కర్ ఎవరు?

స్వాతంత్ర్యోద్యమంలో మతం ఆధారంగా ప్రజల మధ్య ఐక్యతను విభజించిన ముస్లింలీగు, హిందూ మహాసభలు వివిధ సందర్భాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా సామ్రాజ్యవాదానికి తోడ్పడ్డాయి. సావర్కర్ 1937లో హిందూ మహాసభకు అధ్యక్షుడై ఏడు పర్యాయాలు ఆ పదవిలో ఉన్నాడు. ద్విజాతి సిద్ధాంతాన్ని మొట్టమొదట ప్రతిపాదించింది ఈయనే. అదే ఆ తర్వాత దేశ విభజనకు కారణమైంది. 1909లో కర్జన్ విల్లి అనే బ్రిటీష్ భారత ఆర్మీ అధికారి హత్యను ప్రోత్సహించడంతో పాటు, మరో రెండు హత్య కేసుల్లో అనుమానాస్పదుడు. అండమాన్ జైల్లో ఉన్న రోజుల్లో 1911, 1913, 1917 సంవత్సరాల్లో క్షమాభిక్ష పెట్టాలని బ్రిటీష్ అధికారులను రాతపూర్వకంగా వేడుకున్నాడు. 1948 జనవరి 30న గాడ్సే కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన గాంధీజీ హత్య కేసులో ఆయన ముద్దాయి. ఈయన రాసిన 'ఎసెన్షియల్స్ ఆఫ్ హిందుత్వ' గ్రంథం నేటి ఆర్‌ఎస్‌ఎస్‌కు, బిజెపి కి ప్రాణవాయువు.

అరుణ్ శౌరి పుస్తకంలో ఏముంది?

మొదటి భాగంలో 'సావర్కర్ గురించి మరింత తెలుసుకుందాం' అనే శీర్షిక కింద సావర్కర్ "గోవు" ఆరాధకుడు కాదని, అంతేకాక గొడ్డు మాంసం తినడానికి ఆయన వ్యతిరేకం కాదని, వ్యవసాయానికి అవసరమైన పశు సంపదకు కారణం ఆవు కనుక దాన్ని గౌరవించడం తప్పు కాదు కానీ ఆవుకు ఒక పవిత్రతను అంటగట్టడం సరికాదని సావర్కర్ చెప్పినట్లు శౌరి ఈ భాగంలో చెప్పారు. గో మూత్రం, గో పేడ, గో సంరక్షణ పేరుతో నేటి పాలకులు, ఆర్‌ఎస్‌ఎస్ చేస్తున్న ప్రచారం, ఇతర మతస్తులపై దాడి ఆవుపై గౌరవంతోనో, భక్తితోనో కాదని దాని వెనుక మతతత్వ ఎజెండా వుందని శౌరి చెప్పారు. సావర్కర్ గొప్పదనం గురించి ఆర్‌ఎస్‌ఎస్ చేస్తున్న ప్రచారం 'చరిత్ర కల్పితం' అనే రెండో భాగంలో చరిత్ర ఆధారాలతో శౌరి చర్చించారు. చిత్రగుప్త పేరుతో రాయబడిన 'లైఫ్ ఆఫ్ బారిస్టర్ సావర్కర్' పుస్తక రచయిత సావర్కరేనని శౌరి తేల్చారు. తన చరిత్రను మారు పేరుతో రాసుకుని అందులో అనేక కల్పితాలను సృష్టించారని ఆయన ఆరోపించారు. 'ది రివల్యూషనరీ రైట్స్' అనే మరో భాగంలో సావర్కర్ తనను తాను శివాజీతో పోల్చుకోవడాన్ని శౌరి హేళన చేస్తారు. 'శివాజీ ఆటంకాలను అధిగమించి తన పోరాటాన్ని కొనసాగించాడు. సావర్కర్ మాత్రం బ్రిటీష్ వారికి పెట్టుకున్న క్షమాభిక్ష విజ్ఞాపన ప్రకారం వారికి ఉపయోగపడ్డాడు. రెండు దేశాల సిద్ధాంతాన్ని ప్రతిపాదించి బ్రిటీష్ వారికి ఎల్లవేళలా ఉపయోగపడ్డాడు. సావర్కర్ గాంధీజీపై అనేక అవమానకరమైన విమర్శలు, దూషణలు చేశాడు' అని శౌరి చెప్పారు. 1911లో సావర్కర్ అండమాన్ సెల్యులార్ జైలులో ఆరు నెలలు శిక్ష అనుభవించి బ్రిటీష్ అధికారులకు క్షమాభిక్ష కోరుతూ లేఖ రాసుకున్నాడు. 1913లో మరోసారి లేఖ రాస్తూ 'భారతదేశంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ప్రభుత్వం రాజీ విధానంతో మరోసారి ముందుకొచ్చింది. మానవత్వం ఉన్న ఏ మనిషి అయినా... ముళ్ళ దారిని కోరుకోడు.' అంటూ 'నేను మీకు అవసరమైన ఏ పదవినిచ్చినా ప్రభుత్వానికి సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నాను' అని చెప్పుకున్న వ్యక్తి సావర్కర్. సుభాష్ చంద్రబోస్, మహాత్మా గాంధీల గురించి సావర్కర్ అబద్ధం చెప్పాడని, 1908లో గాంధీ లండన్‌లో వున్నప్పుడు సావర్కర్ అక్కడకు వెళ్లనేలేదని అలాంటప్పుడు గాంధీతో లండన్‌లో స్నేహం ఎలా ఏర్పడిందని ప్రశ్నించారు. భారతదేశం నుండి పారిపోవాలని, ఇండియన్ నేషనల్ ఆర్మీని ఏర్పాటు చేయాలని, హిందూస్థాన్‌కు పూర్తి స్వాతంత్ర్యం ప్రకటించాలని సావర్కర్ సుభాష్ చంద్రబోస్‌కు చెప్పాడనేది పూర్తిగా కల్పితమని అరుణ్ శౌరి చెప్పారు.

1920లో ఏర్పడిన భారత కమ్యూనిస్టు పార్టీ కార్మికుల, రైతుల, సామాజిక సమస్యలను జాతీయోద్యమ ఎజెండాగా మలచింది. 1920-25 మధ్య మూడు పెద్ద కుట్ర కేసులను ఆ పార్టీ నాయకులు ఎదుర్కొన్నారు. అప్పటి వరకు జాతీయ కాంగ్రెస్ అనుసరిస్తున్న వైఖరిని మార్చుకుని పూర్తి స్వాతంత్ర్యాన్ని డిమాండ్ చేసింది. ఇలాంటి సమయంలో హిందూ మహాసభను బ్రిటీష్ యుద్ధ మండలిలో చేర్చమని వైస్రాయ్ లార్డ్ లిన్‌లిత్‌గోను సావర్కర్ "అడుక్కున్నాడు" అని ఈ పుస్తకంలో రాశారు. సంపూర్ణ స్వాతంత్ర్యానికి విరుద్ధమైన అధినివేశ ప్రతిపత్తి (డొమినియన్ హోదా)ని ఇస్తామన్న బ్రిటీష్ ప్రభుత్వ నిర్ణయాన్ని కూడా సావర్కర్ సంతోషంతో అంగీకరించాడని రచయిత తెలుపుతారు. జీవిత కాలమంతా అహింసను బోధించిన మహాత్మా గాంధీ సైతం 1942 క్విట్ ఇండియా ఉద్యమం సందర్భంగా బ్రిటీష్ వారితో పోరాటం చివరి దశకు వచ్చిందని 'విజయమో వీర స్వర్గమో' తేల్చుకోవాలని దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. ఇలాంటి సమయంలో సావర్కర్ బ్రిటీష్ సైన్యంలో చేరమని తన సంస్థ సభ్యులకు చెప్పాడని రుజువు చేశారు.

సావర్కర్ ప్రతిపాదించిన ద్విజాతి సిద్ధాంతాన్ని మహమ్మద్ ఆలీ జిన్నా మరింత ముందుకు తీసుకవెళ్లి ముస్లింలు, హిందువులు రెండు జాతులని ఇవి రెండూ కలిసి వుండలేవు కనుక పాకిస్తాన్ కావాలని దేశ విభజనకు కారకుడయ్యాడు. పాకిస్తాన్ ప్రతిపాదనకు పోటీగా సిక్కిస్తాన్ కావాలని సావర్కర్ మరో వాదనను చేశాడు. ఈ రకంగా దేశ విభజనకు, జాతుల మధ్య ఘర్షణలకు సావర్కర్ భావజాలం తోడ్పడిందని ఈ పుస్తకంలో రచయిత వివరించారు. అంబేద్కర్‌ను సావర్కర్ అనేక సందర్భాల్లో తీవ్రంగా విమర్శించారు.

'హిందూత్వ నుండి హిందూ మతాన్ని రక్షించండి' అనే చివరి భాగంతో శౌరి ఈ పుస్తకాన్ని ముగించారు. హిందూ మతంలో వున్న క్రతువులు, ఆచార వ్యవహారాలు, సాంప్రదాయాలు, ధ్యానం, ప్రార్థనలు మనిషి మరింత ఉన్నతంగా ఎదిగేందుకు, ఆత్మ పరిశుద్ధికి మార్గాలుగా భావిస్తారు. ప్రస్తుతం వీటన్నింటికీ వక్రభాష్యాలు చెప్పి రాజ్యాధికారాన్ని సాధించటం, రాజ్యంపై పెత్తనం చేయటం కోసమే ఈ క్రతువులు, ఆచారాలు, భక్తి ప్రపత్తులు అన్నిటినీ ఉపయోగించుకుంటున్నారని అరుణ్ శౌరి ఘాటుగా విమర్శించారు. రాజ్యాధికారం కోసం మానవ సమాజాన్ని ముక్కలు ముక్కలుగా చెయ్యటానికి కూడా వెనకాడరని, తీర్థయాత్రలను, కుంభమేళాలను కూడా దుర్వినియోగం చేస్తున్నారని, సాంప్రదాయక అవగాహనకు భిన్నంగా దేవాలయాల దర్శనం పేరుతో 'ధార్మిక పర్యాటక రంగం' వంటి వాటిని చేపడుతున్నారని పేర్కొన్నారు. విభిన్న మార్గాల్లో భగవంతుడిని చేరుకోవడం అన్నది హిందూ మత వాస్తవికత అని అందుకు భిన్నంగా నాయకుడి అడుగుజాడల్లో నడవడం ద్వారానే పుణ్యం వస్తుందనే అశుద్ధ భావజాల ప్రచారాన్ని శౌరి తీవ్రంగా ఆక్షేపించారు.

"హిందూ మతం ప్రధానంగా ఆత్మశుద్ధితో కూడుకున్నది. అంటే సత్యానికి కట్టుబడడం, అణకువ, నమ్రత, సేవా భావన, నైతిక ప్రవర్తన కలిగివుండడం. అలాంటి 'హిందూ మతాన్ని హిందూత్వ నుండి కాపాడుకుందాం." అని శౌరి ఈ పుస్తకాన్ని ముగించారు.

/ రచయిత సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు /

సెటైర్

సుబ్రమణ్యం

ఇంత పని చేసేశారేంటి?

కమ్యూనిస్టు పార్టీల మహాసభలు అంటేనే పెత్తందారీ పార్టీలకు, వాళ్ళ బాకారాయుళ్ళకు ఎక్కడో లోలోపల చిన్న బెదురు ఉంటుంది. వాళ్ళాడుతున్న నాటకాలకి ఎప్పటికైనా తెర దించేది కమ్యూనిస్టులేనని వాళ్ళకీ తెలుసు. అందుకే లేని పోని ఊహాగానాలతో, పుకార్లతో ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తారు. అందుకే ఈ ప్రచారం. మహాసభలో ఏం చర్చించారు? ఏ విధానాన్ని రూపొందించారు? చేసిన తీర్మానాలేమిటి? వంటివి చర్చించితే, వాటి మీద విమర్శలు చేస్తే అందరూ హర్షిస్తారు. మేం కూడా స్వాగతిస్తాం. కమ్యూనిస్టుల మహాసభల పిలుపులు ఎక్కడ ప్రజల గుండెలకు హత్తుకుంటాయో, ఎక్కడ ప్రజలు వాటికి స్పందిస్తారోనని వాళ్ళకి భయం. అందుకే ఇటువంటి చౌకబారు ప్రచారాలకు దిగజారుతారు. కాని ప్రజలకి నెమ్మదిగానైనా నిజం ఏమిటో తెలియక మానదు.



మార్నింగ్ వాక్‌లో పలకరించేడు లక్ష్మీపతి. "ఏమోయ్! కాన్ఫరెన్సు నుంచి ఎప్పుడు తిరిగి వచ్చేవు? బాగా జరిగినట్టుంది? " అన్నాడు.

"అవును, బాగా జరిగింది. పాల్గొన్న అందరూ ఉత్సాహపడ్డారు" అన్నాను.

అది సరే గాని, ఆ తెలంగాణ వాళ్ళేంటోయ్ అలా చేసేసేరు?" అన్నాడు లక్ష్మీపతి.

"ఏవైంది ? ఏం చేసేసేరు వాళ్ళు?" రెట్టించేను నేను.

"అదేనోయ్! పోయి పోయి ఆ జాన్ వెస్లీని కార్యదర్శిగా పెట్టుకున్నారేమిటి? అతన్ని పెట్టుకుంటే ఎన్నికల్లో దళితుల ఓట్లు రాల్తాయని మీ అగ్ర నాయకత్వం ఏమైనా ఆశ పెట్టుకుందా?" అన్నాడు అతగాడు.

"కార్యదర్శిగా పెట్టుకోవడం కాదు, ఎన్నుకోవడం అంటారు. మా పార్టీలో మహాసభల్లో శాఖా కార్యదర్శి నుంచి, మహాసభల ప్రతినిధులు, జిల్లా కమిటీల సభ్యులు, రాష్ట్ర కమిటీ సభ్యులు, రాష్ట్ర కార్యదర్శి-అందర్నీ ఎన్నుకుంటాం. హై కమాండ్ నియామకాలు మాపార్టీ సంస్కృతి కాదు." అని స్పష్టం చేసేను.

"అది సరే, మరి..." అంటూ అతగాడేదో అనబోతూంటే ఆపి ఇంకా ఇలా చెప్పేను.

"రాష్ట్రపతిగా ద్రౌపది ముర్మును పెట్టేం కాబట్టి గిరిజనులు, అంతకు ముందు రామనాథ్ కోవిందన్ను పెట్టేం కాబట్టి దళితులు, ద్రౌపది మహిళ కనుక మహిళలు మా పార్టీకి ఓట్లేయండి అని రాజకీయాలు నడిపే సంస్కృతి బిజెపిది, తక్కిన పెత్తందారీ పార్టీలది. ముందు ఆ కాషాయ కళ్ళద్దాలు తీసేసి నీ సొంత కళ్ళతో చూడు. అలా కాదు, నిజాలు నాకనవసరం, బురద జల్లడమే నా హాబీ అని నువ్వనుకుంటే ఇక నీ ఇష్టం" అన్నాను నేను.

మాతోబాటు వాకింగ్‌లో ఈలోపు తోడయ్యేడు వెంగళ్రావు. " మీ పార్టీకి కులాల పట్టింపులు లేవు అన్న సంగతి నాకు తెలుసు. పార్లమెంటులో సీతారాం ఏచూరి తన కుటుంబ సభ్యుల గురించి చెప్తూ తను, తన భార్య, వేరు వేరు రాష్ట్రాల నుండి వచ్చామని, వేరు వేరు మతాలలో పుట్టినవాళ్ళం అని చెప్పి ఇంతకూ మా బిడ్డది ఏ కులం? ఏ మతం? అని అడిగేడు చూడూ, చాలా గొప్ప విషయం అది. మీ రాష్ట్ర నాయకుల్లో కూడా కులాంతర వివాహాలు చేసుకున్నవారు, తమ బిడ్డలకు కులాంతర, మతాంతర వివాహాలు జరిపించినవాళ్ళు చాలామంది ఉన్నారు. " అంటూ మెచ్చుకున్నాడు.

" కాని, అందరూ మీ తెలంగాణ పార్టీలో తలెత్తిన కుమ్ములాటల వల్లే వెస్లీ పేరు ముందుకొచ్చిందని, అతగాడిని బలిపశువు చేయబోతున్నారని కూడా అంటున్నారేమిటి?" అని ఆ తర్వాత అడిగేడు.

"జాన్ వెస్లీని ఏకగ్రీవంగా మహాసభ కార్యదర్శిగా ఎన్నుకుంది అని కదా వార్త వచ్చింది. అలా జరగలేదంటావా? " అనడిగేను.

"అబ్బెబ్బే, నా ఉద్దేశం అది కాదు కాని .." అంటూ వెంగళ్రావు తటపటాయిస్తున్నాడు. " చూడు వెంగళ్రావ్, నాయకత్వం ఎన్నిక అనేటప్పుడు స్వేచ్ఛగా చర్చలు ఆ కమిటీ లోపల జరుగుతాయి. ఎవరి అభిప్రాయాలను వాళు సూటిగానే చెప్తారు. ఆ తర్వాత అన్ని అభిప్రాయాలనూ కలబోసుకుని ఏకాభిప్రాయానికి వస్తారు. అది సాధ్యం కానప్పుడు ఎన్నికలు జరుపుతారు. ఈ పద్ధతిలో ఏదైనా తప్పు ఉందంటావా? " అనడిగేను.

"ఎంతమాత్రమూ లేదు. కాని.." అంటూ మళ్ళీ నసుగుతున్నాడు.

"ఏకగ్రీవంగా ఎన్నిక జరిగింది అంటేనే అందరూ ఏకాభిప్రాయానికి వచ్చేరని బోధపడుతోంది కదా? మరి దీనిలో అభ్యంతరం ఏమిటి?" అని రెట్టించేను.

"అంటే, సోషల్ మీడియాలో రకరకాలుగా అనుకుంటున్నారని..." అన్నాడు.

" మీరు పెత్తందారీ పార్టీలని, మా పార్టీని ఒకే కొలమానంతో అంచనా వేయకండి. ఆ పార్టీల పదవీ రాజకీయాలన్నీ వ్యక్తుల చుట్టూ తిరుగుతాయి. వాటిలో అంతర్గతంగా ప్రజాస్వామ్యం అనేది కలికానికి కూడా కనిపించదు. అగ్రనేతను ప్రశ్నించే ధైర్యం ఎవరికీ ఉండదు. పార్టీ విధానాలను కూడా ఆ అగ్రనేతే ప్రకటిస్తాడు. అందరూ తలలూపుతారు. కులాల చుట్టూ, డబ్బు చుట్టూ వాటి రాజకీయాలు తిరుగుతాయి. డబ్బు బలంతోనే కదా బిజెపి చాలా పార్టీలను తమ వైపు తిప్పుకోవడమో, ఎమ్మెల్యేల ఫిరాయింపులు ప్రోత్సహించడమో, ఆ పార్టీల్లో చీలికలు తేవడమో చేయగలుగుతోంది? అటువంటి కుట్రలనే వాళ్ళు చాణక్య నీతి అంటూ సిగ్గు లేకుండా గొప్పగా చెప్పుకుని తిరుగుతారు. అటువంటి సంస్కృతి మా పార్టీలో మీకు కనపడుతోందా?" అనడిగేను.

" అటువంటిది లేదు, నేనూ ఒప్పుకుంటాను, కాని మరి పార్టీలో విభేదాలు అంటున్నారు ఏమిటది?" అని అడిగేడు వెంగళ్రావు. లక్ష్మీపతి కూడా చెవులు రిక్కించి వింటున్నాడు.

" ఎక్కడైనా కలిసి పని చేసేటప్పుడు భిన్నాభిప్రాయాలు ఉండడం సహజం. వాటిని పార్టీ వేదికల్లో వ్యక్తం చేసుకుని ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవడం మా పార్టీ పద్ధతి. గొర్రెల మందల మాదిరిగా వ్యవహరించడం పెత్తందారీ పార్టీల సంస్కృతి. మాది కాదు. ఇందులో ప్రత్యేకంగా బాధపడి పోవలసిన దేముంది?" అన్నాను నేను.

" మరి ఈ ప్రచారం అంతా దేనికోసం జరుగుతోంది?" అనడిగేరు ఇద్దరూ.

"కమ్యూనిస్టు పార్టీల మహాసభలు అంటేనే పెత్తందారీ పార్టీలకు, వాళ్ళ బాకారాయుళ్ళకు ఎక్కడో లోలోపల చిన్న బెదురు ఉంటుంది. వాళ్ళాడుతున్న నాటకాలకి ఎప్పటికైనా తెర దించేది కమ్యూనిస్టులేనని వాళ్ళకీ తెలుసు. అందుకే లేని పోని ఊహాగానాలతో, పుకార్లతో ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తారు. అందుకే ఈ ప్రచారం. మహాసభలో ఏం చర్చించారు? ఏ విధానాన్ని రూపొందించారు? చేసిన తీర్మానాలేమిటి? వంటివి చర్చించితే, వాటి మీద విమర్శలు చేస్తే అందరూ హర్షిస్తారు. మేం కూడా స్వాగతిస్తాం. కమ్యూనిస్టుల మహాసభల పిలుపులు ఎక్కడ ప్రజల గుండెలకు హత్తుకుంటాయో, ఎక్కడ ప్రజలు వాటికి స్పందిస్తారోనని వాళ్ళకి భయం. అందుకే ఇటువంటి చౌకబారు ప్రచారాలకు దిగజారుతారు. కాని ప్రజలకి నెమ్మదిగానైనా నిజం ఏమిటో తెలియక మానదు." అన్నాను నేను.

"ఏదేమైనా మీ కార్యకర్తల్లో ఈ ఆత్మవిశ్వాసం ఉంది చూశావూ, అది మాత్రం మహా గొప్ప విషయం" అన్నాడు లక్ష్మీపతి.

అవునవునన్నాడు వెంగళ్రావు.

జనవాక్యం

పెరుగుతున్న 'రికవరీ' వేధింపులు

క్రెడిట్ కార్డు ఫ్యాషన్ పెరిగిపోయింది. అవసరం ఉన్నా, లేకపోయినా క్రెడిట్ కార్డులు తీసుకుంటున్నారు. కార్డు ఇంటికి రాగానే అవసరాలు పెరుగుతున్నాయి. ఇవే కొందరి జీవితాలను ఛిద్రం చేస్తున్నాయి. అదనపు అర్హతతో వచ్చిన క్రెడిట్ కార్డు ఆర్థిక పరిస్థితిని అగమ్యగోచరంగా మార్చేస్తుంది. ఒక్క వాయిదా ఆలస్యమైతే చాలు. మొత్తం ట్రాక్ మారిపోతుంది. ఈ బకాయిలు వసూలు చేసే బాధ్యతను బ్యాంకులు ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగిస్తున్నాయి. మొండి బకాయిలుగా ఉన్న రుణాలను వసూలు చేస్తేనే రికవరీ ఏజెన్సీలకు కమీషన్ వస్తుంది. కొందరు ఏజెంట్లు హద్దులు దాటి వ్యవహరిస్తున్నారు. ఏజెంట్లు రుణగ్రస్తుల చిరునామాలకు వెళ్లి వీధి రౌడీల్లా ప్రవర్తిస్తున్నారు. ఏజెంట్ల నోటి నుంచి వచ్చే మాటలు బాధితుల ప్రాణాలు తీస్తున్న సంఘటనలు ఈ మధ్యన ఎక్కువగా జరుగుతున్నాయి. బాధితులు పెద్దగా పోలీసులను ఆశ్రయించక పోవడంతో రికవరీ ఏజెంట్ల వ్యవహారం రోజురోజుకూ శృతి మించుతోంది. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రుణగ్రస్తులకు ఏజెంట్ల వేధింపులు లేకుండా చర్యలు చేపట్టాలి.

- దాసం వెంకటరెడ్డి
ఊరదాళ్ళపాలెం, పశ్చిమ గోదావరి జిల్లా.

బడ్జెట్‌తో దశ మారేనా?

కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశ పెట్టిన తాజా బడ్జెట్‌లో మన రాష్ట్రానికి రావాల్సినంత రాలేదు. అరవై ఐదు శాతం యువత ఉన్న భారతం బలోపేతం కావాలంటే వారంతా నైపుణ్యత ఉన్న మానవ వనరులుగా మారాలి. అందుకు పూర్తి సహకారం ప్రభుత్వం అందించాలి. ఆ మేరకు విద్య, ఉపాధి పట్ల కేటాయింపులు పెరగాలి. ఆంధ్రప్రదేశ్‌కి కేటాయించిన గిరిజన విశ్వవిద్యాలయం లాంటివి నిధుల లేమి వల్ల వెనకడుగు వెయ్యకుండా శరవేగంతో పూర్తికావాలి. గ్రామీణ ప్రాంతాలకు ఉపాధికి హామీ ఇస్తున్న పథకానికి కేటాయింపులు తక్కువగా ఉండడం కూడా సరి కాదు. దీర్ఘకాలిక వ్యూహంలో భాగంగా కొన్ని పంటలను సాగు పెంచేలా ప్రోత్సహించడం బాగుంది కానీ సమగ్రంగా రైతుకి అన్నివిధాలా లాభం కలిగేలా పొలం నుండి మార్కెట్ వరకూ మద్దతు దొరికేలా చూస్తే అది భారతావనికి లాభదాయకం అవుతుంది. సంపన్న వర్గాలకు సంపద పన్ను విధించి కొంత బాధ్యత ఇస్తే బాగుండేది. జీఎస్టీ కూడా ప్రజానుకూల దిశగా మారాలి. మారుతున్న అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో, రూపాయి విలువ, ద్రవ్యోల్బణం తదితర అంశాలపై పూర్తి అదుపు ఎటూ ఉండదు కాబట్టి అదుపు ఉన్న అంశాలపై పూర్తి దృష్టి పెట్టడం ద్వారా దెబ్బ తీవ్రత తగ్గించుకోవచ్చు. విద్య, ఆరోగ్యం, నిరుద్యోగితపై శ్రద్ధ చూపి, కేటాయింపులు భారీగా పెడితేనే వికసిత భారతం సాధ్యం. ఆ దిశ వైపు తిరగడమే కాదు...ముందుకు నడవాలి.

- డా.డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపీ, విజయనగరం.

'ఇ-శ్రమ్'లోకి 1.5 కోట్ల మంది కార్మికులు

లక్ష్య సాధనకు కలెక్టర్లతో కమిటీలు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులందరినీ ఇ-శ్రమ్ పోర్టల్‌లో రిజిస్టర్ చేయించాలని అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఇ-శ్రమ్ పోర్టల్‌కు సంబంధించిన రాష్ట్ర స్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశం సచివాలయంలో జరిగింది. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ.. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న 1.50 కోట్ల మందిని ఇ-శ్రమ్ పోర్టల్‌లో రిజిస్టర్ చేయించాలనేది లక్ష్యం కాగా, ఇప్పటికే 81.52 లక్షల మందిని రిజిస్టర్ చేశారన్నారు. ఇ-శ్రమ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్‌కు జిల్లాల వారీ, శాఖల వారీ లక్ష్యాలు నిర్దేశించాలన్నారు. జిల్లా కలెక్టర్ల నేతృత్వంలోని జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీల సమావేశాలు నిర్వహించి త్వరితగతిన రిజిస్టర్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇ-శ్రమ్ పోర్టల్‌లో రిజిస్టర్ కావడం వల్ల కలిగే ప్రయోజనాలపై అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికుల్లో పెద్దయెత్తున అవగాహన కలిగించాలని కార్మికశాఖ అధికారులను సిఎస్ ఆదేశించారు. కేవలం ఇన్సూరెన్స్ మాత్రమే కాకుండా వారి పిల్లలకు ఉచిత సైకిళ్ల పనిముట్లు, కుట్టు మిషన్లు వంటి ఇతర ఆర్థిక సహాయాలు ఈ పథకం కింద అందుకోవచ్చన్నారు. ఇ-శ్రమ్ పోర్టల్‌లో చేరిన కార్మికులు ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన కింద రూ.2 లక్షల వరకు ప్రయోజనం పొందుతారన్నారు. బీమా కోసం ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పనాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణీప్రసాద్ పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఇ-శ్రమ్ పోర్టల్ గురించి వివరించారు. ఈ సమావేశంలో కార్మిక ఉపాధి కల్పనాశాఖ అదనపు కార్యదర్శి గంధం చంద్రుడు, కమిషనరు శేషగిరిబాబు, మెప్మా ఎమ్‌డి తేజ్‌భరత్ పాల్గొన్నారు.

'ఐవిఆర్ఎస్ కాల్స్'తో విచారణ తగదు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఒకరోజులో 95 శాతం సామాజిక పింఛన్లు పంపిణీ చేస్తున్నప్పటికీ ఐవిఆర్ఎస్ కాల్స్ పేరుతో ప్రభుత్వం విచారణ చేయడం తగదని ఎపి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సమాఖ్య పేర్కొంది. ఈ మేరకు సమాఖ్య గౌరవాధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె అనురాధ, ఎం గురుస్వామి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు సంబంధించిన జాబ్ చార్ట్, ప్రమోషన్ ఛానెల్, నోషన్ ఇంక్రిమెంట్లు వంటి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని వారు కోరారు.

సౌత్ కోస్ట్ రైల్వే జోన్ పరిధిని ప్రకటించిన రైల్వే శాఖ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

నూతన సౌత్ కోస్ట్ రైల్వే జోన్ పరిధిని బుధవారం అధికారులు ప్రకటించారు. సవరించిన డివిజన్ ప్రకారం పలాస, విశాఖపట్నం, దువ్వాడ, కునేరు – విజయనగరం, నౌపాడ జంక్షన్, పర్లాకిమిడి, బొబ్బిలి జంక్షన్, సాలూరు, సింహాచలం ఉత్తర, దువ్వాడ బైపాస్, వడ్లపూడి దువ్వాడ, విశాఖ ఉక్కు కర్మాగారం, జగ్గయ్యపాలెంతో కూడిన సుమారు 410 కిలోమీటర్ల పరిధిగల ప్రాంతాన్ని న్యూ సౌత్ కోస్ట్ రైల్వే కింద వాల్తేరు డివిజన్‌గా ఉంచుతారు. దీని పేరును విశాఖ డివిజన్‌గా మార్చనున్నారు. అదేవిధంగా వాల్తేరు డివిజన్‌లోని మరో భాగమైన కొత్తవలస – బచేలి / కిరండూల్, కునేరు – తేరువలి జంక్షన్, సింగాపూర్ రోడ్, అరకు, కోరాపుట్ జంక్షన్, పర్లాఖిముడి – గన్‌పూర్ స్టేషన్ల మధ్యనున్న సుమారు 680 కిలోమీటర్ల పరిధిలోని భాగాన్ని ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలోని రాయగడలో హెడ్ క్వార్టర్‌తో కలిపారు. ఇదిలా ఉండగా విశాఖ రైల్వే డివిజన్‌లోనే కెకె.లైన్‌ను కొనసాగించాలని సిపిఎం డిమాండ్ చేసింది.

బయటపడుతున్న జగన్ మోసాలు

- టిడిపి నేత వర్ల రామయ్య

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మోసాలు రోజుకొకటి బయటపడుతున్నాయని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ఆరోపించారు. పేద ప్రజల సొమ్మును కొట్టేయడంలో జగన్ పిజి చేశారని విమర్శించారు. టిడిపి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసిపి హయాంలో లిక్కర్ తయారీ కేంద్రాలన్నీ జగన్‌వే అని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా మద్యం సరఫరా, అమ్మకం, ప్రభుత్వ షాపుల్లో విక్రయించడం అంతా పర్యవేక్షణ మొత్తం మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కొడుకు ఎంపి మిథున్ రెడ్డి చూసుకున్నారని విమర్శించారు. నాలుగున్నరేళ్లలో మద్యం రవాణాను ఏ అధికారి కూడా తనిఖీ చేయలేదని పేర్కొన్నారు. జగన్ మద్యం వ్యాపారం వల్ల 30,720 మంది మృతిచెందారని ఆరోపించారు.

జిఓ నెంబర్ 13 ద్వారా కల్లుగీత కార్మికులకు మద్యం షాపుల్లో 10 శాతం వాటా ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుందని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్‌చంద్రశేషు పేర్కొన్నారు.

'ఉర్దూ' విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఇవ్వాలి

- ఉర్దూ టీచర్స్ అసోసియేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉర్దూ మీడియం పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందించాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఇక్బాల్, సయ్యద్ ముస్తాఖ్ డిమాండ్ చేశారు. సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనార్టీస్ (సిఇడిఎం) ఆధ్వర్యాన మూడు దశాబ్దాలుగా విద్యార్థులకు అందిస్తున్నారని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల రోజుల్లో పదో తరగతి పరీక్షలు ఉన్నాయని, అయినా ఇప్పటి వరకు మెటీరియల్ అందించలేదన్నారు. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులకు ఆరు నెలల నుంచి ఈ అంశాన్ని తెలియజేస్తున్నా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. మైనార్టీ విద్యార్థుల చదువులపై ఈ ఉదాసీనత ఎందుకని ప్రశ్నించారు.

పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకుందాం

- ఆల్ యూనివర్సిటీస్ ఎంప్లాయీస్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శాసనమండలికి పోటీ చేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకోవాలని ఆల్ యూనివర్సిటీస్ అండ్ వర్కర్స్ యూనియన్ పిలుపునిచ్చింది. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి, కృష్ణా–గుంటూరు జిల్లాల పట్టభద్ర ఎమ్మెల్సీ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావు, ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్ర ఎమ్మెల్సీ అభ్యర్థి డివి రాఘవులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, కెఎస్ కోటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాలు, వెటర్నరీ, హార్టీకల్చర్, హెల్త్ యూనివర్సిటీల్లో పనిచేస్తున్న టైంస్కేల్ ఉద్యోగులు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగ సంఘాలు మద్దతు తెలుపుతున్నాయని వివరించారు. యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులంతా పిడిఎఫ్ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి యూనివర్సిటీ ఉద్యోగులు చేసిన టైంస్కేల్ పోరాటం, ఇతర పోరాటాలకు మద్దతు ఇచ్చారని తెలిపారు. 2007 నుంచి ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరించారని వెల్లడించారు.

రోగుల సంతృప్తే ప్రాతిపదిక

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రోగులు సంతృప్తి చెందడమే ప్రాతిపదికగా ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యులు పనిచేయాలని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రుల్లో సూపరింటెండెంట్లు, ప్రిన్సిపాళ్లు, అడ్మినిస్ట్రేటర్లు సమన్వయంతో పనిచేసినప్పుడే మెరుగైన ఫలితాల్ని సాధించగలుగుతారని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని జిజిహెచ్‌ల సూపరింటెండెంట్లతో ఐవిఆర్ఎస్ ఫీడ్ బ్యాక్‌పై బుధవారం సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రి సమీక్ష నిర్వహించారు. ఆస్పత్రుల్లో 30 పాయింట్ల కార్యాచరణ ప్రణాళికను పటిష్టంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. స్ట్రెచర్లు, వీల్‌చెయిర్లు లేక గర్భిణిలు, వృద్ధులు ఎదుర్కొంటున్న చిన్న చిన్న సమస్యలపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఐవిఆర్ఎస్ సర్వేలో వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా సేవల్ని మెరుగుపర్చేందుకు సూపరింటెండెంట్లు దృష్టి సారించాలని చెప్పారు. వైద్య సేవలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని చెప్పారు. పేద రోగులు సంతృప్తి చెందేలా సేవలందించే విషయంలో ఏమాత్రం తాత్సారం ఉండకూడదని తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటి కృష్ణబాబు మాట్లాడుతూ సేవల విషయంలో పూర్తి బాధ్యత సూపరింటెండెంట్లే వహించాలని చెప్పారు. ఇ-హెల్త్ ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. రోగి ఏ ఆస్పత్రికి వెళ్లినా ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు(ఇహెచ్ఆర్) అందుబాటులోకి తీసుకొస్తే సేవలు మరింత సులభతరమవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్య విద్య సంచాలకులు నరసింహం వర్చువల్‌గా పాల్గొన్నారు.

సర్వే చేయాల్సిందే

- సిఆర్‌జడ్‌లో అక్రమ నిర్మాణాల్ని కూల్చాల్సిందే
- తేల్చి చెప్పిన హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

విశాఖపట్నం కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సిఆర్ జెడ్) ప్రాంతంలో అక్రమ నిర్మాణాలను ఎందుకు కూల్చివేయడం లేదని అధికారులకు హైకోర్టు ప్రశ్నించింది. సిఆర్ జెడ్ నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందేనని పేర్కొంది. భీమునిపట్నం బీచ్ వద్ద సిఆర్ జెడ్ రూల్స్‌కు వ్యతిరేకంగా ఉన్న అక్రమ నిర్మాణాలపై వారంలోపు సర్వే చేసి రిపోర్టు ఇవ్వాలని అధికారులను ఆదేశించింది. ఎపి కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఎపిసిజెఎంఎ) సభ్య కార్యదర్శి, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జివిఎంసి) కమిషనర్, విశాఖపట్నం జిల్లా కలెక్టర్లతో కమిటీని కూడా ఏర్పాటు చేయాలంది. అక్రమ నిర్మాణాల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని కమిటీని ఆదేశించింది. భీమునిపట్నం బీచ్ వద్ద ఉన్న అక్రమ నిర్మాణాలపై సర్వే చేయిస్తామని, తరువాత భీమునిపట్నం బీచ్ నుంచి రామకృష్ణ బీచ్ వరకు సర్వే చేయిస్తామని వెల్లడించింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. భీమునిపట్నం బీచ్ వద్ద నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలపై జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ వేసిన పిల్‌పై విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది.

గ్రామాభివృద్ధి సేవా సంఘం అధ్యక్షులు గంటా నూకరాజు వేసిన మరో పిల్ తరపున న్యాయవాది ఎన్ జోయ్ వాదిస్తూ, రూల్స్‌కు వ్యతిరేకంగా బీచ్‌లలో రెస్టారెంట్లు ఏర్పాటయ్యాయని చెప్పారు. పర్మినెంట్‌గా నిర్మాణాలు చేస్తున్నారని కూడా చెప్పారు. రేవ్ పార్టీలు వంటివి కూడా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. మూర్తి యాదవ్ తరపు సీనియర్ న్యాయవాది కెఎస్ మూర్తి వాదిస్తూ, డ్రగ్స్ కూడా సప్లయ్ అవుతోందన్నారు. విశాఖ కల్చర్‌ను నాశనం చేస్తున్నారని చెప్పారు. దీనిపై ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ప్రణతి వాదిస్తూ, సిఆర్ జెడ్ నుంచి సర్వే వివరాలు అందక రిపోర్టు ఇవ్వడంలో అలస్యం అవుతోందన్నారు. భీమునిపట్నానికి–రామకృష్ణ బీచ్ మధ్య 25 కిలోమీటర్లు దూరం ఉందని చెప్పారు. దీనిపై హైకోర్టు, ఎంతదూరం ఉన్నా సర్వే చేయాల్సిందేనని తేల్చి చెప్పింది.

దుష్ప్రచారంపై హైకోర్టు ఆక్షేపం

ప్రజాశక్తి-అమరావతి

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు అంశంపై హైకోర్టు జడ్జిల టీమ్ పర్యటించినట్లు పత్రికలు, టివిల్లో వార్తలు రావడం పట్ల హైకోర్టు తీవ్రంగా ఆక్షేపించింది. కథనాలను తప్పుపట్టింది. తాము కర్నూలులో పర్యటిస్తున్నట్లు ఎవరు చెప్పారని నిలదీసింది. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ దాఖలైన పిల్ విషయంలో కూడా తప్పుడు వార్తలు పబ్లిష్ అయ్యాయని గుర్తించింది. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ న్యాయవాది తాండవ యోగేష్ వేసిన పిల్‌ను ప్రస్తావిస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మంగళవారం కేసును విచారణ చేయాలని కోరితే తర్వాత జరుపుతామని చెప్పామని, అయితే, ఆ కేసులో వాదనలు జరిగినట్లుగా వార్తలు రావడం సబబుకాదని చెప్పింది. అలాగే కృష్ణా జిల్లా, నందిగామ మున్సిపల్ ఛైర్మన్ పోస్టును భర్తీ చేయకుండా ఉత్తర్వులు ఇవ్వాలనే పిటిషన్‌ను జస్టిస్ వడ్డిబోయన సుజాత కొట్టేస్తూ తీర్పు చెప్పారు. ఖాళీగా ఉన్న 7, 11 వార్డులకు ఎన్నికలు జరిగాకే ఛైర్మన్ ఎన్నిక జరిపేలా ఉత్తర్వులు ఇవ్వాలంటూ దాఖలైన పిటిషన్‌ను కొట్టేశారు. అలాగే పార్వతీపురం మన్యం జిల్లాలోని పాలకొండ నగర పంచాయతీ ఛైర్మన్ ఎన్నిక నిమిత్తం జారీ చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను కొట్టేస్తూ తీర్పు చెప్పారు.

తులసిబాబు పిటిషన్‌పై విచారణ వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

డిప్యూటీ స్పీకర్ కె రఘురామ కృష్ణరాజు చేసిన ఫిర్యాదు ఆధారంగా గుంటూరు, నగరపాలెం పోలీసులు పెట్టిన కేసులో తనకు బెయిల్ ఇవ్వాలంటూ కామేపల్లి తులసిబాబు వేసిన పిటిషన్‌పై విచారణ ఈ నెల 7కు వాయిదా పడింది. తులసిబాబును మరోసారి కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కింది కోర్టులో కోరిన కారణంగా ఆ వివరాలు సమర్పించాలని జస్టిస్ విఆర్‌కె కృపాసాగర్ బుధవారం ఆదేశించారు.

కోర్టు మౌఖిక ఆదేశాల తర్వాత కూల్చివేతలపై విస్మయం

ప్రజాశక్తి-అమరావతి

వైసిపి నాయకుడు కె బాలకృష్ణారెడ్డికి చెందిన బిల్డింగ్ కూల్చివేసిన నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ తీరుపై హైకోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ తీరును తీవ్రంగా తప్పుబట్టింది. భవనం విషయంలో కఠిన చర్యలు తీసుకోవద్దంటూ మౌఖికంగా ఉత్తర్వులు జారీ చేశాక ఎలా కూల్చేస్తారని ప్రశ్నించింది. రాతపూర్వక ఆదేశాలు లేనందున కూల్చేశామని కమిషనర్ చెప్పడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇకపై రాతపూర్వక ఆదేశాలు జారీ చేయాల్సిన పరిస్థితులను కమిషనర్ కల్పించారని అభిప్రాయపడింది. ఇకపై మౌఖిక ఆదేశాలు ఇవ్వబోమని చెప్పింది. భవనం కూల్చివేసినందున పిటిషన్‌పై విచారణను మూసేస్తున్నట్లు జస్టిస్ వడ్డిబోయన సుజాత బుధవారం ప్రకటించారు. 24 గంటల్లో కూల్చివేయకపోతే తామే కూల్చేస్తామంటూ కమిషనర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను బాలకృష్ణారెడ్డి బంధువులు వేసిన కేసులో కూల్చివేత విషయంలో కఠిన చర్యలు తీసుకోరాదని గత నెల హైకోర్టు మౌఖిక ఆదేశాలిచ్చింది. కూల్చివేత చర్యలు తీసుకోవడంతో పిటిషనర్ వాటి ఫొటోలను న్యాయమూర్తికి అందజేశారు. దీనిపై అడ్వకేట్ జనరల్ వాదిస్తూ, 22న విచారణకు వచ్చినప్పుడు తదుపరి విచారణ వరకు కఠిన చర్యలొద్దని ఆదేశాలు వెలువడ్డాయని, విచారణ 24కు వాయిదా పడిందని, ఆ మధ్యకాలంలో కూల్చివేత చర్యలు తీసుకోలేదని చెప్పారు. ఈ నెల 27న కూల్చివేశామని చెప్పారు. కూల్చివేసినందున పిటిషన్‌పై హైకోర్టు విచారణను ముగించింది.

ఉద్యోగులకు భరోసా కల్పించాలి

- ఎపి జెఎసి అమరావతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తీవ్రమైన పని ఒత్తిడితో నలిగిపోతున్న సగటు ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం భరోసా కల్పించాల్సిన ఆవశ్యకత ఉందని ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు విజ్ఞప్తి చేశారు. విజయవాడ లెనిన్ సెంటర్ రెవెన్యూ భవన్‌లో బుధవారం ఎపి జెఎసి అమరావతి 8వ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలిశెట్టి దామోదరరావు ఆవిర్భావ జెండాను ఎగురవేయగా, ఎపి జెఎసి అమరావతి జెండాను బొప్పరాజు వెంకటేశ్వర్లు ఎగురవేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో దీర్ఘకాలంగా పరిష్కారం కాని ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

అన్నమాచార్య యూనివర్సిటీ విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి - రాజంపేట

అన్నమయ్య జిల్లా రాజంపేట మండలం బోయినపల్లిలోని అన్నమాచార్య యూనివర్సిటీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నారు. హాస్టల్ గదిలో ఉరివేసుకుని మృతిచెందారు. పోలీసుల వివరాల మేరకు.. విద్యార్థిని అఖిల..అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో సిఇసి నాలుగో సంవత్సరం చదువుతున్నారు. ఓ ప్రయివేటు హాస్టల్ ఉంటున్నారు. బుధవారం తన గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. విద్యార్థిని మృతికి గల కారణాలు తెలియరావాల్సి ఉంది.

రూ.50 ఇస్తేనే డిజిటల్ డోర్ నెంబర్ ప్లేట్

- ప్రజలు ఆగ్రహం

ప్రజాశక్తి - రామచంద్రపురం

ప్రతీ ఇంటకీ డిజిటల్ డోర్ నెంబర్లు వేస్తామని రూ.50 వసూలు చేయడంపై సామాన్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారి ఆదేశాలతో గ్రామాల్లోని ప్రతీ ఇంటికి డోర్ నెంబర్లు వేస్తామని దానికి రూ.40 చెల్లించాలని చాటింపు వేశారు. అయితే నెంబర్ వేసే టైంలో మరో రూ.10 అదనంగా వసూలు చేసి ప్రతీ ఇంటి నుంచి రూ.50 వసూలు చేస్తున్నారు. జిల్లా పంచాయతీ అధికారి ఉత్తర్వుల్లో బాలాజీ కన్‌స్ట్రక్షన్ ఈ పనిని అప్పగించారు. కనీసం రూ.10 విలువ చేయని రేకు ముక్కలు తగిలించి రూ.50 వసూలు చేయడంపై సామాన్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పల్లెల్లో ఈ విధంగా వసూలు చేయడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. పంచాయతీ ఇంటి నెంబర్‌తో పన్నులు వసూలు చేస్తుండగా దానికి రేకుముక్క వేసి మళ్లీ రూ.50 వసూలు చేయడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

సా...గుతున్న రబీ

- సాగువిస్తీర్ణం 1.99 లక్షల ఎకరాలు
- ఇప్పటి వరకూ 1.60 లక్షల ఎకరాలకు నాట్లు



ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

తూర్పుగోదావరి జిల్లాలో రబీ పంటల సాగు పనులు దాదాపు పూర్తి కావాల్సి ఉండగా ఇంకా ఇప్పటికీ 81 శాతానికే పరిమితమైంది. ఈ ఏడాది రబీలో అని రకాల పంటలూ కలిపి 1.99 లక్షల ఎకరాల్లో సాగు జరుగుతోందని వ్యవసాయ శాఖ నివేదికలు చెబుతున్నాయి. ఏటా రబీ సాగుకు నీటి ఎద్దడి తలెత్తుతున్న నేపథ్యంలో ముందస్తు సాగు చేయాలని అధికార యంత్రాంగం భావించింది. డిసెంబరులో తుఫాను నేపథ్యంలో ప్రణాళికలు పూర్తిగా తలకిందులయ్యాయి. దీంతో రాబోయే రబీలోనూ కష్టాలు తప్పవనే సంకేతాలు విన్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రైతన్నలు అనేక సందేహాల నడుమ సాగుకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో సంక్రాతి పండుగ దాటినా జిల్లాలో రబీ సాగు 87 శాతానికి కూడా చేరుకోలేదని స్పష్టమవుతోంది. జిల్లాలో వరి సాధారణ సాగు విస్తీర్ణం 1.50 లక్షల ఎకరాలు కాగా ఇప్పటి వరకూ 1,30,000 ఎకరాల్లో వరి నాట్లు పూర్లయ్యాయి. జొన్న పంట 825 ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా కేవలం 370 ఎకరాల్లో ప్రారంభమైంది. మొక్కజొన్న సాధారణ సాగు విస్తీర్ణం 24,452 ఎకరాలు కాగా కేవం 15,077 ఎకరాల్లో మాత్రమే సాగు జరిగింది. ఇక అపరాల విషయానికి వస్తే సెనగలు 2,325 ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 1,022 ఎకరాల్లో సాగు ప్రారంభమైంది. పెసలు 1,447 ఎకరాల్లో ప్రారంభించాల్సి ఉండగా 145 ఎకరాల్లో మాత్రమే సాగు ప్రారంభమైంది. అంటే కేవలం 10 శాతం మాత్రమేనని గణాంకాలు చెబుతున్నాయి. మినుములు 2,335 ఎకరాలకు గాను ఇప్పటివరకు 705 ఎకరాల్లో సాగు ప్రారంభమైంది. నూనె పంటలైన వేరుశనగ 632 ఎకరాలకు గాను 337 ఎకరాల్లోనే సాగు మొదలయ్యింది. నువ్వులు 725 ఎకరాలకు గాను 1,55 ఎకరాల్లో సాగు ప్రారంభమయ్యింది. పొద్దుతిరుగుడు పంట 545 ఎకరాలకుగాను కేవలం 70 ఎకరాల్లో సాగు ప్రారంభమయ్యింది. వాణిజ్య పంటల సాగులో ప్రధానంగా చెరకు 1,837 ఎకరాలకు గాను కేవలం 140 ఎకరాల్లో సాగు ప్రారంభమైంది. కేవలం 8 శాతమే నమోదయ్యింది. ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడంతో ఏటా చెరకు సాగు క్రమంగా తగ్గిపోతోంది. పొగాకు 14,490 ఎకరాలకు గాను 12,395 ఎకరాల్లో సాగు చేశారు. ఇప్పటికే జిల్లాలో వరి నాట్లు కూడా పూర్తి స్థాయిలో పడలేదు. సకాలంలో కాల్వలకు నీరు విడుదల చేసినా అవి శివారు భూములకు చేరే సరికి ఆలస్యం కావడంతో సాగులో జాప్యం జరుగుతోందని తెలుస్తోంది. రైతులు ముందస్తుగానే డిసెంబరు 31 నాటికి వరి నారు వేసి నాట్లు ప్రారంభిస్తే సాగునీటి కొరత అధిగమించవచ్చని తొలుత అధికారులు అంచనా వేశారు. ప్రస్తుతం నెల రోజులు ఆలస్యం కావడంతో సీలేరు జలాలపై ఆధారపడాల్సిన తప్పని పరిస్థితి. సీలేరులో అదనంగా నీరు లభించని పక్షంలో తుది దశలో సాగునీటి కొరత ఏర్పడుతుందని రైతు సంఘాలు ఆందోళన చెందుతున్నాయి.

ఎసిబి వలలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్, ఆమె సహాయకుడు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

నాణ్యతలేని సోడాలు తయారు చేస్తున్న గోలి సోడా కంపెనీ యజమాని నుంచి లంచం డిమాండ్ చేసిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌ను, ఆమె సహాయకుడిని ఏలూరు అవినీతి నిరోధక శాఖ అధికారులు పట్టుకున్నారు. ఏలూరు అవినీతి నిరోధక శాఖ డిఎస్‌పి వి.సుబ్బరాజు తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు రూరల్ ప్రాంతంలో ఊప్స్ అనే పేరుతో కాట్లంపూడి గ్రామానికి చెందిన సాయి గోకుల్ గోలి సోడా కంపెనీ నిర్వహిస్తున్నాడు. అయితే సాయిగోకుల్‌కు ఏలూరు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ దొండపూడి కావ్యరెడ్డి, ఆమె సహాయకుడు పుల్లారావులు ఫోన్ చేసి గోలి సోడా రసాయనాలు అధికంగా ఉన్నట్లు గుర్తించామని సమాచారం అందించారు. ఇందుకు రూ.25 వేలు లంచంగా ఇవ్వాలని వారు డిమాండ్ చేయగా అధికారికి రూ.20 వేలు, సహాయకుడికి రూ.రెండు వేలుగా ఒప్పందం చేసుకున్నారు. మంగళవారం ఆ నగదును ఇచ్చేందుకు ప్రణాళిక వేసుకున్నారు. కాని అధికారి ఆమె సహాయకుడు అందుబాటులో లేకపోవడంతో మంగళవారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో ఆ లంచం సొమ్మును కావ్యరెడ్డికి, పుల్లారావుకు గోకుల్ అందించాడు. అప్పటికే అక్కడ ఉన్న అవినీతి నిరోధక శాఖాధికారులు వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న రూ.22 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. వారు వినియోగిస్తున్న కారును కూడా తనిఖీ చేయగా రూ.87 వేలు ఉన్నట్లు గుర్తించారు. వారి వద్ద నుంచి రూ.22 వేలు, కారులో రూ.87 వేలు మొత్తం రూ.1,09,000 స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా వారి ఇళ్లలో కూడా సోదాలు నిర్వహిస్తున్నామని ఎసిబి డిఎస్‌పి తెలిపారు. ఎవరైనా అధికారులు అవినీతికి పాల్పడితే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ దాడిలో ఏలూరు అవినీతి నిరోధక శాఖ డిఎస్‌పి వి.సుబ్బరాజు, సిఐలు ఎస్.బాలకృష్ణ, కె.శ్రీనివాస్, రాజమండ్రి అవినీతి నిరోధక శాఖ వాసు కృష్ణ పాల్గొన్నారు.

చేనేతకు పూర్వ వైభవం తెస్తాం

- బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత

ప్రజాశక్తి-హిందూపురం

ఆదరణకు నోచుకోలేక వెనుకబడిన చేనేత రంగానికి పూర్వ వైభవం తీసుకురావాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుకు వెళ్తున్నారని బిసి సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవితమ్మ తెలిపారు. బుధవారం పట్టణంలోని గుడ్డం రంగనాథ స్వామి ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన చేనేత పారిశ్రామిక శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలతో కలిసి కుట్టు మిషన్‌తో బట్టలు కుట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. హిందూపురంలో చేనేత శిక్షణ కేంద్రాన్ని టిడిపి తప్పా ఏ పార్టీనూ పట్టించుకోలేదన్నారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఈ ప్రాంతంలో చేనేతతో పాటు మహిళలు, యువకులకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించాలని ప్రత్యేక చొరవ చూపారన్నారు. అందులో భాగంగానే శిక్షణ కేంద్రాన్ని పున:ప్రారంభించినట్లు చెప్పారు. చేనేతలో యువతీ యువకులకు శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి కల్పిస్తున్నామన్నారు. మహిళలకు కుట్టులో శిక్షణ ఇవ్వడంతో పాటు కుట్టు మిషన్లను ఉచితంగా అందిస్తామన్నారు. ఆర్థిక తోడ్పాటుకు బ్యాంకుల ద్వారా రుణాలు అందిస్తామన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఎన్నికల హామీలన్నింటినీ అమలు చేసేలా చంద్రబాబు ప్రణాళికతో ఉన్నారన్నారు.

డ్రగ్స్ సరఫరాదారుల అరెస్ట్

- వివిధ ప్రాంతాల్లో ముగ్గురు నైజీరియన్ల అరెస్ట్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లో అక్రమంగా నివాసముంటూనే డ్రగ్స్ సరఫరా చేస్తున్న విదేశీయులపై నార్కొటెక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్-ఎన్‌ఇడబ్ల్యూ) ప్రత్యేక నిఘా వేసింది. ఇందులో భాగంగా ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 1300 గ్రాముల ఎండిఎంఎ డ్రగ్స్, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.1.60 కోట్లు ఉంటుందని పోలీసులు తెలిపారు. బుధవారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని హైదరాబాద్ సిసిఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టాస్క్‌ఫోర్స్ డిసిపి వైవీఎస్.సుధీంద్ర వివరాలు వెల్లడించారు.

నైజీరియాకు చెందిన ఆలివర్ అలియాజ్ జాన్సన్ 2008లో బట్టలు, కాస్మొటిక్ వ్యాపారం వీసాపై న్యూఢిల్లీకి వచ్చాడు. అందులో ఆశించినంతగా లాభాలు రాకపోవడంతో సులువుగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకుని ఆ దేశానికి చెందిన కొంతమందితో స్నేహం చేశాడు. ఈ క్రమంలో న్యూఢిల్లీలో డ్రగ్స్ సరఫరా చేయడం ప్రారంభించారు. 2009లో అతనికి వీసా గడువు, 2013లో పాస్‌పోర్టు గడువు పూర్తి కావడంతో ఢిల్లీ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఐదు ఏండ్లకుపైగా జైలుశిక్ష అనుభవించిన నిందితుడు.. బయటకు వచ్చాక ముంబయికి మకాం మార్చాడు. తర్వాత ఢిల్లీ, ముంబయి, బెంగళూర్‌లో నైజీరియన్స్‌కు రెండు, మూడు కిలోల చొప్పున ఎండిఎంఎ డ్రగ్స్ సరఫరా చేయడం ప్రారంభించాడు. గ్రాముకు రూ.600 నుంచి రూ.1000 వరకు వసూలు చేసేవాడు. హైదరాబాద్‌లో కూడా సరఫరా చేయాలని నిర్ణయించుకున్న నిందితుడు 1300గ్రాముల డ్రగ్స్‌ను నగరానికి తీసుకొచ్చాడు. సమాచారం అందుకున్న నార్కొటెక్ బృందాలు లంగ్‌హౌజ్ పోలీసులతో కలిసి నిందితుడిని అరెస్టు చేశారు.



డ్రగ్స్‌ను, నిందితుడిని మీడియా ఎదుట ప్రవేశపెట్టిన పోలీసులు

తప్పించుకుని తిరుగుతున్న నిందితులు

తప్పించుకుని తిరుగుతున్న పాత నేరస్థున్ని కూడా పోలీసులు గుర్తించారు. నైజీరియాకు చెందిన మౌసా కమరా అలియాజ్ రోమియోను అదుపులోకి తీసుకున్నారు. 2020, అక్టోబర్ 24న మెడికల్ వీసాపై ముంబయి ఎయిర్‌పోర్టుకు చేరుకున్న రోమియో వద్ద డ్రగ్స్ ఉన్నట్టు అనుమానించిన ఇమ్మిగ్రేషన్ అధికారులు తనిఖీ చేశారు. కొకైన్‌ను స్వాధీనం చేసుకుని ముంబయి పోలీసులకు అప్పగించారు. జైలు నుంచి బయటకొచ్చాక పోలీసుల కండ్లు గప్పి ముంబయిలోనే ఓ స్నేహితుని వద్ద ఏడాదిపాటు నివాసమున్నాడు. అతని స్నేహితుడు తిరిగి నైజీరియాకు వెళ్లడంతో అదే దేశానికి చెందిన మరికొంత మందితో స్నేహం చేశాడు. డ్రగ్స్ సప్లయ్ చేయడం ప్రారంభించాడు. అయితే పోలీసుల నిఘా అధికం కావడంతో అక్కడి నుంచి బెంగళూర్‌కు మకాం మార్చాడు. హైదరాబాద్‌లోనూ డ్రగ్స్ సరఫరా చేయాలని నిర్ణయించుకున్న నిందితుడు టోలీచౌకీకి వచ్చాడు. సమాచారం అందుకున్న నార్కొటెక్ బృందాలు నిఘా పెట్టి నిందితుడిని అరెస్టు చేసి హుమాయూన్ పోలీసులకు అప్పగించాయి. ఇదిలావుండగా, బట్టల వ్యాపారం చేస్తానంటూ నైజీరియా నుంచి 2012లో ముంబయి వచ్చిన మరో నిందితుడు వీసా గడువు తీరినా పోలీసుల కండ్లు గప్పితప్పించుకుని తిరుగుతున్నాడు. చట్టవ్యతిరేక పనులు చేస్తున్నాడని 2019లో ముంబయి పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపించారు. బయటకొచ్చాక ముంబయిలో డ్రగ్స్ సప్లయ్ చేస్తూ స్నేహితుల వద్ద నివాసముంటున్నాడు. కొద్దిరోజుల కిందట నిందితుడు హైదరాబాద్ వచ్చినట్టు సమాచారం అందుకున్న నార్కొటెక్ పోలీసులు హుమాయూన్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు వీసా లేకుండానే నగరంలో అక్రమంగా నివాసముంటున్నాడని గుర్తించారు. నిందితుడిని తిరిగి నైజీరియాకు పంపిస్తామని డీసీపీ తెలిపారు.



భళారే బాలోత్సవం

- కట్టిపడేసిన చిన్నారుల సృజనాత్మకత
- ఆట పాటల్లోనూ మేటి
- సభికుల హర్షాతిరేకాలు
- విజయవంతంగా ముగిసిన విజయనగరం బాలోత్సవం

ప్రజాశక్తి - విజయనగరం కోట

ఆనంద గజపతి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న విజయనగరం బాలోత్సవం కార్యక్రమంలో రెండో రోజు బుధవారం వక్తృత్వ పోటీలు, వ్యాసరచన, చిత్రలేఖనం, సెల్ఫీ, శాస్త్రీయ నృత్యం, పద్య పఠనం, క్విజ్ పోటీలు నిర్వహించారు. చిన్నారుల కేరింతలు, ముద్దులొలికే మాటలు, అబ్బురపరిచే వేషధారణలు, ఉర్రూతలూగించే జానపద నృత్యాలతో బాలోత్సవం మురిపించింది. రెండు రోజుల పాటు జరిగిన బాలోత్సవానికి జిల్లా నుంచి 25 ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల నుంచి 1400 మంది విద్యార్థులు హాజరై వారి ప్రతిభ కనబరిచారు. విద్యార్థినీ విద్యార్థులు అందంగా అలంకరించుకుని ఆకట్టుకునే వేషధారణలో చేసిన పలు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జానపద పాటలకు విద్యార్థుల నృత్య ప్రదర్శనలు చేశారు. విద్యార్థులు కేరింతలతో ఆడిటోరియం మార్మోగిపోయింది. ఇలాంటి కార్యక్రమాలు తమలో ఇమిడి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు దోహదపడతాయని విద్యార్థులు చెబుతున్నారు.

ఔరా అనిపించేలా..

రెండు రోజుల పాటు సాగిన బాలోత్సవంలో బాలల నృత్యాలు అలరించాయి. నిన్నటి నుంచి కొనసాగింపుగా జానపదులు, శాస్త్రీయ మేళవింపుతో సంప్రదాయ నృత్యాలతో ఔరా అనిపించారు. సభికుల చప్పట్లతో ఆడిటోరియం హోరెత్తింది. బాలలు గీసిన చిత్రాలు, మట్టితో తయారు చేసిన బొమ్మలు.. వారి సృజనాత్మకతకు, ప్రతిభకు దర్పనం పట్టాయి. ముగింపు కార్యక్రమంలో విజేతలకు, పాల్గొన్న విద్యార్థులకు విజయనగరం బాలోత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శి జిఎస్ చలం, కె.శ్రీనివాసరావు ఆధ్వర్యాన బహుమతులు అందజేశారు. ఎంఆర్, సత్య కళాశాలల ఎన్‌సిసి క్యాడెట్లు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వలంటీర్లుగా సేవలందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు రాజు, వై.శ్రీనివాసరావు, చిన్నాదేవి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.రాము, సిహెచ్ వెంకటేశ్ పాల్గొన్నారు.

నన్నయ వర్సిటీలో ఘనంగా గిరిజన ఉత్సవాలు



ప్రజాశక్తి-రాజానగరం

తెలుగు జాతి సంస్కృతీ వైభవాన్ని ఆదివాసీలు కాపాడుతున్నారని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. బుధవారం నన్నయ విశ్వవిద్యాలయ ఎన్‌టిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ (టిఎస్‌ఎఫ్) జాతీయ కమిటీ ఆధ్వర్యంలో జాతీయస్థాయి ఆదివాసీల సాంస్కృతిక మహోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా గోరంట్ల బుచ్చయ్య చౌదరి, విసి ఆచార్య వై.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ విశ్వవిద్యాలయ అధికారులు, ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సాంస్కృతిక మహోత్సవాలను ప్రారంభించారు. ముందుగా ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుండి హాజరైన గిరిజన ఆదివాసీల కళాకారులు సాంప్రదాయ నృత్య ప్రదర్శనలతో విశ్వవిద్యాలయ చాళుక్య ద్వారం నుండి ఆడిటోరియం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు.

బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించిందని, ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తున్నాయని తెలిపారు. గిరిజన విద్యార్థులు ఉన్నత ఉద్యోగాలే లక్ష్యంగా శిక్షణ పొందాలన్నారు. కళలను, సంస్కృతిని గిరిజనులు పరిరక్షిస్తున్నారని స్పష్టం చేశారు. గిరిజన ప్రాంతాల నుంచి నూతన జాతీయ రహదారులు వేస్తున్నారని చెప్పారు. తెలుగు భాషా, సంస్కృతి, సాహిత్యాన్ని పరిరక్షించడంలో అందరూ బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. విసి ఆచార్య వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం గిరిజన ప్రాంత్రాలతో పాటు ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలనే లక్ష్యంతో ఆవిర్భవించిందని అన్నారు. మహనీయులు ఆలోచనలను, ఆశయాలను సాకారం చేసే విధంగా గిరిజనులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని చెప్పారు. ఈ విశ్వవిద్యాలయం చక్కని కార్యక్రమాలు నిర్వహిస్తున్న ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ వారిని అభినందించారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ.. నన్నయ విశ్వవిద్యాలయంలో ఎంతో అద్భుతమైన ప్రాచీన గిరిజన నృత్య ప్రదర్శనలు నిర్వహించామని అన్నారు. డాక్టర్ పి.విజయనిర్మల మాట్లాడుతూ.. ఐసిఎస్ఎస్ఆర్ సహకారంతో స్థిరమైన పర్యావరణం కోసం గిరిజన సంస్కృతి పాత్ర అనే అంశంపై ప్రాజెక్టు నిర్వహిస్తున్నామన్నారు. ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు కరంసి అక్కులప్ప నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూడవత్ విష్ణునాయక్ మాట్లాడారు. గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ గిరిజనుల చరిత్ర సంస్కృతిని కాపాడుకోవాలన్నారు. టిఎస్‌ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు మల్లి భాస్కర్, మాజీ టిఎస్‌ఎఫ్ నాయకుడు అసిస్టెంట్ ప్రొఫెసర్ దొర మాట్లాడుతూ దేశంలో ఆదివాసులు తమదైన ప్రత్యేక హస్తకళా నైపుణ్యాన్ని కలిగి ఉన్నారని, అందుకే వారి సహజసిద్ధ నైపుణ్యాలను ప్రోత్సహించడం, వారి ఉత్పత్తులను ప్రచారం చేయడం, వారి ఆదాయ వనరులను మెరుగు పరచడం ఎంతో ముఖ్యమని చెప్పారు. గిరిజనుల వివిధ ఉత్పత్తులు, హస్తకళల సహజసిద్ధ నైపుణ్యాలకు వ్యాపార విలువలను జోడించుకోవాలని సూచించారు. ఈ-కామర్స్, డిజిటల్ వ్యాపార మార్గాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు.

కుంభమేళాకు ప్రధాని

ప్రయాగ్‌రాజ్ : ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళా సందర్భంగా బుధవారం ప్రధాని మోడీ సంగమంలో స్నానం చేశారు. గతంలో ఎన్నికలు జరిగినప్పుడు హిమాలయాలు, ఇతర ప్రసిద్ధ ఆలయాలకు ప్రధాని వెళ్లి.. ఫొటోలను అప్‌లోడ్ చేసిన సంగతి విదితమే. ఇప్పుడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నపుడు.. సంగమంలో స్నానం చేయటం కూడా .. హిందూ ఓటర్లను ప్రభావితం చేయటానికేనని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

ఉత్తరాఖండ్‌లో యుసిసి అమలు


- 10 రోజుల్లో ఒక సహజీవనం నమోదు

డెహ్రాడూన్ : ఉమ్మడి పౌర స్మృతి (యుసిసి)ని ఉత్తరాఖండ్ ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన మొదటి 10 రోజుల్లో కేవలం ఒకే ఒక లివ్ ఇన్ రిలేషన్‌షిప్ (సహజీవనం) నమోదయింది. సహజీవనం చేస్తున్న జంటలకు నమోదు తప్పనిసరి అనే నిబంధన కారణంగా మొత్తంగా ఐదు దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఒక జంటకు రిజిస్ట్రేషన్ మంజూరు చేశామని, మరో నాలుగు జంటలకు ధ్రువీకరణ జరుగుతోందని అధికారులు తెలిపారు. జనవరి 27న ఉత్తరాఖండ్‌లోని బిజెపి ప్రభుత్వం యుసిసిని అమల్లోకి తీసుకురావడంతో దేశంలో యుసిసిని అమల్లోకి తీసుకొచ్చిన మొదటి రాష్ట్రంగా ఉత్తరాఖండ్ నిలిచింది. కాగా, సహజీవనం చేస్తున్న జంటలకు నమోదు తప్పనిసరి అనే నిబంధన ఉన్నా.. తక్కువ దరఖాస్తులు రావడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజలు తమ వ్యక్తిగత సంబంధాల వివరాలను అధికారిక వేదికపై వెల్లడించడానికి సిద్ధంగా లేకపోవడమూ.. లేదా.. నమోదు చేసుకోని జంటలకు కఠినమైన శిక్షలు గురించి పూర్తిగా తెలియకపోవడమో కావచ్చు. అని కొంతమంది విశ్లేషకులు అంటున్నారు. నిబంధనల ప్రకారం, సహజీవనం చేస్తున్న జంట తమ సంబంధం గురించి ఒక నెలలోపు సంబంధిత అధికారులకు నివేదిక సమర్పించకపోతే, వారికి జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ద్వారా మూడు నెలల వరకు జైలు శిక్ష లేదా రూ. 10,000 వరకూ జరిమానా లేదా ఈ రెండూ విధిస్తారు. తప్పనిసరిగా సహజీవనాన్ని నమోదు చేసుకోవాలనే యుసిసి నిబంధన ప్రజల గోప్యతా హక్కును ఉల్లంఘించడమేనని, ఇది ప్రజల 'బెడ్‌రూమ్‌లలోకి తొంగి చూసే" చర్యగా మరి కొంతమంది విమర్శిస్తున్నారు.

యుజిసి డ్రాఫ్ట్ నిబంధనలు

సమాఖ్య సూత్రాలకు విరుద్ధం

- వెంటనే ఉపసంహరించుకోవాలి
- బెంగళూరులో బిజెపియేతర రాష్ట్రాల విద్యా మంత్రుల తీర్మానం



బెంగళూరులో సమావేశానికి హాజరైన బిజెపియేతర రాష్ట్రాల విద్యాశాఖా మంత్రులు

బెంగళూరు : యుజిసి డ్రాఫ్ట్ నిబంధనలను బిజెపియేతర రాష్ట్రాల విద్యా మంత్రులు తీవ్రంగా విమర్శించారు. బెంగళూరులో బుధవారం జరిగిన బిజెపియేతర రాష్ట్రాల విద్యా శాఖ మంత్రుల సమావేశంలో ఈ నిబంధనలకు వ్యతిరేకంగా 15 అంశాల తీర్మానాన్ని ఆమోదించారు. ముసాయిదాలో సవరణలు, ప్రతిపాదనలు సమాఖ్య సూత్రాలకు విరుద్ధంగా ఉన్నాయని మంత్రులు విమర్శించారు. విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో ఉపాధ్యాయులు, విద్యా సిబ్బంది నియామకం, పదోన్నతికి సంబంధించిన నిబంధనలను మంత్రులు విమర్శించారు. కొత్త విద్యా విధానం 2020 ఆధారంగా ఉన్నత విద్యా సంస్థలకు గ్రేడింగ్ ఇచ్చే ప్రక్రియను కూడా వ్యతిరేకించారు. ఈ డ్రాఫ్ట్ నిబంధనలను ఉపసంహరించుకోవాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశం అనంతరం కర్ణాటక ఉన్నత విద్యాశాఖ మంత్రి ఎంసి సుధాకర్ విలేకరులతో మాట్లాడారు. బిజెపితో పొత్తు పెట్టుకున్న పార్టీలు కూడా యుజిసి డ్రాఫ్ట్ నిబంధనలను వ్యతిరేకిస్తున్నాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లోని టిడిపి, బీహార్‌లోని జెడియు, లోక్ జనశక్తి పార్టీ ఇందుకు ఉదాహరణ అని తెలిపారు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం కూడా ఈ ముసాయిదాను పరిశీలించడానికి నిపుణుల కమిటీ ఏర్పాటు చేసిందని తెలిపారు. 'కేంద్ర ప్రభుత్వాన్ని తక్షణమే ఈ నిబంధనలు ఉపసంహరించుకోవాలని, రాష్ట్రాలతో సమిష్టిగా సంప్రదింపులు జరపాలని తీర్మానంలో కోరాం. కేంద్ర నిర్ణయం తరువాత, తదుపరి చర్యపై నిర్ణయం తీసుకుంటాం' అని చెప్పారు. 'యుజిసి డ్రాఫ్ట్‌లో వైస్-ఛాన్సలర్ల నియామకంలో రాష్ట్రాలకు ఎటువంటి అధికారం లేదు. పైగా గవర్నర్‌కు పూర్తి అధికారం ఇవ్వబడింది. నిజానికి విశ్వవిద్యాలయాల మౌలిక సదుపాయాల అభివృద్ధి, సిబ్బంది నియామకం, జీతం, ఇతర అంశాలతో సహా అన్ని విధులను రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తాయి' అని మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో కర్ణాటకతోపాటు హిమాచల్‌ప్రదేశ్, జార్ఖండ్, కేరళ, తమిళనాడు, తెలంగాణ కర్ణాటక రాష్ట్రాల మంత్రులు, ప్రతినిధులు పాల్గొన్నారు. అత్యవసర సమావేశాల కారణంగా జమ్ముకాశ్మీర్ మంత్రి పాల్గొనలేక పోయారని మంత్రి సుధాకర్ చెప్పారు.

రాజ్యాంగంపై బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ దాడి : రాహుల్ గాంధీ



పాట్నా : అంబేద్కర్ వంటి ప్రముఖ దళిత నాయకులపట్ల గౌరవం నటిస్తూ ప్రజల్ని మోసం చేస్తున్న బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్ కూటమి నుంచి రాజ్యాంగం దాడికి గురువుతోందని కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీ విమర్శించారు. ప్రముఖ దళిత స్వాతంత్ర్య సమరయోధుడు, కాంగ్రెస్ కార్యకర్త జగ్‌లాల్ చౌదరి జయంతి సందర్భంగా పాట్నాలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేసిన తరువాత, విమానంలో ఇక్కడకి చేరుకున్నట్లు రాహుల్ తెలిపారు. దళితులు, గిరిజనులు, బిసిలకు అన్ని రంగాల్లోనూ మెరుగైన ప్రాతినిధ్యం కల్పించాలని, కేవలం రాజకీయ ప్రాతినిధ్యం మాత్రమే సరిపోదని తెలిపారు. అధికార యంత్రాంగం, ప్రైవేటు రంగాల్లోనూ వీరు నాయకులుగా ఎదగాలని రాహుల్ పిలుపునిచ్చారు. 'రాజ్యాంగం అమలులో ఉన్నంత వరకు, దళితులు, సమాజంలోని ఇతర అణగారిన వర్గాలు మెరుగైన జీవితాన్ని ఆశించవచ్చు. బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్‌కు ఇది తెలుసు, కాబట్టి వారు రాజ్యాంగంపై దాడి చేస్తారు, కానీ బహిరంగంగా కాదు' అని రాహుల్ పేర్కొన్నారు.

'ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రాజ్యాంగం ముందు, అంబేద్కర్ విగ్రహం ముందు నమస్కరిస్తున్నట్లు మీరు చూడవచ్చు. కొంతమంది ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు అంబేద్కర్‌కు భక్తి గీతాలు పాడటం కూడా చూడవచ్చు. వీరంతా అంబేద్కర్ ప్రతిపాదించిన ఆదర్శాలకు వ్యతిరేకంగా పనిచేస్తూ అలా నటిస్తారు' అని రాహుల్ విమర్శించారు. మీడియా రంగంలో దళితుల సంఖ్య తక్కువగా ఉందని, అందుకే దళిత సమస్యలకు ప్రాముఖ్యత లభించదని తెలిపారు. విద్యా రంగంలోనూ 'ప్రశ్నాపత్రాలు రూపొందించే స్థాయికి' దళితులు చేరుకోలేదని చెప్పారు. ఇక దేశంలోని బిలియనీర్లలో ఒక్క దళితుడు కూడా లేడని అన్నారు. అణగారిన వర్గాలకు మెరుగైన భాగస్వామ్య దిశలో కుల గణన మొదటి అడుగు అని, కులగణనను కాంగ్రెస్ ముందుకు తీసుకెళుతుందని రాహుల్ ప్రకటించారు.

మేక్ ఇన్ ఇండియా' వైఫల్యాన్ని అంగీకరించండి : ప్రధానికి రాహుల్ సూచన

మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం విఫలమైందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అంగీకరించాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఇటీవల పార్లమెంట్‌లో ప్రధాని తన ప్రసంగంలో మేక్ ఇన్ ఇండియా గురించి ప్రస్తావించకపోవడాన్ని గుర్తు చేస్తూ రాహుల్ ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 2014లో జిడిపిలో 15.3 శాతంగా ఉన్న తయారీ రంగం ప్రస్తుతం 12.6 శాతానికి దిగజారింది. గత 60 ఏళ్లలో ఇది అత్యల్పం' అని పోస్ట్‌లో రాహుల్ తెలిపారు. దేశంలో యువతకు ఉద్యోగాలు చాలా అవసరమని, ఇటీవల కాలంలో ఏ ప్రభుత్వాలు (ఎన్‌డిఎ, యుపిఎ) ఈ సమస్యను తీర్చలేకపోయాయని రాహుల్ అంగీకరించారు.

ఎయిమ్స్‌లో ఫ్యాకల్టీ కొరతను నివారించండి: జైరాం రమేష్

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా ఎయిమ్స్ ఆసుపత్రుల్లో ఫ్యాకల్టీ కొరత కలవరపెడుతోందని కాంగ్రెస్ ఎంపి జైరాం రమేష్ ఆందోళన వ్యక్తం చేశారు. ఎయిమ్స్‌లో ఖాళీలపై రాజ్యసభలో తాను అడిగిన ప్రశ్నకు సమాధానంగా దేశవ్యాప్తంగా ఎయిమ్స్ సంస్థల్లో అధ్యాపకుల ఖాళీల వివరాలను మంగళవారం కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ తెలిపిందని పేర్కొన్నారు. ఆ గణాంకాలు కలవరపెడుతున్నాయని బుధవారం ఎక్స్‌లో ఆయన పోస్ట్ చేశారు. అధ్యాపక ఖాళీలు ఎయిమ్స్ న్యూఢిల్లీలో 34 శాతం, బోపాల్‌లో 24 శాతం, భువనేశ్వర్‌లో 25 శాతం, జోద్‌పూర్‌లో 28 శాతం, రాయ్‌పూర్‌లో 38 శాతం, పాట్నాలో 27 శాతం, రిషికేశ్‌లో 39 శాతం ఉన్నాయని తెలిపారు.

మరో 12 నగరాల్లో పాక్షికంగా ఎయిమ్స్ సేవలందిస్తోందని పేర్కొన్నారు. మంగళగిరిలో 41 శాతం, నాగ్‌పూర్‌లో 23 శాతం, కల్యాణిలో 39 శాతం, గోరఖ్‌పూర్‌లో 37 శాతం, బటిండాలో 33 శాతం, బిలాస్‌పూర్ (హెచ్‌పి)లో 54 శాతం, గౌహతిలో 43 శాతం, దేవ్‌గఢ్‌లో 34 శాతం, బిబి నగర్ (తెలంగాణ)లో 36 శాతం, రాయ్‌బరేలిలో 49 శాతం, రాజ్‌కోట్‌లో 59.5 శాతం, జమ్ములో 44 శాతం అధ్యాపకుల కొరత ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రమాణాలు నీరుగారకుండా చర్యలు తీసుకోవాలని, అధ్యాపక పోస్టుల భర్తీకి ప్రాధాన్యత ఇవ్వాలని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రిని ఆయన కోరారు. జైరాం రమేష్ పోస్ట్‌పై కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ స్పందించింది. ఎయిమ్స్ సంస్థల్లోని ఖాళీలను భర్తీ చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వెల్లడించింది.

బిజెపికే మొగ్గు

- ఢిల్లీ ఎన్నికల ఫలితాలపై ఎగ్జిట్ పోల్స్

న్యూఢిల్లీ : ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి గెలుపొందుతుందని కొన్ని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు బుధవారం నిర్వహించగా, వీటి ఫలితాలు ఈ నెల 8న ప్రకటించనున్నారు. బుధవారం సాయంత్రం పలు సంస్థలు తమ ఎగ్జిట్ పోల్స్‌ను విడుదల చేశాయి. ఇందులో ఎక్కువ ఎగ్జిట్ పోల్స్ స్వల్ప తేడాతో బిజెపి విజయం సాధిస్తుందని వెల్లడించాయి. పీపుల్స్ పల్స్ బిజెపికి 51 నుంచి 60 సీట్లు, ఆప్‌కు 10 నుంచి 19 సీట్లు వస్తాయని తెలిపింది. పీపుల్స్ ఇన్‌సైట్ బిజెపికి 40 నుంచి 44, ఆప్‌కి 25 నుంచి 29 సీట్లు వస్తాయని తెలిపింది. పి-మార్క్ బిజెపికి 39 నుంచి 49, ఆప్‌కు 21 నుంచి 31 సీట్లు వస్తాయని అంచనా వేసింది. జెవిసి ఎగ్జిట్ పోల్ బిజెపికి 39 నుంచి 45, ఆప్‌కు 22 నుంచి 31 సీట్లు వస్తాయని తెలిపింది. చాణక్య స్ట్రాటజీస్ ఎగ్జిట్ పోల్ బిజెపికి 39 నుంచి 44, ఆప్‌కు 25 నుంచి 28 సీట్లు వస్తాయని తెలిపింది.


ఆప్ గెలుస్తుందని రెండు సంస్థల అంచనా

రెండు సంస్థలు ఈ ఎన్నికల్లో ఆప్ విజయం సాధిస్తాయని అంచనా వేశాయి. వీ ప్రెసిడే ఆప్‌కు 46 నుంచి 52 సీట్లు, బిజెపికి 18 నుంచి 23 సీట్లు వస్తాయని తెలిపింది. మైండ్ బ్రింక్ ఆప్‌కు 44 నుంచి 49 సీట్లు, బిజెపికి 21 నుంచి 25 సీట్లు వస్తాయని అంచనా వేసింది.

ఎగ్జిట్ పోల్స్‌ను ఆప్ తిరస్కరించింది. ఆప్ జాతీయ అధికార ప్రతినిధి రీనా గుప్తా మాట్లాడుతూ '2013, 2015, 2020లోనూ మీరు ఏ ఎగ్జిట్ పోల్ చూసినా ఆప్‌నకు తక్కువ సీట్లు వస్తాయనే చెప్పారు. ఫలితాల్లో ఆప్‌కు అంతకంటే ఎక్కువ సీట్లు వచ్చాయి' అని తెలిపారు.

ఢిల్లీ కీలక నియోజకవర్గాల్లో గట్టి పోటీ

ప్రజాశక్తి- న్యూఢిల్లీ బ్యూరో



ఓటు వేస్తున్న సిపిఎం నాయకులు ప్రకాశ్‌కరత్

ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ న్యూఢిల్లీ నియోజకవర్గం నుంచి పోటీలో ఉన్నారు. ఆయనపై బిజెపి అభ్యర్థి పర్వేష్ వర్మ, కాంగ్రెస్ అభ్యర్థి సందీప్ దీక్షిత్ పోటీ పడుతున్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషిపై బిజెపి ఢిల్లీ విభాగం చీఫ్ రమేష్ బిధూరి, కాంగ్రెస్ అభ్యర్థి అల్కా లంబా పోటీలో ఉన్నారు. ఆప్ వరుసగా రెండుసార్లు గెలిచిన కీలక నియోజకవర్గం జాంగ్‌పుర నుంచి ఆ పార్టీ అభ్యర్థిగా మనీష్ సిసోడియా, బిజెపి నుంచి తర్వీందర్ సింగ్, కాంగ్రెస్ అభ్యర్థిగా ఫర్హద్ సూరి పోటీ పడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ ప్రధానంగా ఆప్, బిజెపి మధ్యనే ఉంది. కాంగ్రెస్ సైతం మెరుగైన ఫలితాలు ఆశిస్తోంది. ఫిబ్రవరి 8న ఎన్నికల ఫలితాలు వెలువడతాయి.

ఈరోడ్, మిల్కిపూర్ అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నిక

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

తమిళనాడులోని ఈరోడ్ అసెంబ్లీ నియోజకవర్గానికి, ఉత్తరప్రదేశ్‌లోని మిల్కిపూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి బుధవారం ఉప ఎన్నిక జరిగింది. ఈరోడ్‌లో 64.02 శాతం ఓటింగ్ నమోదైంది. మిల్కిపూర్‌లో 65.25 శాతం నమోదైంది. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ అసెంబ్లీ ఉప ఎన్నికకు పోలింగ్ జరుగుతున్న మిల్కిపూర్ నియోజకవర్గంలో పోలీసులు ఓటర్ల ఐడిలను తనిఖీ చేస్తున్నారని, వారిలో 'భయం కలిగించడానికి' అని పేర్కొన్నారు. పోలింగ్ బూత్ వెలుపల ఒక వ్యక్తి ఐడి కార్డును తనిఖీ చేస్తున్న పోలీసు అధికారి చిత్రాన్ని పంచుకున్నారు. అయోధ్య సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రాజ్ కరణ్ నాయర్ ఈ ఆరోపణలను ఖండించారు. ఆ చిత్రంలో ఉన్న ఐడి కార్డును తనిఖీ చేస్తున్న వ్యక్తి పోలింగ్ ఏజెంట్ అని అన్నారు. ఫైజాబాద్ ఎంపి అవధేష్ ప్రసాద్ విలేకరులతో మాట్లాడుతూ.. బిజెపి ఓటర్లను ప్రభావితం చేయడానికి, బెదిరించడానికి అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చిందని ఆరోపించారు.

105 మంది భారతీయులు రాక

(మొదటిపేజీ తరువాయి)

ఎంబసీ అధికారులు తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని విమానాలు భారత్‌కు రానున్నాయని తెలిపారు. అమెరికా విమానంలో వచ్చిన భారతీయుల కోసం విమానాశ్రయంలో కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు పంజాబ్ డిజిపి గౌరవ్ యాదవ్ తెలిపారు.

కేంద్ర మంత్రితో సమావేశమవుతాం : పంజాబ్ మంత్రి

ఎన్‌ఆర్‌ఐలను అమెరికా పంపిస్తున్న తీరుపై పంజాబ్ ఎన్‌ఆర్‌ఐ వ్యవహారాల మంత్రి కులదీప్ సింగ్ దలెవాల్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలా పంపిస్తున్న వీరందరూ అమెరికా ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి ఎంతో కొంత దోహదపడినవారేనని, అటువంటి వారిని ఇలా తరలించడానికి బదులుగా అక్కడ శాశ్వత నివాసానికి అనుమతించి వుంటే బాగుండేదని మంత్రి వ్యాఖ్యానించారు. అమెరికాలో నివసిస్తున్న పంజాబీల సమస్యలు, ఆందోళనలపై చర్చించేందుకు వచ్చే వారం విదేశాంగ మంత్రి జై శంకర్‌తో సమావేశం కావాలని భావిస్తున్నట్లు చెప్పారు.

చేతులకు బేడీలు వేసి...అత్యంత అవమానకరమైన రీతిలో...కాంగ్రెస్ ఆందోళన

అమెరికా నుండి వచ్చిన భారతీయుల చేతులకు సంకెళ్లు వేసి అవమానించిన చిత్రాల పట్ల కాంగ్రెస్ బుధవారం తీవ్ర విచారం వ్యక్తం చేసింది. విమానం నుండి బయటకు వస్తున్న వారి చిత్రాలు చూస్తుంటే ఒక భారతీయుడిగా తనకు చాలా ఆవేదన కలుగుతోందని కాంగ్రెస్ మీడియా, ప్రచార విభాగాధిపతి పవన్ ఖెరా చెప్పారు. ఈ సందర్భంగా 2013లో యుపిఎ ప్రభుత్వ హయాంలో జరిగిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. 2013 డిసెంబరులో భారత దౌత్యవేత్త దేవయాని ఖోబ్రాగడె చేతులకు సంకెళ్లు వేసి, దుస్తులు విప్పించి మొత్తంగా సోదాలు చేశారని, దీనిపై విదేశాంగ కార్యదర్శి సుజాత సింగ్... అమెరికా రాయబారి నాన్సీ పావెల్‌కు తీవ్రంగా నిరసన తెలియజేశారని ఖెరా గుర్తు చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. మీరా కుమార్, సుశీల్ కుమార్ షిండె, రాహుల్ గాంధీ వంటి నేతలు ఆ సమయంలో భారత్‌లో పర్యటిస్తున్న అమెరికా కాంగ్రెస్ ప్రతినిధి బృందాన్ని కలుసుకోవడానికి తిరస్కరించారని ఆయన గుర్తు చేశారు. అమెరికా చర్యను ప్రధాని మన్మోహన్ సింగ్ ఖండించారన్నారు. అమెరికా ఎంబసీకి ఇచ్చిన అనేక రాయితీలను భారత్ ఉపసంహరించుకుందన్నారు. దేవయాని ఖోబ్రాగడె పట్ల వ్యవహరించిన తీరుకు జాన్ కెర్రీ విచారం వ్యక్తం చేశారు. 1999 బ్యాచ్ ఐఎఫ్ఎస్ అధికారి అయిన దేవయానిని వీసా మోసం ఆరోపణలపై న్యూయార్క్‌లో అరెస్టు చేశారు. ఈ అంశం ఇరు దేశాల మధ్య వివాదాన్ని రేపింది. కొన్ని కేటగిరీలకు చెందిన అమెరికా దౌత్యవేత్తల ప్రత్యేక సదుపాయాలను, హక్కులను తగ్గించడంతో సహా పలు చర్యలు తీసుకుంది.

'హోదా' డిమాండ్ పునరుద్ధరించండి

(మొదటిపేజీ తరువాయి)

అసంతృప్తి తొలగిపోతుందన్నారు.

స్పష్టత లేని పి4 విధానం

చంద్రబాబు విజన్ 2047 పేరుతో తీసుకొచ్చిన పి4 విధానంపై స్పష్టత లేదన్నారు. విజన్ 2020 ఫెయిలైందని, మరలా 2047 తీసుకొచ్చారని తెలిపారు. ఉగాది నుంచి అమలు చేస్తామని చెబుతున్న ఈ విధానంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజల పాత్ర, దీనివల్ల వారికి కలిగే లాభం ఏమిటో చెప్పాలని కోరారు. సమాజపరమైన వనరులు భూమి తదితర ప్రజల ఆస్తులను ప్రైవేట్ కంపెనీలకు దోచిపెట్టేందుకు ఈ విధానం తీసుకొచ్చారని అన్నారు. ఉగాది నుండి హడావుడిగా అమలు చేయకుండా దీనిపై అసెంబ్లీలో చర్చ పెట్టడంతో పాటు అఖిలపక్షం ఏర్పాటు చేయాలని కోరారు. పి4 పేరుతో ప్రజల మాడు పగలగొట్టి ఆస్తులను కార్పొరేట్‌కు అప్పగిస్తామంటే తాము అంగీకరించబోమన్నారు. కమ్యూనిస్టులను మారాలని చెబుతున్న చంద్రబాబు మారుతున్న ప్రపంచాన్ని గుర్తించడం లేదన్నారు. ప్రైవేట్ కంపెనీలు దివాళా తీయడంతో అమెరికా,యూరప్ వంటి దేశాలు కూడా ప్రభుత్వ రంగాన్ని బలపర్చుకుంటున్నాయని చెప్పారు. ప్రభుత్వ రంగాన్ని బలపర్చుకునే విధంగా చంద్రబాబు విధానాలను మార్చుకోవాలని చెప్పారు. కాలంతో పాటు చంద్రబాబు కూడా మారాలని ఆయన హితవు పలికారు. విజన్ 2047 ఆకాశంలో మబ్బులాంటి దని, దానిని చూసి ముంతలో నీటిని పారబోయొద్దన్నారు.

కార్పొరేట్లపై పన్నులు పెంచాలి

రాష్ట్ర ఆదాయాన్ని పెంచుకునేందుకు కార్పొరేట్లపై పన్నులు, సెస్సులు పెంచాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వనరులు ఉపయోగించుకుంటున్నప్పుడు డబ్బులు ఎందుకు చెల్లించరని ప్రశ్నించారు.రాష్ట్రంలో ఉన్న బడా కార్పొరేట్లు లక్ష కోట్ల పన్నులు ఎగ్గొట్టారని చెప్పారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో కార్పొరేట్ కంపెనీలకు పన్నులు తగ్గిస్తున్నారని తెలిపారు. ఈ విధానం ప్రజలు, రైతులు, నిరుద్యోగులకు అవసరం లేదా అని ప్రశ్నించారు. దావోస్ పర్యటనకు వెళ్లి ఏం సాధించారని ప్రశ్నించారు. మహారాష్ట్ర, తెలంగాణలతో చేసుకున్న ఒప్పందాలు మన రాష్ట్రంతో ఎందుకు చేసుకోలేదన్నారు. అంతర్జాతీయంగా పెటుబడిదారులు సంక్షోభంలో ఉన్నారని వారి చుట్టూ ప్రభుత్వాలు తిరగడం కాదని, ప్రభుత్వం చుట్టే వాళ్లు తిరగాలని అన్నారు. ప్రజా సమస్యలపై కలిసొచ్చే లౌకిక ప్రజాతంత్ర శక్తులను కలుపుకుని విశాలమైన ప్రజా ఉద్యమాలు నిర్మించాలని రాష్ట్రమహాసభలో నిర్ణయించామని చెప్పారు. ఈ సమావేశంలో ఆ పార్టీ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సిహెచ్ బాబూరావు, కె ప్రభాకర్ రెడ్డి, డి రమాదేవి, వి వెంకటేశ్వర్లు, వి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

గాజాను స్వాధీనం చేసుకుంటాం!

ట్రంప్ వ్యాఖ్యలపై మధ్యప్రాచ్యం ఆగ్రహం

- సరైన ఆలోచనే అన్న నెతన్యాహు
- ఖండించిన హమాస్
- మా భూమి నుండి మమ్మల్నెలా పంపిస్తారని ప్రశ్న



వాషింగ్టన్, గాజా : ఇజ్రాయిల్ దాడులతో చిన్నాభిన్నమైన గాజా ప్రాంతాన్ని అమెరికా స్వాధీనం చేసుకుంటుందని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఆ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకుని, ఆర్థికంగా అభివృద్ధి చేస్తామని, అక్కడ అపరిమితమైన సంఖ్యలో ఉద్యోగాలను సృష్టిస్తామని, కొత్తగా ఇళ్లను నిర్మిస్తామని వెల్లడించారు. ట్రంప్ ప్రకటన చరిత్రను మారుస్తుందని నెతన్యాహు అభిప్రాయపడ్డారు. ఈ వ్యాఖ్యలపై మధ్య ప్రాచ్యం ఆగ్రహం వ్యక్తం చేసింది. వైట్‌హౌస్‌లో మంగళవారం ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహుతో ట్రంప్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇజ్రాయెల్, గాజాల మధ్య నెలకొన్న తాజా పరిస్థితులపై ఇరువురు నేతలు చర్చించారు. అనంతరం ఇరువురు నేతలు సంయుక్త పత్రికా సమావేశంలో పాల్గొన్నారు. గాజా ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని మాత్రమే ట్రంప్ చెప్పారు. అక్కడ నివసించడానికి ఎవరిని అనుమతిస్తారనే విషయాలు వెల్లడించలేదు. ప్రస్తుతం గాజాలో నివసిస్తున్న పాలస్తీనియన్లందరూ అక్కడ నుండి వెళ్లిపోవాలని, మధ్య ప్రాచ్యంలోని ఇతర దేశాల్లో నివసించాలని అన్నారు. గాజాను తమ ఆధీనంలోకి తీసుకుని, దాడుల కారణంగా ధ్వంసమైన భవనాలన్నింటినీ కూల్చివేసి, పేలని బాంబులను నిర్వీర్యం చేసి, ఇతర ఆయుధాలను అక్కడ నుండి తొలగించి, ఆ ప్రాంతాన్నంతా శుభ్రపరుస్తామని చెప్పారు. ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి అవసరమైన వాతావరణాన్ని సృష్టిస్తామన్నారు. అక్కడ నివసించేవారికి ఇళ్లు కూడా నిర్మిస్తామన్నారు. వేరే ప్రత్యామ్నాయం లేకనే పాలస్తీనియన్లు గాజాకు తిరిగి వెళ్లానుకుంటున్నారని అన్నారు. ప్రమాదకరంగా వున్న భవనాల్లో నివసిస్తూ, అనుక్షణమూ భయం, భయంగా బతుకు వెళ్లదీసే బదులు భద్రత వున్న ఇళ్లలో, మంచి వాతావరణంలో వారు జీవించవచ్చని సూచించారు. గాజాకు అమెరికా బలగాలను పంపే అవకాశం వుందా అని ప్రశ్నించగా అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. గాజాను స్వాధీనం చేసుకోవడానికి ప్రణాళికలు రచిస్తున్నామని, భవిష్యత్‌లో మధ్యప్రాచ్యంలో పర్యటన సందర్భంగా గాజా, ఇజ్రాయిల్, సౌదీ అరేబియాలను సందర్శిస్తానని ట్రంప్ చెప్పారు. గాజా స్ట్రిప్‌ను మృత్యువు, విధ్వంసాలకు చిహ్నంగా ట్రంప్ అభివర్ణించారు. నరకానికి ప్రవేశద్వారంలా వుందన్నారు. అక్కడ నివసించడం ఏ మాత్రమూ సరికాదన్నారు.

చరిత్ర మారుతుందన్న నెతన్యాహు

ట్రంప్ ప్రతిపాదనపై నెతన్యాహు స్పందిస్తూ, దీనివల్ల చరిత్ర మారుతుందని భావిస్తున్నామని చెప్పారు. ఈ మార్గాన్ని అనుసరించడం సరైనదేనని భావిస్తున్నానన్నారు. గాజా మరోసారి ఇజ్రాయిల్‌కు ముప్పుగా మారరాదన్నది తమ లక్ష్యమని, ట్రంప్ దాన్ని మరింత పై స్థాయికి తీసుకెళుతున్నారని అన్నారు. అక్కడ నుండి మాపై చాలా దాడులు జరిగాయని, ఈ పరిస్థితుల్లో ట్రంప్ భిన్నంగా ఆలోచిస్తున్నారని అన్నారు. దీనిపై దృష్టి పెట్టాల్సి వుందన్నారు.

ఉలిక్కిపడిన మధ్య ప్రాచ్యం !

నిర్ద్వంద్వంగా తిరస్కరించిన హమాస్

గాజా నుండి బయటకు వెళ్ళి పాలస్తీనియన్లు నివాసం ఏర్పరచుకోవాలంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యల పట్ల మధ్య ప్రాచ్య దేశాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ట్రంప్ వ్యాఖ్యలు దిగ్భ్రాంతికి గురి చేశాయని పేర్కొన్నాయి. ట్రంప్ వ్యాఖ్యలను హమాస్ తీవ్రంగా ఖండించింది.

గాజాలో ఊచకోతకు, విధ్వంసానికి ఇజ్రాయిల్‌ను బాధ్యురాలిని చేసి, శిక్షించడానికి బదులుగా ట్రంప్ ఈ రీతిలో మాట్లాడడం చాలా దారుణమని హమాస్ ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రస్తుత పరిస్థితుల్లో గందరగోళం సృష్టించడానికి, ఉద్రిక్తతలు పెంచడానికి ట్రంప్ ప్రయత్నిస్తున్నారని హమాస్ నేత సమీ అబు జుహ్రీ అన్నారు. తమ ప్రజలు దీనిని ఎట్టి పరిస్థితుల్లో ఆమోదించరని, తమ భూమి నుండి తమని తరలించడమే కాకుండా ఇలా దురాక్రమణకు పాల్పడడాన్ని అడ్డుకోవాల్సి ఉందని జుహ్రీ స్పష్టం చేశారు. గాజా, వెస్ట్ బ్యాంక్‌లలోని పాలస్తీనీయులను తాత్కాలికంగా ఈజిప్ట్, జోర్డాన్ దేశాలకు తరలించాలంటూ గతంలో ట్రంప్ ప్రతిపాదించారు. ఆనాడు ఈ ప్రతిపాదనలను అరబ్ దేశాలు తిరస్కరించాయి.

సౌదీ వైఖరిలో మార్పు వుండదు

స్వతంత్ర పాలస్తీనా ఏర్పడాలన్న తమ సుదీర్ఘ డిమాండ్‌లో ఎలాంటి మార్పు వుండదని, తమ వైఖరి చాలా దృఢంగా వుందని సౌదీ అరేబియా విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన జారీ చేసింది. స్వతంత్ర పాలస్తీనా ఏర్పాటు కోసం సౌదీ చేస్తున్న కృషి ఆగదని యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్ ప్రకటించారు. అది జరగకుండా ఇజ్రాయిల్‌తో దౌత్య సంబంధాలు ఏర్పాటు చేసుకోబోమని స్పష్టం చేశారు.

నేరస్తులుగా చిత్రీకరిస్తారా?

- ఇమ్మిగ్రేషన్ అధికారుల తీరుపై అమెరికా వాసుల ఆగ్రహం
- దేశవ్యాప్తంగా నిరసనలు



ఇమ్మిగ్రేషన్ అధికారుల తీరుపై నిరసన తెలుపుతున్న అమెరికా వాసులు

అట్లాంటా : రెండోసారి అధికారంలోకి వచ్చిన వెంటనే అధ్యక్షుడు ట్రంప్ తీసుకుంటున్న చర్యలు, వాటిని అమలు చేస్తున్న తీరు పట్ల అమెరికా వ్యాప్తంగా ప్రజల్లో తీవ్ర నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. చట్టబద్ధమైన పత్రాలు లేకుండా దేశంలో నివసిస్తున్న వారిని అత్యంత అమానవీయంగా వారి స్వదేశాలకు పంపుతున్న తీరు పట్ల సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. సరైన పత్రాలు లేవని లేదా క్రిమినల్ నేరాల్లో దోషులనే ఆరోపణలతో ఫెడరల్ ఇమ్మిగ్రేషన్ అధికారులు చాలామందిని అరెస్టు చేస్తున్నారు. వారు నిజానికి ఎలాంటి నేరాల్లోనూ నిందితులు కాదు. అధికారులు దాడులు చేసి, రోజుకు దాదాపు 800 నుండి వెయ్యి మందిని అరెస్టు చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో మైగ్రెంట్లను నేరస్తులుగా చిత్రీకరిస్తున్నారని, వారి ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తున్నారంటూ ట్రంప్ ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇమ్మిగ్రేషన్ కస్టమ్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసిఇ) సోషల్‌మీడియా వేదికల ద్వారా తన ఆపరేషన్ గురించి చెబుతున్న వాటికి వాస్తవిక పరిస్థితులకు అసలు పొంతన లేదని చెబుతున్నారు. తుపాకులను కలిగి వున్నారని, మాదకద్రవ్యాలు వున్నాయని, హత్యలకు, లైంగిక దాడులకు పాల్పడ్డారని ఇలా క్రిమినల్ నేరాల ఆరోపణలతో ఈ తరలింపు ప్రక్రియ సాగుతోంది. గత వారం ఐసిఇ చేసిన అరెస్టులకు ఈ కేసులకు సంబంధమే లేదు. దీనిపై ఎన్‌బిసి న్యూస్ సోదాహరణలతో వార్తా కథనాలు అందజేసింది. ఎన్‌బిసి న్యూస్ ప్రకారం కేవలం 613 అరెస్టులు మాత్రమే క్రిమినల్ అరెస్టులుగా పరిగణించారని, మిగిలిన 566మందిలో 47శాతం మంది సరైన పత్రాలు లేకుండా నివసిస్తున్నవారని ఆ నివేదిక పేర్కొంది. వీరందరినీ కలిపి ఐసిఇ నిర్బంధ శిబిరాల్లో పెట్టి, ఆ తర్వాత వారిని వారి దేశాలకు అమానవీయ రీతిలో తరలిస్తున్నారని వివరించింది.

అంతర్జాతీయ సవాళ్ల పరిష్కారానికి

ఇయుతో కలిసి పనిచేస్తాం : చైనా



లిన్ జియాన్

బీజింగ్ : అంతర్జాతీయంగా ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడంలో యూరోపియన్ యూనియన్(ఇయు)తో కలిసి పనిచేసేందుకు సుముఖంగా వున్నట్లు చైనా పేర్కొంది. సహకారాన్ని పెంచుకునేందుకు ఇయు విశ్వసనీయమైన భాగస్వామిగా మారుతుందని ఆశిస్తున్నామని, దానితో సంబంధాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ బుధవారం పేర్కొన్నారు. ఇప్పటికే చైనా, కెనడా, మెక్సికో దేశాల దిగుమతులపై అదనపు సుంకాలు విధించిన ట్రంప్ ఇయు ఉత్పత్తులపై కూడా విధించే అవకాశాలు వున్నాయని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడితో చర్చలు జరపాలని భావిస్తున్నట్లు ఇయు వాణిజ్య చీఫ్ మంగళవారం తెలిపారు. ట్రంప్‌తో యురోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయన్ జరపబోయే చర్చలేవీ అంత సాఫీగా జరగకపోవచ్చని భావిస్తున్నారు. ట్రంప్ టారిఫ్‌ల బెదిరింపులతో ఇయు సంబంధాలు కొంతమేర దెబ్బతింటున్న పరిస్థితుల్లో బీజింగ్, బ్రస్సెల్స్ మధ్య సంబంధాలపై పునరాలోచన చేయాలని ఉర్సులా వాన్ డెర్ లేయన్ వంటి వారు యోచిస్తున్నారు. రష్యాతో చైనా సంబంధాలు, వాణిజ్యపరమైన ఉద్రిక్తతల కారణంగా ఇయు, చైనా సంబంధాలు ఇబ్బందుల్లో పడ్డాయి. మంగళవారం బ్రస్సెల్స్‌లో లేయన్ మాట్లాడుతూ, చైనాతో సంబంధాల్లో ఉద్రిక్తతలు తగ్గించుకోవడానికే ఇయు చూస్తుందని చెప్పారు. వాణిజ్య, పెట్టుబడుల సంబంధాలను విస్తరించుకోవడానికి, ఒప్పందాలు కుదుర్చుకోవడానికి కూడా అవకాశాలు వున్నాయన్నారు. ఆ ఒప్పందాలు ఏమిటన్న వివరాలు ఆమె వెల్లడించలేదు. గతేడాది అక్టోబరులో చైనా తయారీ ఎలక్ట్రిక్ వాహనాలపై అప్పటికే వున్న సుంకాలకు అదనంగా ఇయు మరో 10శాతం సుంకాలు విధించింది. ఈ చర్యకు బీజింగ్ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. దీంతో బ్రాందీ వంటి కొన్ని ఇయు ఉత్పత్తులు చైనా మార్కెట్‌లో ప్రవేశించడానికి అడ్డంకులను చైనా పెంచింది.





మీ కోసం

కొబ్బరిచిప్పలు కొన్ని రోజుల పాటు తాజాగా ఉండాలంటే రోజూ నిమ్మరసం రాయాలి.

జీవన సౌరభం

నిజం చెప్పకపోవడం అబద్ధమైతే, అబద్ధాన్ని నిజం చేయాలనుకోవడం మోసం అవుతుంది.

కోళ్లు-చీమలు

అనగనగా ఓ
పల్లెపల్లెలోన కోళ్ళ
జంటతమ పిల్లలతో
కలిసిసంతసంగ
గడపసాగె

వీధులన్ని కలియతిరిగి
ఊరంతా చుట్టివస్తు
గింజలు ఏరుకు తింటూ
సుఖంగ జీవించసాగె

పిల్లలు ఎదిగిన కొద్దీ
సంబరంతో
పొంగిపోతు
ఆహారము వెతుకుటకై
ఉద్యమించి కదలసాగె

తన పిల్లల గుంపు
చూసి మురిసిన ఆ
కోళ్ళ జంట తమ
బలగం గొప్పదంటు
చెప్పుకుంటు తిరగసాగె

తమకిక ఎదురే లేదని
చిన్నా పెద్దని చూడక
సాటి కోళ్ళను సైచక
గర్వపడుతు మెదలసాగె

ఆహారంకై వెతుకుతు
చెట్టూ చేమలు తిరుగగ
చెట్టుకింద ఓ చీమల
పుట్ట వాటి కంటబడె

గింజలతో విసుగుచెంది
చీమలనాశించి కోళ్ళు
తన పిల్లల గుంపుతోడ
ఆ పుట్టపై దాడి
చేయసాగె

దొరికిన చీమలనెల్లా
విడువకుండా
వేటాడుతు పుట్టలోన
తలలుబెట్టి వెతుక్కుంటు
మింగసాగె

కోళ్ళ గుంపు దాడులతో
బెంబేలెత్తిన చీమలు
దిక్కుతోచని స్థితిలో
ఆందోళన చెందసాగె

కోళ్ళను
ఎదుర్కొనుటెట్లని
ఆలోచించిన చీమలు
పన్నాగం ఒకటి పన్ని
గుంభనంగ ఉండసాగె

ఎప్పటివలె కోళ్ళ జంట
పుట్ట చుట్టుముట్టు చేరి
పుట్టలోన తలలుదూర్చి
చీమలకై వెతుకసాగె

పక్కకు దాగిన చీమలు
చప్పున దాడులు చేసి
కోళ్ళ జంట తలలు పట్టి
గట్టిగ కసిగట్టి కొరికె

చీమల ప్రతిఘటనసలు
ఊహించని కోళ్ళ జంట
ఊపిరులాడక ఇక తమ
ప్రాణాలను కోల్పోయె

అనుకోని సంఘటనతో
భీతిల్లిన పిల్ల కోళ్ళు
బతుకు జీవుడా అంటూ
బిరబిరమని పరుగుతీసె

ఆబగ దొరికిన తిండిని
అందుకున్న చీమలన్నీ
కోళ్ళను కసితీర కొరికి
సంతసంగ ఆరగించె

చీమలెంతో చిన్నవని
తమనేమి చేస్తాయని
అహంకారపడిన కోళ్ళు
చేవ చచ్చి మట్టికరిచె

దురాశ దుఃఖం చేటు
మిడిసిపాటు పనికిరాదు
ఉన్నంతలో తృప్తి పడుట
ఉత్తమోత్తమ గుణం

ఎదుటి వారు ఎవరైనా
తక్కువ అంచనా తగదు
తలబిరుసుతో
వ్యవహరిస్తే
తప్పదెవరికైన ముప్పు

- నాగరాజు కామర్సు,
92480 93580.

నేను గీసిన బొమ్మ






డి.చందు,
జెడ్‌పి హైస్కూల్, దిరిసావంచ,
కనిగిరి మండలం, ప్రకాశంజిల్లా.

ఖాళీ గళ్లు నింపండి

పిల్లలూ, ఇక్కడ కనిపిస్తున్న జంతువుల పేర్లు ఇక్కడ కనిపిస్తున్న నిలువు, అడ్డం ఖాళీ గళ్లల్లో రాయాలి. క్లూ ఉంది చూడండి.



ఆట.. ఆ ఊరినే మార్చేసింది!

ఒకప్పుడు మద్యం ఏరులైపారిన గ్రామం అది. కుటుంబాలకి కుటుంబాలు మద్యం తయారు చేయడమే వృత్తిగా పెట్టుకున్నాయి. మద్యానికి తోడు ఊరంతా జూదం ఆడడమే ఆదాయ మార్గంగా చేసుకున్నాయి. ఇదంతా 1970ల నాటి మాట. ఇప్పుడు ఆ ఊరు.. 'చదరంగ గ్రామం'గా పేరు గడించింది. కేరళ మరొట్టిచల్ గ్రామం భారతదేశంలోనే అత్యధిక మంది చదరంగ క్రీడాకారులు ఉన్న గ్రామంగా వినుతికెక్కింది. ఈ మార్పు ఎలా వచ్చింది? గ్రామస్తులు ఏమంటున్నారు?



గ్రామ నడిబొడ్డున ఉన్న ఓ టీ షాపు, జనాలతో బాగా రద్దీగా ఉంది. అక్కడ ఓ టేబుల్ చుట్టూ జనం గుమిగూడి ఉన్నారు. టేబుల్‌కి ఒక వైపు పదిహేనేళ్ల గౌరీశంకర్ జయరాజ్ కళ్లకి గంతలు కట్టుకుని చదరంగం ఆడుతున్నాడు. ప్రత్యర్థి, తాత వయసున్న బేబీ జాన్ వేస్తున్న ఎత్తులకు పైఎత్తులు వేస్తూ చాలా చురుకుగా పావులు కదుపుతున్నాడు. జయరాజ్‌కి గైడెన్స్ ఇస్తూ ఆ గుంపులో ఓ రిఫరీ కూడా అక్కడ ఉన్నాడు. 40 నిమిషాల సేపు ఉత్కంఠభరితంగా సాగిన ఆటని టీ కొట్టుకు వచ్చినవారంతా తదేకంగా చూస్తూ ఉండిపోయారు. ఫోన్లు, వాలెట్లు, సగం తాగిన టీ కప్పులు, ఖాళీగా ఉన్న టేబుళ్లతో టీ కొట్టు మిగిలిన భాగం ఉంది. జయరాజ్ ఆటలో నెగ్గిన తరువాత, బేబీ జాన్ తనని ఎంతగానో మెచ్చుకున్నాడు. 'భారత్ గర్వించే కొత్త చెస్ ఆటగాడు మా జయరాజ్' అని గర్వంగా చెప్పాడు.

ఆరువేల పైచిలుకు జనాభా ఉన్న ఈ గ్రామం, త్రిసూర్ జిల్లాలో ఉంది. 2000 సంవత్సరంలో మరొట్టిచల్ గ్రామం 'ఇండియాస్ చెస్ విలేజ్‌గా' పిలవబడింది. ప్రతి కుటుంబంలో ఓ చదరంగ క్రీడాకారుడు ఉండడం, బస్‌స్టాపులు, కూరగాయల షాపులు, బహిరంగ ప్రదేశాలు, క్రీడామైదానాలు ఎక్కడ చూసినా చెస్‌బోర్డులపై ఆటలాడుతున్నవారే కనిపించేవారు. 4500 మంది అంటే గ్రామ జనాభాలో 75 శాతం మంది ప్రజలు చదరంగంలో నైపుణ్యం సాధించార'ని జాన్ తన గ్రామవిశేషాలు చెబుతున్నారు.

జయరాజ్ ప్రస్తుతం ఇండియాలో చదరంగ క్రీడలో టాప్ 600 మంది ఆటగాళ్లల్లో ఒకడిగా ఉన్నాడు. ప్రపంచ చెస్ ఫెడరేషన్ (ఎఫ్ఐడిఇ), త్వరలో జయరాజ్ ప్రపంచ క్రీడాకారుడిగా ఎదగాలని ఆకాంక్షిస్తోంది. ఎఫ్ఐడిఇ ర్యాంకింగ్‌లో 2012ని సొంతం చేసుకున్న జయరాజ్, విశ్వనాథ్ ఆనంద్, దొమ్మరాజులా గ్రాండ్‌మాస్టార్ కావాలని కలలుకంటున్నాడు. ఈ ఖ్యాతి ఒకప్పుడు ఆ గ్రామంపై అలుముకున్న అపఖ్యాతిని మాయం చేస్తుందని గ్రామస్తులు బలంగా నమ్ముతున్నారు.

40 ఏళ్ల క్రితం ఎలా ఉందంటే ...

1970ల్లో ఈ గ్రామంలోని ఓ మూడు కుటుంబాలు వ్యక్తిగత వినియోగం కోసం మద్యం తయారు చేసేవి. 80ల నాటికి గ్రామం మొత్తం అక్రమ మద్యం ఉత్పత్తికి కేంద్రంగా మారిపోయింది. 'మద్యం సేవించడం, రాత్రిపగలు ఇష్టానుసారం అమ్మడం' ఉండేదని జయరాజ్ మనర్మై అనే గ్రామస్తుడు నాటి రోజులను గుర్తుచేసుకున్నాడు. 'గ్రామంలో క్రమంగా వ్యవసాయం తగ్గుముఖం పట్టింది. పశుసంరక్షణ కూడా నాశనమైంది. అలాంటి పరిస్థితుల్లో ఆదాయం కోసం మద్యం విక్రయించే ఇళ్లల్లో జూదం ఆడడం మొదలుపెట్టారు. బుకీలు ఆడించేంతగా గ్రామంలో జూదశాలలు ఉండేవి. రానురాను గ్రామంలో పేదరికం పెరిగిపోయింది. పిల్లలు తొడుక్కునేందుకు బట్టలు కూడా ఉండేవి కావు. అప్పుడు మా గ్రామాన్ని ఏదో మహమ్మారి పీడిస్తున్నట్లు ఉండేది' అని మరో గ్రామస్తుడు ఆ భయానక పరిస్థితులను మన కళ్లముందుంచాడు.

అతనొచ్చాడు ...

1980ల చివర్లో గ్రామానికి చరలియిల్ ఉన్నికృష్ణన్ వచ్చాడు. అతను ఈ గ్రామస్తుడే. యువకుడిగా ఉన్నప్పుడు ప్రజా ఉద్యమాలకు ఆకర్షితమై ఉద్యమబాట పట్టాడు. కొంతకాలానికి తన 30వ పడిలో జనజీవన స్రవంతిలో కలవాలని గ్రామానికి తిరిగివచ్చాడు. గ్రామం నడిబొడ్డున టీ కొట్టు తెరిచాడు. అప్పటికే గ్రామంలో మద్య ప్రభావం ప్రబలంగా ఉంది. ఆ పరిస్థితిని ప్రత్యక్షంగా చూసిన ఉన్నికృష్ణన్ చాలా కలవరపడ్డాడు. 'ఆ రోజులు మా గ్రామానికి చీకటి రోజులు' అంటూ గ్రామం బాగు కోసం ఏయే పరిస్థితులు ఎదుర్కొన్నాడో చెబుతున్నాడు.

'నా చిన్ననాటి స్నేహితులను ఓ సమూహంగా ఏర్పాటు చేశాను. మేమంతా మద్యం తయారుచేస్తున్న



కుటుంబాల్లోని భార్యలు, తల్లులతో సమావేశాలు ఏర్పాటుచేశాం. ముందు వారిలో చైతన్యం తీసుకువచ్చాం. ఆ మహిళల సాయంతో తిరుగుబాట్లు చేయించాం. మద్యం దుకాణాలు కొల్లగొట్టాం. అప్పుడు మాపై దాడులు కూడా జరిగేవి. కానీ మేము వెనక్కితగ్గలేదు. ఇతర గ్రామాల నుండి మద్దతు పొందాం. మా బలం పెరిగింది. క్రమంగా మరొట్టిచల్‌లో మద్యం విక్రయాలు తగ్గుముఖం పట్టాయి' అని గ్రామాభివృద్ధికి ప్రజలను ఎలా ఐక్యం చేశారో ఉన్నికృష్ణన్ వివరించారు.

చెస్ వైపు అడుగులు..

కొల్లగొట్టిన మద్యం దుకాణాల్లో ఉన్న విక్రేతలు, జూదరులు, మద్యపానం చేసేవారినే ఉన్నికృష్ణన్ చెస్ క్రీడాకారులుగా తయారుచేయడం మొదలుపెట్టారు. ఇద్దరిద్దరినీ వేరు చేసి వారి ముందు చెస్ బోర్డు పెట్టేవారు. 'అలా చేయడం వల్ల మద్యానికి అలవాటు పడ్డ వారంతా క్రమంగా చెస్ వైపు విపరీతంగా ఆకర్షితమయ్యారు' అని జాన్ చెబుతున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి నిధులు సేకరించి, గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు చెస్ టోర్నమెంటులు నిర్వహించడంలో జాన్ మెచ్చుకోదగ్గ కృషి చేశారు.

'ఈ చెస్ బోర్డు మా గ్రామ రూపురేఖలనే మార్చేసింది. ప్రశాంత వాతావరణం తీసుకొచ్చింది' అని గర్వంగా చెబుతున్న జాన్, 'ఇక్కడ ఉన్నికృష్ణన్ టీ ఒక్కటే ఇవ్వడు, గ్రామస్తుల భవిష్యత్తుకు బంగారు బాట వేస్తాడు. ముందు అతను గ్రామాన్ని మద్యరహితంగా తయారుచేశాడు. తరువాత చెస్ క్రీడలో మేటిగా నిలిపాడు' అని స్నేహితుని గురించి గర్వంగా చెబుతున్నాడు.

గ్రామస్తులు ఏమంటున్నారు?

'మాకు చెస్ తెలియక ముందు, విపరీతంగా మద్యం సేవించడం వల్ల చాలామంది నీరసంగా ఉండేవాళ్లం. దేనిపై ఏకాగ్రత ఉండేది కాదు. చెస్ మాకు కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది' అని ఒకప్పుడు తాగుడుకు బానిసైన ఫ్రాన్సిస్ అంటున్నాడు. ఉన్నికృష్ణన్ టీ కొట్టులో జయరాజ్, జాన్ ఆడుతున్న ఆటను చూస్తున్న గుంపులో అతడు కూడా ఉన్నాడు.

ఉన్నికృష్ణన్ తన ఉన్నత లక్ష్యం గురించి ఏం చెప్పాడంటే, 'మా గ్రామం నుంచి 1000 మంది గ్రాండ్ మాస్టార్లు రావాలని లక్ష్యం పెట్టుకున్నాను. 2016లో యూనివర్సల్ ఆసియన్ రికార్డుల్లో మా గ్రామం పేరు మార్మోగిపోయింది. వివిధ పోటీల్లో పాల్గొంటున్న వెయ్యి మంది చెస్ క్రీడాకారులు ఉన్న గ్రామంగా మరొట్టిచల్‌కి గుర్తింపు వచ్చింది' అంటున్న 67 ఏళ్ల ఉన్నికృష్ణన్‌ని గ్రామస్తులంతా 'మా రాజు, మా సంరక్షకుడు' అని పిలుచుకుంటారు.

గ్రామంలో ఎక్కడచూసినా, ఎవరిని కదిపినా, చెస్ వాళ్ల జీవితాల్లో తీసుకొచ్చిన మార్పుల గురించే చెబుతారు. ప్రమాదాల బారిన పడి మంచానికే పరిమితమైన వారు ఆట ద్వారా త్వరగా కోలుకున్నామని చెబుతారు. చదువుపై శ్రద్ధ పెరిగిందని విద్యార్థులు అంటారు. మానసికంగా ప్రశాంతంగా ఉంటున్నామని మహిళలు అంటారు. ఇలా ఆ ఊరిని ఓ మంచి వ్యాపకం మార్చేసింది.

బోణి కొట్టేదెవరో..!

- నేడు భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య తొలి వన్డే
- మ. 1.30గం॥ల నుంచి



నాగ్‌పూర్: భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య నాగ్‌పూర్ వేదికగా తొలి వన్డే జరగనుంది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా ఇంగ్లండ్‌తో జరిగే తొలి వన్డేలో ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడే భారతజట్టు తలపడనుంది. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో నిరాశపరిచిన సీనియర్ ఆటగాళ్లు రోహిత్, కోహ్లిలకు ఈ సిరీస్ కీలకం కానుంది. స్వదేశీ పిచ్‌లపై సత్తా చాటి ఛాంపియన్స్ ట్రోఫీ బరిలోకి దిగాలని వీరు ఉవ్విళ్ళూరుతున్నారు. ఐసిసి వన్డే ప్రపంచకప్ తర్వాత ఆగస్టులో శ్రీలంకతో మూడు వన్డేల సిరీస్ ఆడేందుకు వెళ్లిన భారతజట్టులో ఉన్న కోహ్లి ఆ మూడు వన్డేల్లో కేవలం 58పరుగులు మాత్రమే కొట్టాడు. కెప్టెన్ రోహిత్ శర్మ మాత్రమే 157పరుగులే చేశాడు. పేస్ భారాన్ని జస్ప్రీత్ బుమ్రా స్థానంలో మహ్మద్ షమీ అందుకోనున్నాడు. అతడు దాదాపు 16నెలల తర్వాత వన్డేల్లో మళ్లీ పునరాగమనం చేయనున్నాడు. ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు టీమిండియాకు ఇదే ఆఖరి వన్డే సిరీస్ కావడంతో వీరి ప్రదర్శనపైనే అందరి దృష్టి నెలకొని ఉంది.

ఇంగ్లండ్ జట్టులో జో రూట్‌కు చోటు..

భారత్‌తో తొలి వన్డేకు ముందురోజే ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు(ఇసిబి) తమ తుది జట్టును బుధవారం ప్రకటించింది. జోస్ బట్లర్ కెప్టెన్‌గా ఎంపికవ్వగా.. మాజీ సారథి జో రూట్‌కు తొలి వన్డే జట్టులో చోటు దక్కింది. దీంతో అతడు దాదాపు 16 నెలల తర్వాత తొలిసారిగా వన్డే ఫార్మాట్ బరిలో దిగనున్నాడు. ఓపెనర్లుగా బెన్ డకెట్, ఫిల్ సాల్ట్ తమ స్థానాలను పదిలం చేసుకోగా.. జో రూట్ వన్‌డౌన్‌లో ఆడనున్నాడు. కెప్టెన్ బట్లర్ ఐదో స్థానంలో బ్యాటింగ్‌కు రానున్నాడు. ఆల్‌రౌండర్ల జాబితాలో లియామ్ లివింగ్‌స్టోన్-జాకొబ్ బెతెల్ జోడీ కొనసాగనుంది. బట్లర్ సారథ్యంలోని ఇంగ్లండ్ జట్టు గత రెండు వన్డే సిరీస్‌లను కోల్పోయింది. ఆస్ట్రేలియా, వెస్టిండీస్ జట్ల చేతిలో ఓటమిపాలైంది. పరిమిత ఓవర్ల క్రికెట్‌లోనూ ఇంగ్లండ్ హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన బ్రెండన్ మెకల్లమ్‌కు ఈ సిరీస్ కీలకం కానుంది. ఈ సిరీస్‌కు ముందు భారత్‌తో జరిగిన ఐదు టి20ల సిరీస్‌ను ఇంగ్లండ్ జట్టు 1-4తో కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఇంగ్లండ్ జట్టు కనీసం వన్డే సిరీస్‌లోనైనా సత్తా చాటాలన్న దృఢ నిశ్చయంతో బరిలోకి దిగుతోంది.

ఛాంపియన్స్ ట్రోఫీకి నితిన్ మీనన్ దూరం..

ఐసిసి ఎలైట్ ప్యానెల్ అంపైర్స్, భారత్‌కు చెందిన నితిన్ మీనన్ ఛాంపియన్ ట్రోఫీకి దూరమయ్యాడు. వ్యక్తిగత కారణాల రీత్యా తాను ఛాంపియన్స్ ట్రోఫీకి అందుబాటులో ఉండడం లేదని ట్విటర్ వేదికగా ఐసిసికి లేఖ రాశాడు. ఐసిసి 15మంది అధికారుల జాబితాను ప్రకటించగా.. అందులో 12మంది అంపైర్లు, ముగ్గురు రిఫరీలు ఉన్నారు. పాకిస్తాన్‌లోని కరాచీ, రావల్పిండి, లాహోర్ వేదికగా ఛాంపియన్స్ ట్రోఫీ జరగనుండగా.. భారత్ ఆడే మ్యాచ్‌లన్నీ దుబాయ్ వేదికగా జరగనున్నాయి. ఛాంపియన్స్ ట్రోఫీ ఫిబ్రవరి 19న జరిగే తొలి మ్యాచ్‌తో ప్రారంభమై.. మార్చి 9న జరిగే ఫైనల్ మ్యాచ్‌తో ముగియనుంది.

జట్లు(అంచనా)...

భారత్: రోహిత్(కెప్టెన్), శుభ్‌మన్, కెఎల్ రాహుల్, కోహ్లి, పంత్(వికెట్ కీపర్), సుందర్/వరుణ్ చక్రవర్తి, శ్రేయస్, హార్దిక్, అక్షర్/జడేజా, షమీ, అర్షదీప్.

ఇంగ్లండ్: బట్లర్(కెప్టెన్), డకెట్, సాల్ట్(వికెట్ కీపర్), రూట్, బ్రూక్, లివింగ్ స్టోన్, బెథెల్, కార్సే, ఆర్చర్, రషీద్, మహమూద్.

టెన్నిస్‌కు హలెప్ గుడ్‌బై



న్యూయార్క్: రొమేనియాకు చెందిన మాజీ టాప్‌సీడ్ టెన్నిస్ క్రీడాకారిణి సిమోనా హలెప్ సంచలన నిర్ణయం తీసుకుంది. 33ఏళ్ల హలెప్ అంతర్జాతీయ టెన్నిస్‌కు గుడ్‌బై చెబుతున్నట్లు తాజాగా వెల్లడించింది. డోపింగ్ కారణంగా సస్పెన్షన్ ముగియడంతో తిరిగి టెన్నిస్‌లో పునరాగమనం చేసినా ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. తాజాగా జరిగిన ట్రాన్సిల్వేనియా ఓపెన్‌లో లూసియా బ్రోంజెట్టి చేతిలో 1-6, 1-6తో వరుససెట్లలో ఓటమిపాలైంది. ఆ ఓటమి అనంతరం ప్రేక్షకులనుద్దేశించిన మాట్లాడుతూ తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని వెల్లడించింది. 'తాను మునుపటిలా ఆడలేకపోతున్నానని, శరీరం కూడా సహకరించడం లేదని, టెన్నిస్‌కు గుడ్ బై చెప్పడమే సరైన నిర్ణయం' అని వెల్లడించింది. 2017లో డబ్ల్యుటిఎ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో నిలిచిన హలెప్ ప్రస్తుతం 870వ ర్యాంక్‌లో ఉంది. తాజా టోర్నీలో వైల్డ్‌కార్డ్ ద్వారా రీ ఎంట్రి చేసినా ప్రయోజనం లేకపోయింది. 2019లో సెరెనా విలియమ్స్‌ను ఓడించి, 2018లో ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో స్లోన్ స్టీఫెన్స్‌ను ఓడించి విజేతగాగా నిలిచింది. 2018 ఆస్ట్రేలియన్ ఓపెన్, 2014, 2017లో ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల రన్నరప్‌గా నిలిచింది. 2022 యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ ఓపెన్‌లో చివరి సారిగా ఆడిన హలెప్.. ఉక్రెయిన్‌కు చెందిన డారియా స్నిగుర్ చేతిలో 2-6, 6-0, 4-6తో ఓటమిపాలైంది.

అభిషేక్ కెరీర్ బెస్ట్ ర్యాంక్

బ్యాటర్ల జాబితాలో రెండు స్థానం ● ఐసిసి టి20 ర్యాంకింగ్స్



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) ప్రకటించిన తాజా టి20 ర్యాంకింగ్స్‌లో భారత యువ బ్యాటర్ అభిషేక్ శర్మ కెరీర్‌లో తొలిసారిగా అత్యుత్తమ స్థానానికి ఎగబాకాడు. ఇంగ్లండ్‌తో జరిగిన ఐదో టి20లో అభిషేక్ శర్మ సెంచరీ, రెండో టి20లో తిలక్ వర్మ అర్ధసెంచరీలతో రాణించారు. దాంతో అభిషేక్ శర్మ ఐసిసి ర్యాంకింగ్స్‌లో ఒకేసారి 38 స్థానాలు ఎగబాకి.. రెండో స్థానానికి చేరుకున్నాడు. అప్పటి వరకు ఆ స్థానంలో ఉన్న టీమిండియా బ్యాటర్ తిలక్ వర్మ మూడో స్థానానికి చేరుకున్నాడు. ఆస్ట్రేలియా బ్యాటర్ ట్రావిస్ హెడ్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. 855 రేటింగ్ పాయింట్లతో టీ20 నెంబర్ బ్యాటర్‌గా ట్రావిస్ హెడ్ కొనసాగుతుండగా.. అభిషేక్ శర్మ 829 పాయింట్లతో రెండోస్థానం, తిలక్ వర్మ 803 రేటింగ్ పాయింట్లతో మూడోస్థానం, ఫిల్ సాల్ట్ 798 రేటింగ్ పాయింట్లతో నాలుగో స్థానంలో ఉన్నాడు. టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ 738 రేటింగ్ పాయింట్లతో ఐదో స్థానంలో కొనసాగుతున్నాడు. ఇక టి20 బౌలర్ల ర్యాంకింగ్‌లో వరుణ్ చక్రవర్తి తన ర్యాంకును మెరుగుపరుచుకున్నాడు. ఇంగ్లాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన వరుణ్.. మూడు స్థానాలు ఎగబాకి కెరీర్ అత్యుత్తమ 705 పాయింట్లతో రెండోస్థానంలో ఉన్నాడు.

'భక్త ప్రహ్లాద'కు 93 ఏళ్లు



తెలుగు చలన చిత్ర పరిశ్రమలో మొట్టమొదటి పూర్తి టాకీ చిత్రం 'భక్త ప్రహ్లాద' 1932, ఫిబ్రవరి 6వ తేదీన విడుదలైంది. హెచ్‌ఎం రెడ్డి ఈ చిత్రానికి దర్శకుడు, నిర్మాత కూడా. మొదటి హిందీ టాకీ చిత్రం నిర్మించిన స్టూడియోలోనే ఈ తెలుగు టాకీ చిత్రాన్ని నిర్మించారు. అప్పట్లో సురభి నాటక సమాజం వారు ఈ 'భక్త ప్రహ్లాద' నాటకాన్ని ఎక్కువగా ప్రదర్శించేవారు. ఆ నాటక సమాజం వాళ్లని అప్పట్లో బొంబాయికి పిలిపించి ఈ చిత్రానికి కావాల్సిన కథ, తీసే ప్రణాళికను చిత్ర యూనిట్ రూపొందించింది. ఈ సినిమా తీయటానికి అప్పట్లో రూ.18 వేలు వ్యయం చేశారు. ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో గురువారంనాడు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తెలుగు సినిమా పుట్టిన రోజు వేడుకలను నిర్వహిస్తున్నామని ప్రధాన కార్యదర్శి జెవి మోహన్‌గౌడ్, అధ్యక్షులు ఎఎం రత్నం ఒక ప్రకటనలో తెలిపారు.

పవన్, మహేష్ సినిమాలతో రూ.100 కోట్ల నష్టం



'పవన్ కళ్యాణ్‌తో కొమరం పులి, మహేష్‌బాబుతో ఖలేజా లాంటి సినిమాలు తీసి రూ.100 కోట్లు వరకూ నష్టపోయా. ఆరోజుల్లో కేవలం ఏ సినిమానైనా ఏడాదిలోపే పూర్తిచేసేవాళ్లం. నా దురదృష్టం వల్లనేమో కొమరం పులి, ఖలేజా సినిమాలు నిర్మించటంలో ఎక్కువ టైమ్ తీసుకోవాల్సి వచ్చింది. ఈ రెండు సినిమాలు ఆలస్యమవ్వటానికి చాలా కారణాలు ఉన్నాయి. భారీగా నష్టపోయిన నాకు ఏ హీరో కూడా సపోర్టు చేయలేదు. కష్టకాలంలో ఉన్నప్పుడు ఏ ఒక్కరు కూడా ఇండస్ట్రీ నుంచి అయ్యోపాపం అని కనీసం పలకరించిన పాపాన పోలేదు' అని టాలీవుడ్ నిర్మాత సింగనమల రమేష్ అన్నారు. 2011లో గచ్చిబౌలిలో హైదరాబాద్ వ్యాపారవేత్తను బెదిరించి రూ.12 కోట్లు స్వాహా చేశారనే అభియోగంపై రమేష్‌బాబుపై కేసు నమోదైంది. ఈ కేసులో రమేష్‌బాబును కోర్టు నిర్దోషిగా తేల్చింది. దీంతో ఆయన తాజాగా మీడియాతో మాట్లాడుతూ పై విధంగా వ్యాఖ్యానించారు.

సిద్ధమవుతున్న జాంబిరెడ్డి -2

తేజ సజ్జా హీరోగా దర్శకుడు ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'జాంబీ రెడ్డి'. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రానికి సీక్వెల్ రానుంది. అయితే జాంబీ రెడ్డి - 2 దర్శకత్వ బాధ్యతల నుంచి ప్రశాంత్ వర్మ తప్పుకున్నారు. ఈ సీక్వెల్‌కు ఆయన కథ మాత్రమే అందిస్తున్నారు. బాలీవుడ్ దర్శకుడు సుపర్ణ్ వర్మ ఈ సీక్వెల్‌కి దర్శకత్వం వహించబోతున్నారు. వెంకటేష్, రానా దగ్గుబాటి కాంబోలో వచ్చిన 'రానా నాయుడు'కు సుపర్ణ్ వర్మ దర్శకత్వం వహించారు. ఇప్పుడు జాంబీ రెడ్డి సీక్వెల్‌తో టాలీవుడ్‌లో అడుగుపెడుతున్నాడు. ఈ సీక్వెల్‌ను టాలీవుడ్ నిర్మాణ సంస్థ సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ నిర్మించనున్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68